ఆంధ్రజ్యోతి

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

● గురువారం 31 ఆగస్టు 2017 | 16 పేజీలు

ఇస్రో నమ్మినబంటు

నేడు రోదసిలోకి..



ధ్రువ ఉపగ్రహ వాహక నౌక.. పీఎస్ఎల్వీ... ఇస్రో నమ్మినబంటు. ఉపగ్రహం ఏదైనా.. ఎన్నైనా శాస్త్రవేత్తల అంచనాలను తూ.చ తప్పకుండా పాటిస్తూ లక్ష్యాన్ని చేరుకుంటుంది. భారత ఖ్యాతిని, మన శాస్త్రవేత్తల సత్తాను నలుదిశాలా వ్యాపింపజేసిన ఈ రాకెట్‌ను రామబాణంతో పోల్చుతుంటారు. గురి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదిస్తుందన్న ధీమా ఈసారి కూడా మన శాస్త్రవేత్తల్లో కనిపిస్తోంది. అందుకే గురువారం రాత్రి 7 గంటలకు పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగమైనా షార్‌లో ఎటువంటి హడావుడి లేదు. విజయం నల్లేరుపై నడకేనన్న ధీమాతో ఎవరి విధుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. మరోవైపు ఇస్రో చైర్మన్ కిరణ్‌కుమార్ బుధవారం రాత్రి షార్‌కు చేరుకుని శాస్త్రవేత్తలతో సమీక్షించి, ప్రయోగ సన్నాహాలను పర్యవేక్షించారు.

రాత్రి 7 గంటలకు
పీఎస్ఎల్వీ-సీ39 ప్రయోగం

వివరాలు మెయిన్‌లో..

● 19.25 నిమిషాలలో కక్ష్యలోకి ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ● ప్రారంభమైన కౌంట్‌డౌన్ ● శరవేగంగా ఇంధనం నింపే ప్రక్రియ ● శాస్త్రవేత్తల్లో విజయంపై ధీమా ● షార్‌కు చేరుకున్న ఇస్రో చైర్మన్

తెలుగు తమ్ముళ్లలో

నంద్యాల జోష్!

- తొలిగా వెంకటగిరిలో నియోజకవర్గ సర్వే
- ముగ్గురు మంత్రులు, జిల్లా నేతల హాజరు
- పది నుంచి ఇంటింటికి టీడీపీ కార్యక్రమం
- పార్టీ బలోపేతం దిశగా చర్యలు
- కాంగ్రెస్ కీలక నేతలకు పార్టీలోకి ఆహ్వానం
- క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లపై వేటుకు సిద్ధం
- డీలా పడుతున్న వైసీపీ నేతలు

8లో...

ఇప్పుడైతే

వద్దు బాబోయ్!

పోలీసుశాఖలో విచిత్ర పరిస్థితి

ఖాళీగా పలు కీలక స్థానాలు

వచ్చేందుకు అధికారుల అనాసక్తి

గూడూరు, నెల్లూరు డీఎస్పీ పోస్టులు ఖాళీ 6

మరో 3 సీఐ స్థానాలు కూడా..



మున్సిపల్ సమావేశంలో తారకేశ్వరకు అనుమతులు ఇవ్వకూడదంటూ కమిషనర్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్ లక్ష్మమ్మ

సూళ్లూరుపేట

మునిగిపోదులే..!

- ప్రమాదకర 'తారకేశ్వర'కు అనుమతులు
- పార్కు ఏర్పాటుకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఓకే!
- కౌన్సిలర్ల అభ్యంతరం వ్యక్తం చేసినా డోంట్‌కేర్!
- కౌన్సిల్ ఆమోదించిందంటూ నమోదు

- వివరాలు 9లో

లాకర్ల బరువెంత..

బ్యాంకుల్లో బ్యాలెన్స్ ఎంత!?

జిల్లాలో ప్రధాన క్రికెట్ బుకీల ఆర్థిక లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఎక్కడెక్కడ బ్యాంకు ఖాతాలు ఉన్నాయి? లాకర్ల పరిస్థితి ఏమిటి? లావాదేవీలు ఎక్కడి నుంచి జరిగాయి తదితర వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇందుకోసం తొమ్మిది మంది బుకీలను తమ కస్టడీకి తీసుకునేందుకు ఇప్పటికే పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కావలి పోలీసులు అరెస్టు చేసిన మన్నెం శ్యాంప్రసాద్, మరో ముగ్గురి బుకీలపై గురువారం విచారణ జరగనున్నది. ఇక నెల్లూరు పోలీసులు అరెస్టు చేసిన కృష్ణసింగ్, మరో నలుగురుపై వచ్చే నెల 4వ తేదీన కోర్టు విచారించనున్నట్లు సమాచారం. కాగా, రిమాండ్‌లో ఉన్న బుకీలను బుధవారం కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకురాగా కొద్దిసేపు వారు హల్‌చల్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఓ హోటల్ నుంచి బిర్యానీ తెచ్చుకుని తినడం పలు విమర్శలకు తావిస్తోంది.



- క్రికెట్ బుకీల ఆర్థిక లావాదేవీలపై ఆరా
- చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌లలో బెట్టింగ్ వ్యవహారం
- పోలీస్ కస్టడీ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు
- కావలి పిటిషన్‌పై నేడు విచారణ
- కోర్టు ఆవరణలో రిమాండ్ బుకీలకు బిర్యానీ
- నిబంధనలు పక్కన పెట్టి మర్యాదలా!?
- పోలీసుల తీరుపై విమర్శల వెల్లువ

8 లో..

పత్తి.. పరేషాన్!



- రూ.29కి పడిపోయిన కిలో ధర
- ఎకరాకు 500 కిలోలే దిగుబడి
- పెట్టుబడులూ రాక రైతన్న లబోదిబో
- నాసిరక విత్తనం, తెగుళ్ల సమస్యలు
- ఖరీఫ్‌లో తగ్గిన సాగు విస్తీర్ణం 7

సొసైటీ అధ్యక్షులను గౌరవించండి!

జీతం తీసుకునే వారికంటే మేమే సేవలందిస్తున్నాం

అధికారుల తీరుపై కలెక్టర్ సమాధానం ఇవ్వాలి

బ్యాంకు ఉద్యోగులకు సమానంగా వయోపరిమితి

రైతుల వ్యక్తిగత రుణాల పెంపు

మద్దూరుపాడు సొసైటీ విలీనానికి ఆమోదం

8న శతాబ్ది ఉత్సవాలు

డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి



2

సొసైటీ అధ్యక్షులను గౌరవించండి!

అధికారుల తీరుపై కలెక్టర్ సమాధానం ఇవ్వాలి

బ్యాంకు ఉద్యోగులకు సమానంగా వయోపరిమితి

సర్వసభ్య సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు

నెల్లూరు (సాంస్కృతికం) : రైతు ప్రతినిధులుగా ఎన్నుకోబడిన సొసైటీ అధ్యక్షులను జిల్లా అధికారులు మధ్యవర్తులుగా, తమ బంట్రోతులుగా భావిస్తున్నారని, వారి తీరుపై కలెక్టర్ సమాధానం ఇవ్వాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నెల్లూరులోని ఆ బ్యాంకు సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ సొసైటీల చైర్మన్‌లు ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయింపుల్లో అధికారులు వ్యవహరిస్తున్న తీరును ప్రస్తావించారు. దీనిపై చైర్మన్ తీవ్రంగా స్పందించారు. జిల్లా యంత్రాంగం రైతులకు సేవలు అందించే సొసైటీలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సొసైటీల కార్యాలయాలు, గోదాములన్నిటినీ ప్రభుత్వ శాఖలు వాడుకుంటున్నాయని గుర్తు చేశారు. ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించడంలో వివక్ష జరుగుతోందని, దీనిని జిల్లా అధికారులు పరిశీలించి సొసైటీలకు ప్రాధాన్యం ఇచ్చి రైతులకు సేవలు అందించాలని కోరారు. నెల నెలా జీతాలు, భత్యాలు తీసుకునే అధికారులకంటే సొసైటీ అధ్యక్షులు ఎన్నో సేవలు అందిస్తున్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బ్యాంకు ఉద్యోగులతో సమానంగా సొసైటీలలో పనిచేసే సీఈవోలు, సిబ్బందికి వయోపరిమితి 58 - 60 సంవత్సరాలకు వర్తిస్తుందన్నారు. సెప్టెంబర్ ఆఖరుకు సొసైటీల నుంచి వసూలు చేసిన షేర్ క్యాపిటల్‌కు బాండ్‌లు ఇస్తామన్నారు. సొసైటీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించేందుకు బ్యాంకు ప్రత్యేక సెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు సొసైటీలు ప్రభుత్వం సహకార శాఖ ఇచ్చే సూచనల అమలుకు ఉన్నట్లు తెలిపారు. వాణిజ్య బ్యాంకులతో సమానంగా అన్నీ సంక్షేమ పథకాల కోసం తమ షేర్ ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ చైర్మన్‌లకు గౌరవవేతనంపై సెప్టెంబర్ 7వ తేదీన జరిగే అప్కాబ్ బోర్డు సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 8వ తేదీ జరిగే బ్యాంకు శతాబ్ది వేడుకల విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం సొసైటీ అధ్యక్షులు రంగనాథం, కృష్ణయ్య తదితరులు మాట్లాడుతూ బయోమెట్రిక్ విధానంలో సమస్యలు, పంట రుణాలను రూ.1 లక్షకు పెంచాలని, సొసైటీల ద్వారా సబ్సిడీ రుణాలు, 25 శాతంతో నా బార్డు రుణాలు, అసైన్‌మెంట్ భూములకు రుణ సౌకర్యం, సొసైటీల ద్వారా ట్రాక్టరు రుణాలు ఇవ్వాలని కోరారు. సొసైటీల నుంచి వసూలు చేసిన షేర్ క్యాపిటల్ తిరిగి సొసైటీలకు ఇవ్వాలని పేరుకు పోయిన రానీ బాకీల భారాన్ని ప్రభుత్వం తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్‌చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహనరెడ్డి, అప్కాబ్ జీఎం భాస్కరరెడ్డి, బ్యాంకు సీఈవో వై సరిత, డీసీవో సుధాభారతి, డీజీఎంలు ఎన్ ఉషారాణి, ఎన్‌వీ నాగేంద్రకుమారి, బ్యాంకు డైరెక్టర్లు కోడూరు కమలాకరరెడ్డి, బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్, దామిశెట్టి సుదీర్, వెంకటశేషారెడ్డి,కలికి మాధవరెడ్డి, యారవ కృష్ణయ్య, శివరామ కృష్ణారెడ్డి, సహాయ జనరల్ మేనేజర్ వై దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధనుంజయరెడ్డి

● బ్యాంకర్ల పనితీరుపై ఆగ్రహం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు బ్యాంకు బ్యాలెన్సు షీట్ తనకు చూపకుండా ఈ సమావేశంలో అందచేయడంపై చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిదికాదని, బ్యాంకులో అధికారం చెలాయించడం కాదు పనితీరు కూడా మార్చు కోవాలని హెచ్చరికలు చేశారు.

● వ్యక్తిగత రుణం పెంపు : చైర్మన్

జిల్లాలోని వ్యవసాయ ప్రాథమిక సొసైటీలు ఆర్థిక పరిపుష్టి కోసం రైతు వికాస పథకం కింద రైతులకు అందించే వ్యక్తిగత రుణాలను పెంచేందుకు బ్యాంకు పాలక మండలి ఆమోదం తెలిపిందని చైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి తెలిపారు. పాలక మండలి సమావేశం అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. బ్యాంకు 100 సంవత్సరాల వేడుకల కానుకగా ఈ రుణాలను పెంచామన్నారు. ఇప్పటివరకు రైతు వికాస పథకం కింద సొసైటీలు రూ. 5 లక్షలు, బ్యాంకు రూ.10 లక్షలు వ్యక్తిగత రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి సొసైటీల ద్వారా రూ.10 లక్షలు, బ్యాంకు ద్వారా రూ.20 లక్షల వరకు ఇస్తామన్నారు. రైతు వికాస పత్రం కింద వ్యవసాయేతర అభివృద్ధి పనుల కోసం 5వేల మంది రైతులకు రూ. 160 కోట్ల రుణాలుగా అందచేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు దీర్ఘకాలిక రుణాలను రూ. 2.05 కోట్లు అందచేశామన్నారు. దువ్వూరు సొసైటీకి సమావేశ మందిరం నిర్మాణానికి రూ.10 లక్షలు, మల్లాం సొసైటీకి రూ. 50 లక్షలు క్యాష్ క్రెడిట్ కింద మంజూరు చేశామన్నారు. మద్దూరుపాడు సొసైటీని డీసీసీబీలో విలీనానికి ఆమోదం తెలిపామన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శతాబ్ది వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎంచాయతీ రాజ్ శాఖా మంత్రి నారా లోకేష్‌బాబులను ఆహ్వానించినట్లు తెలిపారు.

అబ్బో.. జెంబో ఆహ్వాన పత్రం

వచ్చే నెల 8వ తేదీ మధ్యాహ్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శతాబ్ది వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ఆ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుకగా జరుగుతున్నాయి. శతాబ్ది వేడుకల ఆహ్వాన పత్రికలో ప్రత్యేక ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు ముఖ్య అతిథులు, గౌరవ అతిథులు, ఆత్మీయ అతిథులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆహ్వాన కమిటీ, పాలక మండలి సభ్యులు పేర్లు ఇలా మొత్తం 84 పేర్లు ముద్రించారు. దీంతో అందరూ ఈ పత్రికను అబ్బో... జెంబో ఆహ్వాన పత్రిక అంటూ ముద్దుగా పిలుచుకుంటున్నారు.



కరువు నివారణకు పక్కా ప్రణాళిక

● వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్

?: జిల్లాలో కోరలు చాస్తున్న కరువును ఎలా నివారిస్తారు.

!: ఇందుకు మా శాఖ ద్వారా పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నాము. కరువు ఛాయలున్న ప్రాంతాలలో ప్రత్యామ్నాయ పంటలు సిఫార్సు చేస్తున్నాము. పెద్దగా పంటలు పండని ప్రాంతాలను ఇప్పటికే గుర్తించడం జరిగింది. ప్రత్యామ్నాయ మార్గాలవైపు రైతులను మళ్లించేందుకు కృషి చేస్తాం.

?: వర్షాభావం, భూగర్భ జలాలు అడుగంటడం వంటి సమస్యలను ఎలా ఎదుర్కొంటారు.

!: రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నీటి సమస్య కొంత వరకు తీరే అవకాశం ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఇబ్బందుల్లేవు. ఐదు మండలాలు మినహా జిల్లా అంతటా వర్షపాతం ఆశాజనకంగానే ఉంది.

?: వరికి ప్రత్యామ్నాయ సాగంటే...

!: వరి సాగు పెద్ద పంట. దీనికి నీటి అవసరం ఎక్కువ. దీనికి ప్రత్యామ్నాయంగా మినుము, పెసలు, రాగులు వంటివి సాగుచేయాలి. వాటికి నీటి అవసరం తక్కువ. ఈ తరహా పంటలకు విత్తనాలు మా వద్ద సిద్ధంగా ఉన్నాయి. వాటిని 50 శాతం రాయితీతో అందచేస్తున్నాము.

?: కానీ, ఆ మూడు రకాల పంటలు అన్ని నేలల్లో పండవుగా...

!: కావచ్చు. కానీ, పప్పు దినుసుల రకాల పంటలను వరికి ప్రత్యామ్నాయంగా ఈ సారికి సాగుచేయాలని రైతులకు సూచిస్తున్నాము. ఏ నేలలో ఏ రకం సాగు చేయాలో రైతు శిక్షణ కేంద్రం ద్వారా గ్రామాలలో సదస్సులు ఏర్పాటు చేసి వివరిస్తున్నాము. పంటలు వేసిన తరువాత రైతులకు నష్టాలు రాకూడదన్నదే మా ఉద్దేశం.



?: మీరు చెప్పిన ప్రణాళిక అమలు ఊసే గ్రామాల్లో కనిపించడం లేదు. దీనికి మీరేమంటారు.

!: అలా ఏమీ లేదు. మా శాఖ అధికారులు, సిబ్బంది రైతుల సేవలోనే ఉన్నారు. ఎక్కడ సమస్యలున్నాయో అక్కడ మా శాఖ ఉంటుంది. ఎవరికైనా ఇబ్బంది అనిపిస్తే స్వయంగా నాకు చెప్పవచ్చు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

- నెల్లూరు (వ్యవసాయం)

సీపీఎస్ రద్దు చేయండి !

● జిల్లాలో 25వేల మంది సీపీఎస్ ఉద్యోగులు

● 1న విజయవాడలో మిలియన్ మార్చ్

ఉద్యోగవర్గం

నెల్లూరు (కలెక్టరేట్) : కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) రద్దు కోరుతూ జిల్లా నుంచి వేలాది మంది గళమెత్తనున్నారు. సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌కు జిల్లా నుంచి వేలాదిగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిపోనున్నారు. ఇందుకోసం జిల్లాలో సభలు సమావేశాలు నిర్వహించడంతోపాటు, ప్రతికా ప్రకటనలు కూడా జారీ చేశారు. 2003 డిసెంబర్ 22న ఎన్‌డీఏ ప్రభుత్వం సీపీఎస్‌కు శ్రీకారం చుట్టింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన యుపీఏ ప్రభుత్వం పీఎఫ్, ఆర్‌డీఏ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. వామపక్షాలు అడ్డుకోవడంతో దశాబ్దకాలం అది చట్టం కాకుండా ఆగింది. యూపీఏ ప్రభుత్వం 2013 సెప్టెంబర్‌లో బీజేపీ సహకారంతో ఆ చట్టాన్ని ఆమోదించింది. 2004లో సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాలు గళమెత్తాయి. ఉద్యమ శంఖారావాన్ని పూరించాయి. ఎన్నో చైతన్య సదస్సులు, ఆందోళనలు, ఉద్యమాలు జరిగాయి. సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. 2016 సెప్టెంబర్ 19న ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన జరిపారు. తొమ్మిది జాతీయ పార్టీల ద్వారా సీపీఎస్‌కు వ్యతిరేకంగా చర్చకు పట్టుబట్టాలని, 2019 ఎన్నికల్లో సీపీఎస్ విధానం పట్ల పార్టీల వైఖరి స్పష్టం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. డిసెంబర్ 2015న బెంగళూరులో జరిగిన ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ సదస్సులో ఉపాధ్యాయ సంఘం, ఎస్టీయూ సీపీఎస్‌కు వ్యతిరేకంగా గళం విప్పింది. ఈ ఏడాది అఖిలభారత ఉద్యోగుల సమాఖ్య సీపీఎస్‌కు వ్యతిరేకంగా మహా ప్రదర్శన చేపట్టింది. తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్ల సదస్సులో సీపీఎస్ రద్దు ప్రధానాంశమైంది. ఆ సదస్సులో సీపీఎస్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి సీపీఎస్ విధానం రద్దు, గ్రాట్యుటీ కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్రంలో 1.64 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు ఉండగా జిల్లాలో 25వేల మంది ఆ పథకం కింద పనిచేస్తున్నారు.

జీవో 121 విడుదల

సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం ఎంతో ఉపయోగకరమైన జీవో 121ను ఆగస్టు 18న విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ సౌకర్యం కల్పించారు. సీపీఎస్ ఉద్యోగి సర్వీసులో ఉండి మరణించినా, ఉద్యోగ విరమణ తర్వాత చనిపోయినా అతని భార్యకు ఫ్యామిలీ పెన్షన్ వర్తిస్తుంది. ఏడు సంవత్సరాల సర్వీసున్న ఉద్యోగి మరణిస్తే అతని భార్యకు బేసిక్‌లో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తారు. ఏడేళ్లకుపైగా సర్వీసు పూర్తి చేసి ఉద్యోగంలో ఉండగానే మరణిస్తే మొదటి ఏడేళ్లకు 50 శాతం పెన్షన్, ఏడేళ్ల తర్వాత 30 శాతం పెన్షన్ వస్తుంది. అయితే నూతన పెన్షన్ కోసం ఉద్యోగి చెల్లించిన 10శాతం కంట్రిబ్యూటరీ డబ్బు మొత్తం ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తూ అంగీకారపత్రం ఇవ్వాలి. అప్పుడే ఈ ఫ్యామిలీ పెన్షన్ వస్తుంది. ఆ జీవోతో సంతృప్తి చెందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌తో విజయవాడలో మిలియన్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ఉద్యమాలకు నిలయమైన నెల్లూరు నుంచి వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలి పోతుండడంతో ఆ మిలియన్ మార్చ్ ప్రాధాన్యత సంతరించుకోనుంది.



సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు

వేలాదిగా వెళుతున్నాం



సీపీఎస్ రద్దు, పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ విజయవాడలో నిర్వహిస్తున్న మిలియన్ మార్చ్‌కు జిల్లా నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు వెళుతున్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు ఉద్యమం ఆగదు. కేరళ, త్రిపుర రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానం అమలులో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా దానిని అమలు చేయాలి.

- చిట్టేటి రమేష్, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

శ్రీధర్‌బాబుకు గిడుగు పురస్కారం



గిడుగు పురస్కారం అందుకుంటున్న శ్రీధర్‌బాబు

నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి) : నెల్లూరుకు చెందిన కవి అవ్వారు శ్రీధర్‌బాబు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో గిడుగు రామ్మూర్తి పురస్కారం అందుకున్నారు. గిడుగు సాహితీ సభ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులను సన్మానించారు. అందులో భాగంగా అవ్వారు శ్రీధర్‌బాబుకు గిడుగు పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, ప్రముఖ పాత్రికేయుడు పైసా దేవదాసు, ప్రముఖ కవి బిక్కి కృష్ణ పాల్గొన్నారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

● ఎంఆర్ వ్యాక్సినేషన్ పూర్తి చేయండి ● వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ డాక్టర్ శాలినీదేవి



సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు



మాట్లాడుతున్న డాక్టర్ శాలినీదేవి

నెల్లూరు (వైద్యం) : జిల్లాలో ప్రజారోగ్యం పట్ల నిరక్ష్యం వద్దని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ శాలినీదేవి హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం వైద్యాధికారులతో సమీక్ష జరిగింది. పాల్గొన్న ఆర్డీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుకు అంకితభావంతో వైద్యులు, సిబ్బంది పనిచేయాల్సి ఉందన్నారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్టీఆర్ ఉచిత వైద్య పరీక్షలు, ఈ ఔషధి, టెలిరేడియాలజీ, 102 కాల్‌సెంటర్‌ల సేవలను తప్పనిసరిగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలలో మాతాశిశు మరణాలు, ఆసుపత్రులలో ప్రసవాలు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేసేలా కృషి చేయాన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రులలో ప్రసవం జరిగిన తర్వాత జనన ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేయాలన్నారు. అలాగే మరణ ధ్రువీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు అందచేయాలన్నారు. మీజల్స్, రుబెల్లా వ్యాధులు ప్రబలకుండా చేపట్టిన టీకా అమలు లక్ష్యాన్ని సెప్టెంబరు 8వ తేదీ లోపు పూర్తి చేయాలని తెలియజేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వరసుందరం, అదనపు వైద్యాధికారిణి డాక్టర్ రమాదేవి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు వైద్య ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

● హంస రాష్ట్ర అధ్యక్షుడు యోగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న యోగేశ్వరరెడ్డి

నెల్లూరు (వైద్యం) : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) రాష్ట్ర అధ్యక్షుడు యోగేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో హంస కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా హెల్త్ అసిస్టెంట్లు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నారన్నారు. వీరిని పర్మినెంట్ చేయాలని ఎంతో కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆగస్టు 15న ప్రతిభా పురస్కారం అందుకున్న జూనియర్ అసిస్టెంట్ దీపికను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జిల్లా కార్యదర్శి విడవలూరు శ్రీకాంత్, ప్రతాప్‌బాబు, లక్ష్మీకుమారి, రాజ్‌కుమార్, ఆచార్యులు, చంద్రశేఖర్, సతీష్, ప్రకాష్, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


ఫార్మసీ ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఎంప్లాయిమెంటు జనరేషన్ మిషన్ ద్వారా ఫార్మశీ ఉద్యోగాలకు గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మశీ ట్రైనీ, ఫార్మశీ అసిస్టెంటు, ఫార్మాసిస్టు, ట్రైనీ ఫార్మాసిస్టు ఉద్యోగాలకు ఈ ఇంటర్వ్యూలు నెల్లూరులోని అయ్యప్పగుడి సమీపంలోని సంఘరక్ష(క్యాట్రాన్) కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులకు 18 నుంచి 30 ఏళ్లలోపు వయసుఉండాలన్నారు. ఫార్మశీ ట్రైనీ, ఫార్మశీ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఇంటర్‌గానీ, డిగ్రీగానీ పాసై ఉండాలన్నారు. ఫార్మాసిస్టు ఉద్యోగానికి డీ ఫార్మశీతో పాటు పీసీఐగానీ, బీఫార్మశీతోపాటు పీసీఐ చేసి ఉండాలన్నారు. ట్రైనీ ఫార్మసిస్టుకు బీ ఫార్మశీతోపాటు పీసీఐ రిజిస్టర్డ్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఆసక్తి, అర్హులు బయోడేటా, రేషన్‌కార్డు, విద్యార్హతల ధ్రువీకరణలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9000101558ను సంప్రదించాలన్నారు.

ఆర్టీఏ ఏజెంట్ల బైండోవర్

నెల్లూరు (క్రైం): రవాణాశాఖ నిబంధనలకు విరుద్దంగా అక్రమాలకు పాల్పడుతున్న ఆరుగురు ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేశారు. పోలీసులు కథనం మేరకు, రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కార్యాలయం సమీపంలోని 500 మీటర్ల వరకు ఏజెంట్లు ఉండకూడదన్న స్పష్టమైన ఆదేశాలున్నాయి. అయితే బీవీనగర్‌కు చెందిన సూరిశెట్టి శివకుమార్, స్నేహానగర్‌కు చెందిన ఏటిగడ్డ ప్రసాద్, మనుమసిద్ధినగర్‌కు చెందిన షేక్.రెహమాన్, కనుపర్తిపాడుకు చెందిన షేక్.మస్తాన్‌భాషా, టైలర్స్‌కాలనీకి చెందిన సయ్యద్ అక్తర్‌భాషా, కొడవలూరుకు చెందిన ముడి వాసులు నిబంధనలకు విరుద్దంగా కార్యాలయం లోకి ప్రవేశించడంతో పాటు లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్, ఇతర లావాదేవీలు నిర్వహిస్తున్నారని రవాణాశాఖ ఉప కమిషనర్ శివరామప్రసాద్ ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ మంగారావు బుధవారం ఈ ఆరుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని వారిని ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేశారు. తిరిగి ఇటువంటి సంఘటన పునరావృతం అయితే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సీఐ తెలిపారు.

వ్యర్థ రంగు, వస్త్ర ముక్కలతో రాకెట్



నెల్లూరు (సాంస్కృతికం) : శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగిస్తున్న పీఎస్ఎల్‌వీ సీ-39 ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నెల్లూరు బీవీ నగర్‌కు చెందిన వడ్రంగి జీ శ్రీనివాసులు రాకెట్ నమూనా తయారు చేశారు. వ్యర్థ రంగు వస్త్ర ముక్కలతో దీనిని రూపొందించి తన సృజనను చాటారు.

డిపో మేనేజర్ అందుబాటులో ఉండాలని
కార్మికుల ధర్నా



డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మికులు

కావలిటౌన్: ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ కార్మికులకు, ప్రయాణికులకు అందుబాటులో ఉండాలని డిమాండు చేస్తత ఎస్‌డబ్ల్యూఎఫ్ కావలి శాఖ ఆధ్వర్యాన బుధవారం స్థానిక డిపో ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆ యూనియన్ డిపో అధ్యక్ష కార్యదర్శులు కేవీ కృష్ణారెడ్డి, పీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డిపో మేనేజర్ డిపోలో అందు బాటులో లేనందున సూపర్‌వైజర్లు కార్మికులను వేధిస్తు మనో వేదనకు గురి చేస్తున్నారన్నారు. కార్మికుల్లో అభద్రతా భావం ఏర్పడి పారిశ్రామిక శాంతికి విఘాతం కలుగు తొందని ఆందోళన వ్యక్త చేశారు. ఆ కారణంగా సంస్థ అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందన్నారు. కార్మికుల సమస్యలను ఆలకించి పరిష్కరించేందుకు డిపో మేనేజర్ అందుబాటులో ఉంటే మంచిదన్నారు. అసిస్టెంట్ మేనేజర్ స్థాయి నుంచి సూపర్‌వైజర్లందరూ నిబంధనల ప్రకారం విధులను నిర్వహించాలని కోరారు. ప్రతి చిన్న విషయమూ తమకు తెలియదనీ, డిపో మేనేజర్‌ను అడగండనీ చెబుతున్న వైఖరిని మానుకోవాలన్నారు. కావలి- నెల్లూరు నాన్‌స్టాప్ సర్వీసులకు కండక్టర్లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు టికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవఅధ్యక్షుడు వి. మల్లికార్జునరావు, సీఐటీయూ నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, అయ్యన్న, పసుపులేటి పెంచలయ్య, నాయకులు బ్రహ్మారెడ్డి, చెంచురెడ్డి, వెంకటస్వామి, సీతారామయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, జె మల్లికార్జున, పీ రాజేశ్వరి, ఎం వెంకయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలి

కావలిటౌన్: తన భార్య మృతికి కారణమైన కావలి ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలని ముసునూరుకు చెందిన దేవరపల్లి భారతి భర్త క్రాంతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తికొండ కిషోర్‌కు విన్నవించారు. ఆమె ఈనెల 26వ తేదీ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన బుధవారంం ప్రజా సంఘాల నాయకులతో కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పు జరిగిన తరువాత అరగంట వరకూ తన భార్య ఆరోగ్యంగా ఉన్నదన్నారు. కొంత సేపు తర్వాత తీవ్ర తలనొప్పితో బాధపడుతోందని డ్యూటీ నర్సును పలుమార్లు పిలిచినా ఆమె పట్టించుకోలేదన్నారు. అనంతరం ఫిట్స్ వచ్చి తన భార్య మృతి చెందిందన్నారు. సకాలంలో నర్సు స్పందించి ఉంటే బతికే అవకాశం ఉండేదన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన చైర్మన్ మాట్లాడుతూ సమస్యను ఆసుపత్రి సూపరింటెండెంట్ ద్వారా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపట్టేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సీ శారద, శ్రీనివాసులు, పరుసు మాల్యాద్రి, రవి నాయుడు, హజరత్తయ్య, వెంకటేశ్వర్లు, కత్తి రత్నం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పొద్దర్తి నాగరాజు, డీ వెంకటరావు తదితరులు ఉన్నారు.

కోలాహలంగా చవితి వేడుకలు


ముసునూరులో వినాయకుడు


ట్రంకురోడ్డులో భారీ వినాయకుని గ్రామోత్సవం


సాతానివారివీధిలో పూజలు చేస్తున్న భక్తులు

కావలిటౌన్: ప్రత్యేక పూజలు, కోలాటాలు, అన్నదానాలు, ఉట్టి మహోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ బుధవారం ఆరో రోజు పట్టణంలో చవితి వేడుకలు కోలాహలంగా జరిగాయి. ముసునూరు ఆటోనగర్‌లో వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పాతూరు సాతానివారి వీధిలో కోలాటాలు, ఉట్టికొట్టే కార్యక్రమం వేడుకగా జరిగింది. యువతీయువకులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు, రంగునీరు చల్లుకుంటూ సంతోషం పంచుకున్నారు. భక్తులు వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ జిల్లా నాయకులు బొంతా శ్రీనివాసయాదవ్, సాయికుమార్, చిలకపాటి శ్రీనాథ్, శశి, బ్రహ్మయ్య, ఉదయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

●మానసా సెంటర్ కలుగోళమ్మపేటలో ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఉత్సవంలో పెద్ద ఎత్తున డీజే సౌండ్ సిస్టమ్, ప్రత్యేక లేజర్ లైటింగ్, బ్యాండ్ మేళాలు, బాణా సంచా కాల్చుతూ పెద్ద ఎత్తున గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన గ్రామోత్సవం ట్రంకురోడ్డు మీదుగా సాగుతూ ముసునూరు మందాడి చెరువులో బుధవారం తెల్లవారుజామున 2:30 గంటలకు నిమజ్జన కార్యక్రమం జరిగింది. దారిపొడవునా మహిళా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారికి హారతులు పట్టి పూజలు చేశారు. భారీ వినాయకుడు కావడంతో కరెంట్ సర్వీసు తీగలను ముందుగానే తొలగించారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 12 గంటలకు వరకూ ఆ మార్గంలో విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

6వ రోజు వినాయక చవితి వేడుకలు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ యాదవ పాలెం, రామాలయ ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఆరో రోజు జరిగాయి. గురువారం నిమజ్జన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న సర్పంచు గుంటూరు మల్లికార్జున్

సేంద్రియ ఎరువులు భేష్

కావలిరూరల్: రైతులు పంటలకు సేంద్రియ ఎరువులు, కషాయాలను వాడాలని ఆర్‌సీపాలెం సర్పంచు గుంటూరుమల్లికార్జున్ సూచించారు. కావలి రూరల్‌మండలం రాజువారిచింతపాలెంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో చెత్త నుంచి సంపద తయారీ విధానంపై బుధవారం శిక్షణ జరిగింది. సర్పంచు మల్లికార్జున్, జిల్లా రీసోర్సు పర్సన్ షఫి, పంచాయతీ కార్యదర్శి సమద్‌లు సర్పంచులకూ, ఎంపీటీసీలకూ, కార్యదర్శులకూ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువుల, పురుగు మందుల వాడకం బదులుగా కృత్రిమంగా తయారు చేసిన సేంద్రియ ఎరువులను వాడడం మంచిదన్నారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణతో గ్రామాల్లో చెత్త లేకుండా ఉంటుందన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను వర్మీకంపోస్టు ఎరువుగా తయారు చేసి రైతులకు అందజేసి పంచాయతీలు ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కావలి, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కంటి వైద్యశిబిరంలో చైర్‌పర్సన్ అలేఖ్య

బీఎంఆర్ ట్రస్టు పేదలపాలిటి వరం

కావలిటౌన్: బీఎంఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు పేదల పాలిటి వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య అన్నారు. బుధవారం వైకుంఠపురం మున్సిపల్ పాఠశాలలో బీఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. ట్రస్టు మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో ముఖ్య అతిథులుగా ఆమెతోపాటు టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి హాజరయ్యారు. ట్రస్టు అందించే బృహత్తరమైన సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా నిరుపేద రోగులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం వైద్యం ఖరీదైన నేపథ్యంలో ఉచిత సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 342 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 29 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. 117 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించినట్లు తెలిపారు. ఉచితంగా శస్త్రచికిత్సలు చేసి కంటి అద్దాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, కొమరా రమణయ్య, మంచాల ప్రసాద్, దామా మాల్యాద్రి, గొర్రెపాటి బ్రహ్మయ్య, ఖాదర్ బాషా, దారా మల్లి పాల్గొన్నారు.


హైడ్రాలిక్ బ్రిడ్జి నమూనాను పరిశీలిస్తున్న అధ్యాపకులు

పాలిటెక్నిక్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు

కావలిరూరల్: కావలి రూరల్ మండలం రుద్రకోటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్ విభాగాల్లో వివిధ ప్రాజెక్టు ఆకృతులు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్‌లు డాక్టర్ ఎం. సుబ్బరాయుడు, పి. వరప్రసాద్ హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన హైడ్రాలిక్ బ్రిడ్జి నమూన, ఫైర్ స్ప్రింక్లర్, ఆటోమేటిక్ లైట్ ఆఫ్,ఆన్ నమూనాలను పరిశీలించి విద్యార్థుల నైపుణ్యతకు మెచ్చి అభినందించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.పద్మారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యంతో చక్కగా ప్రాజెక్టు నమూనాను తయారు చేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రయోగ నమూనాలు తయారు చేయాలని సూచించారు. పెస్కో-ఆర్డినేటర్ సీహెచ్ సుబ్బన్న మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన నమూనాలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో విశాఖ పట్నంలో జరిగే ప్రదర్శనలో ఉంచుతామన్నారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని రోజురోజుకూ పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి తిరుపతి, అధ్యాపకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల వేలం

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూటక్షేత్రంపై వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం భూములకు గురువారం కౌలు వేలంపాట జరగనున్నట్లు ఆలయ ఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఏటా ప్రసన్న ఆలయ పరిధిలోని భూములను కౌలు వేలం పాట జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

పందులతో బెంబేలు


ట్యాంక్ సెంరుటర్‌లో పందులు

అల్లూరు : అల్లూరులో పందుల సంచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జనావాసాల నుంచి దూర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు వేడుకుంటున్నా ఫలితం దక్కడం లేదు. విచ్చల విడి సంచారంతో గ్రామంలో అపరిశుభ్రత ఏర్పడింది. చెత్తకుప్పలో, మురుగు కాలువల్లో గుంపులు గుంపులుగా పందులు కన్పిస్తున్నాయి.. . ఏ షాపు ఎదురుగా కొంచెం చెత్త ఉన్నా, మురికి కాలువలు ఉన్నా వాటిల్లో పొర్లాడుతూ ఆ ప్రాంతాని అపరిశుభ్రంగా చేస్తున్నాయి. పేరుకుపోయిన చెత్తకుతోడు వర్షం కురుస్తుండడంతో వాటి నుంచి దుర్వాసన వస్తోంది. పందులు మనుషులపై దాడి చేయడమేగాక వాటి వల్ల వివిధ రకాల రోగాలు వస్తున్నాయి. దాంతో ప్రజలు భయపడుతున్నారు. వర్షాకాలంలో మెదడువు జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికే ప్రజలు వివిధ జ్వరాల బారిన పడి అల్లాడుతున్నారు. గ్రామానికి దూరంగా పందులను తరమాలని పలుమార్లు పంచాయతీ, మండల అధికారులకు విన్నవించినా వారిలో చలనం ఉండడం లేదని ప్రజలు అంటున్నారు. పెంపకందారులు కూడా గ్రామంలో పందులను వదిలేసి తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు వాటిని గ్రామంలో తిరగనీయకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఒకటి నుంచి అందుబాటులో మినుము విత్తనాలు


సూచనలిస్తున్న అధికారి సుధారాణి

కొండాపురం: మినుము రైతులకు సెప్టెంబరు 1 వతేదీ నుంచి వ్యవసాయ కార్యాలయంలో విత్తనాలు అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయాధికారిణి సుధారాణి తెలిపారు. మండలంలోని గరిమెనపెంట పంచాయతీ ఎర్రబొట్లపల్లి, చింతలదేవి పంచాయతీ తూర్పుబ్రాహ్మణపల్లి గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఆయా గ్రామాలలో సాగుచేసిన కందిపంటను పరిశీలించి క్లోరో, ఎసిఫేట్ స్ప్రే చేస్తే తెగుళ్లను నివారించుకోవచ్చని సూచించారు. రైతులు తమ భూములకు భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన ఎరువులు వాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఈశ్వరాచారి, ఎంపీఈవో బాలకృష్ణ, రైతులు కుక్కపల్లి వెంకటసుబ్బయ్య, మాల్రాద్రి పాల్గొన్నారు.

కాకినాడ ఎన్నికల్లోనూ టీడీపీదే విజయం

కొండాపురం: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ టీడీపీయే విజయం సాధిస్తుందని ఆ పార్టీ మండల నాయకులు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలలో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిచారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషితోనే ఈ విజయం వరించిందన్నారు. 2019లో జరిగే అసెంబ్లీ ఎన్నికలలోనూ టీడీపీ గెలుస్తుందన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ కన్వీనర్ వెంకటాద్రి, మండల ఉపాధ్యక్షుడు, తెలుగురైతు అధ్యక్షుడు పోలినేని రమేష్, పార్టీ అధికార ప్రతినిధి సీహెచ్. బాల కోటేశ్వరరావు, తిమోతి, ఏలూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ


ఉపకరణాలు పంపిణీ చేస్తున్నరామానాయుడు

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరు హెచ్‌డబ్ల్యూ పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఊటుకూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సిద్ధనకొండూరు నివాసి ఆర్ కనకారావు బుధవారం టై, బెల్టు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తన బాల్యస్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలో విద్య నేర్చుకోవడంతోపాటు పెద్దలపట్ల వినయ, విధేయతలను అలవారుచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ పూర్వ విద్యార్థిగా పాఠశాలకు సహాయ,సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ షేక్ అబ్దుల్‌రజాక్, ప్రధానోపాధ్యాయుడు టీ కామప్రసాదరావు, ఉపాధ్యాయులు జీ సురేష్, ఈ రమణయ్య, వింజమూరు సమితి మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ రామానాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలే పరిష్కారంగా 'మజ్దూర్'


కార్మికులతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు సుబ్బారావు

బిట్రగుంట: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా సౌత్ సెంట్రల్‌రైల్వే మజ్దూర్‌యూనియన్ పని చేస్తుందని బిట్రగుంట బ్రాంచి ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పీ గోవిందరాజులు అన్నారు. బిట్రగుంట సెక్షన్ పరిధిలోని కార్యాలయాల్లో బుధవారం బ్రాంచి ఛైర్మన్ గోవిందురాజులు, కార్యదర్శి ఎంఎస్ సుబ్బారావు అన్నారు. వారు తొలుత కార్మికులను సమస్యలు అడిగి తెలుసకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల వ్యక్తిగత సమస్యలు, రైల్వే ఆసుపత్రిలో వైద్యం జరిగే వివరాలు, మందుల కొరతను డివిజనల్ కార్యవర్గ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అనసూయ ఆసుపత్రి రెఫ్రల్ ఆసుపత్రిగా మంజూరైనట్లు తెలిపారు. అనంతరం మజ్దూర్ యూనియన్ కార్యాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో కోశాధికారి జీవీ రమణయ్య, చలపతి రావు, రాజశేఖర్, మైకిల్, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కృష్ణాపాడు, బీకే అగ్రహారంలో 'పొలం పిలుస్తుంది'

జలదంకి: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కృష్ణాపాడు, బీకే అగ్రహారంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. అధికారులు పత్తి పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణ, ఎరువుల యాజమాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు పలు సందేహాలు వ్యక్తం చేశారు. వాటిని అధికారులు నివృత్తి చేశారు. ఏఈవో వెంకటేశ్వర్లు, ఎంపీఈవోలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో వైద్యం

బిట్రగుంట: పేదలకు తక్కువ ఖర్చుతో ఖరీదైన వైద్యాన్ని నెల్లూరులోని చెన్నై ఆసుపత్రిలో శుక్ర, శనివారాలు అందజేస్తున్నట్టు ఆపరేషన్ జీఎం జీ శేఖర్ బాబు తెలిపారు. బోగోలులో బుధవారం ఆయన మాట్లాడుతూ చెన్నై పోర్టిస్ మళార్ ఆసుపత్రి నిపుణులు దినేష్ నాయక్ నరాలు, పక్షవాతం, మెదడుకు సంబంధించిన వ్యాధులపై అతితక్కువ ఖర్చుతో పరీక్షలు చేస్తారని తెలిపారు. నోబుల్ ఆసుపత్రి బాలాజీ రవిల్ భాస్కరన్, మధుసూదన్ వైద్యులు గ్యాస్ట్రిక్ ట్రబుల్‌ను ఎండోస్కోపీ ద్వారా చికిత్స చేస్తారని తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

● గర్భం దాల్చిన బాలిక ● న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు

డక్కిలి: ఓ బాలికను ప్రేమ పేరుతో శారీరక సంబంధం పెట్టుకుని చివరకు గర్భం దాల్చడంతో నీవు ఎవరో తెలియదంటూ అడ్డం తిరిగాడు ఓ వ్యక్తి. నువ్వే సర్వసం అని, నువ్వులేనిదే క్షణం గడవదని, పెళ్లి చేసుకొంటానని నమ్మబలికాడు. ఈ మాటలు నమ్మిన ఆ బాలిక సర్వసం సమర్పించింది. చివరకు గర్భం దాల్చింది. అప్పటి నుంచి ఇదిగో అదిగో అంటూ కాలం గడిపిన అతను ఎనిమిది నెలల గర్భిణి అయ్యేటప్పటికి తనకేమీ తెలియదంటూ మొహం చాటేశాడు. దీంతో బాధితురాలు న్యాయం కోసం బుధవారం డక్కిలి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని దేవులపల్లి దళితవాడకు చెందిన ఓ బాలిక వెంకటగిరిలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఆ బాలికకు సమీప బంధువైన రాపూరు మండలం జోరేపల్లికి చెందిన బత్తల వెంకటయ్యతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. దీంతో వెంకటయ్య తరుచూ దేవులపల్లి దళితవాడకు వచ్చి వెళ్లేవాడు. తనకు దగ్గర బంధువు కావడంతో శుభకార్యాలకు ఆ బాలిక కూడా జోరేపల్లికి వెళ్లేది. ఈ క్రమంలో శారీరక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడు. అప్పటి నుంచి పెళ్లి చేసుకోమని కోరగా ఇదిగో అదిగో అంటూ దాటవేస్తూ వస్తున్నాడు. చివరకు గట్టిగా నిలదీయడంతో అసలు నిన్ను ప్రేమించలేదని, నీకు వచ్చిన గర్భంతో తనకు సంబంధం లేదని బుకాయించాడు. దీంతో ఆ బాలిక పోలీసులను ఆశ్రయించింది. తాను ఎనిమిది నెలల గర్భిణినని, తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణమని బాధితురాలు విలేఖరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. కాగా పోలీసులు వెంకటయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి ఆ జంటను ఒక్కటి చేయాలని ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ బాలికతో తనకు ఎలాంటి ప్రేమాయణం నడవలేదని, గర్భం దాల్చిడానికి తాను కారణం కాదని, అవసరమైతే డీఎన్ఏ పరీక్షలకైనా తాను సిద్ధమని వెంకటయ్య తేల్చి చెబుతున్నాడు. ఈ కేసును పోలీసులు ఎలా పరిష్కరిస్తారో చూడాలి.

గుండెపోటుతో
జెన్‌కో కాంట్రాక్టు ఉద్యోగి మృతి

పరిహారం కోసం మృతదేహంతో ధర్నా


గుండెపోటుతో మృతి చెందిన రమణయ్య

ముత్తుకూరు : విధి నిర్వహణలో ఉన్న జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం కాంట్రాక్టు ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం కాలనీలో జరిగింది. స్థానికులు కథనం మేరకు నేలటూరుకు చెందిన పెడకాల రమణయ్య(51) జెన్‌కో థర్మల్ కేంద్రం ఉద్యోగుల కాలనీలో చెట్ల సంరక్షుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. చెట్లకు నీళ్లు పోస్తూ బుధవారం అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. విధులు నిర్వహిస్తూ మృతి చెందినందున మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని నేలటూరు గ్రామస్థులు జెన్‌కో థర్మల్‌కేంద్రం ఎదుట ఆందోళన చేశారు. రమణయ్య మృతదేహాన్ని గేటు ఎదుట ఉంచి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న జెన్‌కో థర్మల్ కేంద్రం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితులను విచారించి మృతుడి కుటుంబానికి తగిన సాయం చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో బాధితులు ఆందోళన విరమించారు.


జెన్‌కో థర్మల్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

గుళికలు తిని మహిళ మృతి

చిల్లకూరు: మండలంలోని తిమ్మనగారిపాళెంలో బుధవారం గుళికలు తిని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెంచమ్మ కడుపునొప్పికి తాళలేక గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది.

వేటకు వెళ్లి మత్స్యకారుడు..

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నం గ్రామానికి చెందిన పాముల పోలయ్య వేటకు వెళ్లి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోలయ్య, శ్రీనివాసులు, కొండయ్యలు మంగళవారం సాయంత్రం సముద్రంలోకి వేటకు వెళ్లారు. తిరిగి బుధవారం వేకువజామున బోటులో తిరుగు ప్రయాణమై వస్తుండగా అలల తాకిడికి ప్రమాదవశాత్తు బోటు తిరగబడింది. దీంతో పోలయ్య గల్లంతు కాగా, మిగిలిన వారు బోటు వద్దకు చేరుకున్నారు. కొంత సమయానికి పోలయ్య ధరించిన దుస్తులు కనపడటంతో అక్కడికి వెళ్లి చూడగా పోలయ్య మృతి చెంది ఉన్నాడు. దీంతో మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.

ఇప్పుడైతే వద్దు బాబోయ్!

● జిల్లా పోలీసు శాఖలో విచిత్ర పరిస్థితి

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) :

జిల్లా పోలీసు శాఖలో విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. నెల రోజులుగా రెండు ముఖ్యమైన డీఎస్పీ స్థానాలు, మరో మూడు ప్రధానమైన సర్కిళ్లు ఖాళీగా ఉన్నా ఎవరూ వీటిలోకి వచ్చేందుకు ఆసక్తి కనబరచడం లేదు. కనీసం ప్రయత్నాలు కూడా చేయట్లేదు. గతంలో ఎప్పుడు నెల్లూరుకు వెళదామా అని వేచిచూసే వారు ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా నెల్లూరు అంటే పోలీసు అధికారులకు తెగ ఉత్సాహం వస్తుందన్నది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాట. ఎందుకంటే శాంతి భద్రతల విషయంలో జిల్లా ప్రశాంతంగా ఉంటుంది. పనిభారం తక్కువ.. అక్రమ ఆదాయ అవకాశాలు ఎక్కువ. బెట్టింగులు, ఇసుక, ఎర్రచందనం, గుట్కా అక్రమ తరలింపులు పోలీసుల పంట పండిస్తాయని భావిస్తారు. గతంలో అనేక సంఘటనలు దీన్ని రుజువు చేశాయి. క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారంలోనూ అనేక మంది పోలీసులు లబ్ధి పొందారన్నది బహిరంగ రహస్యం. ఈ వ్యవహారంలో పలువురు పోలీసు అధికారులపై వేటు పడడం గమనార్హం. సుమారు నెల రోజుల నుంచి ప్రధానమైన నెల్లూరు, గూడూరు డీఎస్పీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బెట్టింగ్ మాఫియాతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో నెల్లూరు డీఎస్పీ వెంకటరాముడు, ఇసుక మాఫియాతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో గూడూరు డీఎస్పీ శ్రీనివాస్‌లను డీజీపీ ఈ నెల 1న వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది జరిగిన రెండు రోజుల తర్వాత బెట్టింగ్ ముఠాకు సహకరించారన్న ఆరోపణలతో నెల్లూరు ఒకటో పట్టణ సీఐ కరీమ్, రెండో పట్టణ సీఐ రామకృష్ణారెడ్డిలను డీఐజీ వీఆర్‌కు పంపారు. అలానే నెల రోజుల క్రితం కోవూరు సీఐ ఆకస్మికంగా మరణించడంతో ఆ సీటు కూడా ఖాళీగా ఉంది. అప్పటి నుంచి ఈ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గూడూరుకు ఇన్‌చార్జ్ బాధ్యతలను మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ



శ్రీనివాసాచారికి అప్పగించగా, నెల్లూరు నగర డీఎస్పీ బాధ్యతలను సీసీఎస్ డీఎస్పీ బాలసుందరరావుకు అప్పగించారు. ఇక నగరంలోని రెండు స్టేషన్‌లలో ఎస్ఐలే అన్నీ చూసుకుంటున్నారు. అయితే శాంతి భద్రతల విభాగంలో నెల రోజుల పాటు జిల్లాలో భర్తీ కాకుండా ఉండడం చాలా అరుదని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో సీటు ఖాళీ కాకముందే రిజర్వ్ చేసుకునే వాళ్లు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనబడడం లేదు. ముఖ్యంగా నెల్లూరు, గూడూరు సబ్ డివిజన్‌లు చాలా పెద్దవి... ప్రతిష్టాత్మకమైనవి. ఇటువంటి సబ్ డివిజన్లకు వచ్చేందుకు గతంలో పోటీపడే వారు ఇప్పుడు వీటివైపే చూడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆయా వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ నిజాయితీగా పనిచేయమంటుండడమే కారణమని చర్చించుకుంటున్నారు. ఇప్పటి వరకూ ఎలా ఉన్నా నడిచిపోయేదని, అయితే ఇప్పుడు అలా కుదరదు కాబట్టి నెల్లూరుకు ఇప్పుడైతే వద్దులే అని పలువురు పోలీసు అధికారులు అంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో ఇక్కడకు వస్తే వెట్టి చాకిరి చేయాలే తప్ప వచ్చినందుకు న్యాయం జరగదని పలువురు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల పలువురు డీఎస్పీలు ప్రయత్నాలు చేసినా ఆ తర్వాత ఎందుకో విరమించుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ప్రతిష్టాత్మకమైన నెల్లూరు, గూడూరు సబ్ డివిజన్‌లు, జిల్లాలోని మూడు సర్కిళ్లు సుమారు నెల రోజుల నుంచి ఖాళీగా ఉండడం అన్ని వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా నెల్లూరు, గూడూరు సబ్ డివిజన్‌ల ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా ఈ రెండు డీఎస్పీ స్థానాలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. అలానే పెద్దదైన కోవూరు సర్కిల్‌తో పాటు నెల్లూరు నగరంలోని రెండు స్టేషన్‌లకు సీఐలను నియమించి బలోపేతం చేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● ఎస్పీ దారిలోనే సిబ్బంది

ఎస్పీగా పీహెచ్‌డీ రామకృష్ణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనదైన శైలిలో ముందుకెళుతున్నారు. తొలి క్రైం మీటింగ్‌లోనే తన ఆలోచనలను స్పష్టంగా సిబ్బందికి తెలియజేశారు. అక్రమాలు, మాఫియాలు ఏవైనా కొనసాగుతుంటే ఇకపై వాటిని ఆపేయాలని హెచ్చరించారు. అందుకు కొంత సమయం కూడా ఇచ్చారు. అయితే అప్పటి వరకూ మరోదారిలో పయనిస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగానికి ఇది కొంత ఇబ్బందిగా మారింది. ఒక్కసారిగా పోలీసు విధులు సక్రమంగా నిర్వహించమని చెప్పేసరికి చాలా మంది ఇబ్బందులు పడ్డారు. కొందరు సెలవుపై వెళ్లిపోగా మరికొందరు ఆ ప్రయత్నాలు చేశారు. అయితే ఇప్పుడిప్పుడే సిబ్బంది ఎస్పీ బాటలోకి వచ్చేస్తున్నారు. బయట వ్యవహారాలను పక్కనబెట్టి తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కేసులను పరిశీలించడం, రాత్రి వేళల్లో గస్తీలు నిర్వహించడం, రహదారులపై సరైన పత్రాలు లేని వాహనదారులపై కేసులు రాయడం నిరంతరం చేస్తున్నారు. పోలీసు సిబ్బంది జులుం విదుల్చుతుండడంతో ఇప్పటికే జిల్లాలో బెల్టు షాపులు దాదాపుగా తగ్గిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే అన్ని రకాల దందాలకు చెక్ పెట్టవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ వాహనం ఎవరిదో..!

కావలి(క్రైం) : కావలి ట్రంకురోడ్డుకు తూర్పు వైపున కోర్టు వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో దాదాపు ఆరు నెలలుగా ఉన్న మినీ ట్రక్ ఎవరిదో తెలియడం లేదు. ఆ వాహనం టైర్ల చుట్టూ మట్టి పేరుకొని ఉంది. కోర్టు సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడ వాహనం ఉండడం వల్ల ఇతర వాహనాల పార్కింగ్‌కు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళలో ఈ వాహనాన్ని చాటు చేసుకొని మందుబాబులు మద్యం తాగుతున్నారు. కొందరు చీకటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఈ వాహనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


కోర్టువద్ద పార్కింగ్ స్థలంలో నిలిపి ఉన్న వాహనం

నగదు, బంగారం కోసమే హత్య

● లొంగిపోయిన నిందితుడు


మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

గూడూరు(టౌన్): జులాయిగా తిరుగుతున్న వ్యక్తికి పనిస్తే యజమాని వద్ద ఉన్న నగదు, బంగారం కోసం హత్యకు పాల్పడ్డాడు. ఈనెల 23వ తేదీన జరిగిన ఈ ఘటనలో నిందితుడిని పసిగట్టిన పోలీసులు తన కోసం గాలిస్తున్నారన్న విషయం తెలుసుకుని అతడే వీఆర్వో ఎదుట లొంగిపోయాడు. అతడ్ని వీఆర్వో బుధవారం పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు స్థానిక సీఐ కార్యాలయంలో లొంగిపోయిన నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. పట్టణంలోని శాంతినగర్ సమీపంలో గోవిందు నారాయణ గాయత్రి లైనింగ్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటగిరి మండలం మొక్కలపాడు గ్రామానికి చెందిన నాగరాజు(24) అనే యువకుడిని ఈ నెల పదో తేదీన పనిలో చేర్చుకున్నాడు. అప్పటి నుంచి పనిలో సహాయంగా ఉంటూ రాత్రివేళల్లో దుకాణంలోనే ఉండేవాడు. ఈ నేపథ్యంలో దుకాణ నిర్వాహకుడు చేతికి ఉన్న ఒకటిన్నర సవర బంగారు ఉంగరాలు, దుకాణంలో ఉన్న రెండు వేల రూపాయలు అపహరించేందుకు పథకం పన్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22న తేదీ రాత్రి నారాయణతో కలిసి దుకాణంలో నిద్రించాడు. యజమానికి పూటుగా మద్యం తాగించాడు. అతను అపస్మారకస్థితిలోకి వెళ్లి అదమరచి నిద్రించే సమయంలో దుకాణంలో అందుబాటులో ఉన్న కత్తెరతో నారాయణ గొంతు కోసి హత్య చేశాడు. నారాయణ వేళ్లకున్న ఉంగరాలు, దుకాణంలోని నగదు తీసుకుని పరారయ్యాడు. 23వ తేదీ ఉదయం హత్య విషయం వెలుగు చూడటంతో ఈ ప్రాంతంలో చర్చనీయాంశం అయింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు హత్య కేసులో ప్రాథమిక దర్యాప్తులోనే హత్యకు పాల్పడిన వ్యక్తి నాగరాజుగా గుర్తించి అతనిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. దీనిని పసిగట్టిన నిందితుడు నాగరాజు బుధవారం రెండో పట్టణ వీఆర్వో అఖిల్ ఎదుట లొంగిపోయి చేసిన నేరాన్ని అంగీకరించాడు. దీంతో అఖిల్ నాగరాజును పోలీసులకు అప్పగించగా, పోలీసులు నిందితుడి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నామని సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ సరేష్, సిబ్బంది నాగరాజు, ప్రసాద్ తదితరులు ఉన్నారు. కాగా నాగరాజు జల్సాల కోసం అక్కడక్కడ పనులు చేస్తూ నేరాలకు ఆలవాటు పడ్డాడు. ఈ క్రమంలో నమ్మి పని ఇచ్చిన నారాయణను గొంతుకోసి చంపడం స్థానికులను విస్మయపరిచింది. నిందితుడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నా, జీవితంలో స్థిరపడకుండా జల్సాల కోసం ఇలాంటి దారుణాలకు ఒడిగట్టి చివరకు జైలు పాలయ్యాడు.


హత్యకు వినియోగించిన కత్తెర, స్వాధీన చేసుకున్న ఉంగరాలు

సాగులో ఉన్న పత్తి పైరు



జిల్లాలో పత్తి రైతు కుదేలయ్యాడు. నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. వరికి ప్రత్యామ్నాయంగా ఈ పంటను సాగుచేశాడు. నాసిరక విత్తనం, రోగాల బెడదతో పంట తీవ్రంగా దెబ్బతిన్నది. దిగుబడులు అమాంతం తగ్గిపోగా, ధర పతనమైంది. పెట్టుబడులూ రాక రైతన్న లబోదిబోమంటున్నాడు. - నెల్లూరు (వ్యవసాయం)

పత్తి.. పరేషాన్!

- రూ.29కు పడిపోయిన కిలో ధర
- తగ్గిన దిగుబడులతో రైతన్న బెంబేలు

జిల్లాలో నాన్ డెల్టా, మెట్ట ప్రాంతాల్లో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఎక్కువగా పత్తి పంట వేశారు. ఈ ఖరీఫ్‌లో సాధారణ సాగు 4,666 హెక్టార్లు. 3,689 హెక్టార్లకే పరిమితమైంది. జూన్‌లో కేవలం 1,201 హెక్టార్లయితే జూలైలో 3,477 హెక్టార్లకు పెరిగింది. సాగునీరు లభ్యత సమస్యగా ఉన్నా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సుమారు ఆరు వేల మంది రైతులు పత్తిని సాగులోకి తెచ్చారు. నాసిరక విత్తనాల కారణంగా కాయలు లేక దిగుబడి ఆశించినంత రాలేదు. ఎకరాకు 4 నుంచి 5 కాపుల్లో 1000 నుంచి 1500 కిలోల దిగుబడి రావాలి. ప్రస్తుతం 500 కిలోలకే పరిమితమైంది. దానికి తోడు మార్కెట్ ధర పడిపోయింది. కిలో పతి రూ. 29 మాత్రమే ఉండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. గతేడాది ఎకరాకు టన్ను పత్తి దిగుబడి వచ్చింది. కిలో ధర రూ. 50 పలకడంతో ఒక్కో రైతులు ఎకరాకు రూ.50 వేల వరకూ ఆదాయం పొందారు. ఈ ఏడాది ఎకరాకు కేవలం రూ. 14,500 రావడంతో పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయారు. ఒక్కోక రైతు ఎకరం పత్తిసాగుకు ఎకరాకు రూ. 30 వేల వరకూ పెట్టుబడులు పెట్టినట్టు అంచనా. అవి రాకపోవడంతో ఆందోళనలో ఉన్నాడు.

● నాసిరకం విత్తనం, తెగుళ్లతో..

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు 50 వేల హెక్టార్లకుగాను 18 వేల హెక్టార్లలోనే సాగైంది. రైతులు ప్రత్నామ్నాయ పంటకు ఎంచుకున్న పత్తి వైపు కూడా కొందరే మొగ్గు చూపారు. దాంతో సాధారణ సాగు 4,666 హెక్టార్లకు గాను 3,689 హెక్టార్లలోనే సాగైంది. నాసిరక విత్తనాలు నాటడం, దానికితోడు పంటను తెగుళ్లు తెల్ల, పచ్చ దోమలు ఆశించడంతో పంట దిగుబడి బాగా తగ్గింది. రైతులు మందులు తెచ్చి పిచికారి చేసినా పెద్దగా ఫలితం దక్కలేదు. ఎకరాకు 500 కిలోలకు దిగుబడి తగ్గిపోయింది.



బండెడు కష్టం చేయాలి



పత్తి పైరుకు రైతులు బండెడు కష్టం చేయాలి. ఆశించినంత దిగుబడి రాలేదు. రోజుకో రేటు ఉండటంతో ఎప్పుడు ధర తగ్గిపోతుందేమోనని నిత్యం ఆందోళన ఉంటోంది. ఈ ఏడాది మరీ నష్టం వచ్చింది. రైతులకు చేతల కష్టం కూడా మిగలలేదు.

- జనార్దన్ రైతు, మొగళ్లపాళెం

ఇక సాగు చేయలేం



ఇక పత్తి సాగు చేయడం కష్టం. వచ్చే ఏడాది ఈ మాత్రం కూడా చేయలేం. కష్టం ఎక్కువ. పెట్టుబడులూ ఎక్కువే. ఆదాయం అసలు ఉండటం లేదు. దిగుబడులు మరీ తగ్గిపోతున్నాయి. పత్తి సాగుకు సెలవు చెప్పెదామనుకుంటున్నాం.

- నకినేటి రమణయ్య, పొట్టేపాళెం

నీటి విడుదలపై చర్యలు తీసుకోండి

- బీజేపీ నేత మిడతల రమేష్ వినతి

నెల్లూరు (వ్యవసాయం) : పెన్నా నదికి ఎగువున నీటి దిగ్భంధం చేయడం వల్ల జిల్లాకు రావాల్సిన నీరు నిలిచిపోయిందని, ఈ విషయమై అధికారులు ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. బుధవారం సోమశిల ప్రాజెక్టు కార్యాలయంలో డిప్యూటీ ఎస్ఈ మురళీకృష్ణకు ఈ మేరకు ఆయన వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీకి ఎగువనున్న కర్ణాటక అక్రమంగా అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం వల్ల జిల్లాకు రావాల్సిన నీళ్లు అక్కడే ఆగిపోతున్నాయన్నారు. దీని వల్ల తమిళనాడుకు 10 టీఎంసీల నీళ్లు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. పైగా రాయసీమ జిల్లాలకు కూడా అన్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. దిగువకు రావాల్సిన నీటిని ఆపే హక్కు లేకపోయినా, కర్ణాటక తీరు పై పోరాడేందుకు అధికారులు సిద్ధం కావాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓజిలి సుధాకర్ పాల్గొన్నారు.



సోమశిల ప్రాజెక్టు డిప్యూటి ఎస్ఈకి వినతిపత్రం అందచేస్తున్న మిడతల రమేష్

సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాకే

- చిరు ధాన్యాల సాగుపై దృష్టి పెట్టండి
- యానాదుల భూముల అభివృద్ధికి చర్యలు
- ఐటీడీఏ పీవో కమలకుమారి

నెల్లూరు (వేదాయపాళెం) : వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని ఇకపై నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమ చేయడం జరుగుతుందని ఐటీడీఏ పీవో కమలకుమారి తెలిపారు. సబ్సిడీ నేరుగా లబ్ధిదారులకు బదలాయించడంపై బుధవారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు వ్యవసాయ యంత్ర పరికరాలను వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే కొనుగోలు ఆర్డరుతో కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారుడు ఆ పరికరానికి సంబంధించిన మొత్తాన్ని ఒకేసారి బ్యాంకు ద్వారా విక్రయదారునికి బదలాయించాల్సి ఉంటుందన్నారు. 10 రోజుల తరువాత 90 శాతం సబ్సిడీ నగదు లబ్ధిదారుని ఖాతాకు జమ అవుతుందని చెప్పారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 173 మంది గిరిజన లబ్ధిదారులకు రూ.65లక్షల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను వ్యవసాయ శాఖ సమన్వయంతో 90శాతం సబ్సిడీతో పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 66లక్షల విలువైన యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకాలను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం రాయితీని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు బదలాయిస్తోందని తెలిపారు. చిరు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. గిరిజనులకు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వై రోశిరెడ్డి, డీటీడబ్ల్యూవో కే జోత్స్న, ఏపీ యానాది సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ భూములు రైతులవే...!

కొడవలూరు : కొడవలూరు మండలం బొడ్డువారిపాళెంలో ఏపీఐఐసీ సేకరించిన రైతుల భూములు వారివేనని బుధవారం హైకోర్టు ఆర్డర్ జారీ చేసింది. 1992లో ప్రభుత్వం పేదలకు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున భూమికి పట్టాలు జారీ చేసిందని, ఆ భూములను ఏపీఐఐసీ వారు పారిశ్రామిక పార్కు కోసం సేకరించి పరిహారం ఇవ్వకపోవడంతో చింతాబత్తిన నరసింహారావు అనే రైతు మరో ఎనిమిది మంది హైకోర్టును ఆశ్రయించారు. డబ్ల్యూవో 29423/2017 ఆర్డర్‌లో ఈ భూములు ఆ రైతుల ఆధీనంలో ఉంచాలని ఆదేశిస్తూ ప్రతివాదులుగా ప్రభుత్వం, ఏపీఐఐసీ, జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు నోటీసులు జారీ చేసింది.

మాల్ ప్రాక్టీస్‌లో ముగ్గురు విద్యార్థుల డీబార్

గూడూరు(టౌన్): పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ముగ్గురు విద్యార్థులను మాల్ ప్రాక్టీస్ కింద నమోదు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి తెలిపారు. స్థానిక కళాశాలలో దూరవిద్య శాఖకు సంబంధించి డిగ్రీ, పీజీ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ పరీక్షలలో డిగ్రీకి చెందిన ముగ్గురు విద్యార్థులను మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా పట్టుకుని డీబార్ చేశామన్నారు.

చరిత్ర తిరిగి చూసుకో చంద్రబాబు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటగిరి(టౌన్): సీఎం చంద్రబాబు తన జీవిత చరిత్ర తిరిగి చూసుకుంటే బాగుంటుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక త్రిపురసుందరి కల్యాణ మండపంలో వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన 'నవరత్నాల సభ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు గడుస్తున్నా మన రాష్ట్రంలో ఇంకా స్వాతంత్ర్యం రాలేదని టీడీపీ ప్రభుత్వం పాలన చూస్తుంటే అర్థమవుతుందన్నారు. వైఎస్ఆర్ హయాంలో అభివృద్ధి పరుగులు తీసిందన్నారు. తెలుగుదేశం ఎన్నికల వాగ్దానాలు ఒకటికూడా అములు కాలేదన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు చంద్రబాబును హీనంగా చేశారన్నారు. 1978లో రాజకీయాల్లో కొచ్చిన ఆయన తన స్వగ్రామం నారావారిపల్లిల్లో ఏమిచేయలేదని గ్రామస్థులు ఛీ కొట్టడంతో అప్పటి నుంచి కుప్పం నుంచి పోటీ చేస్తున్నారన్నారు. పులివెందుల గడ్డమీద మా వైఎస్ కుటుంబానికి ఎదురులేదని సవాల్ విసిరారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ వరప్రసాద్, జడ్పీచైర్మన్, వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వైసీపీ పట్టణ కన్వీనర్ గుమ్మళ్లపు ఢిల్లీబాబు, నక్కా వెంకటేశ్వర్లు, చిట్టేటి హరిక్రిష్ణ, తోట గిరిరెడ్డి, నెమ్మళ్లపూడి సురేష్‌రెడ్డి, మేరువ సురేంద్ర, అర్జునగారి మురళి, ముప్పాళ్ల సుబ్రహ్మణ్యం, ధనియాల రాధ, కలిమిలి రాంప్రసాద్ రెడ్డి, అనిల్ రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, పీ శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



తెలుగు తమ్ముళ్లలో నంద్యాల జోష్!


వెంకటగిరిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నంద్యాల ఉప ఎన్నికల ఫలితంతో తెలుగు తమ్ముళ్లు మంచి జోష్ మీద ఉన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ గెలుపు సాధిస్తామన్న ధీమా వారిలో వ్యక్తమవుతోంది. ఈ జోష్‌తో ఇప్పటికే పార్టీ రూపొందించిన పలు కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లేందుకు టీడీపీ నేతలు, శ్రేణులు సిద్ధమయ్యారు. ఇందులోభాగంగా గురువారం తొలిసారిగా వెంకటగిరిలో నిర్వహిస్తున్న సదస్సుకు మంత్రులు పొంగూరు, సోమిరెడ్డి, అమరనాథ్‌రెడ్డిలతోపాటు జిల్లా నేతలు హాజరు కానున్నారు. సెప్టెంబరు 10 నుంచి ఇంటింటికి టీడీపీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టి ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న నేతలను పార్టీలోకి ఆహ్వానించేందుకు రంగం సిద్ధమవుతోంది. క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన టీడీపీ నేతలను పార్టీ నుంచి సాగనంపేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు వైసీపీ నేతలు మాత్రం ఎవరికి వారుగా వ్యవహరిస్తూ నంద్యాల ఫలితాల తరువాత డీలా పడ్డారు.

తొలిగా వెంకటగిరిలో నియోజకవర్గ సర్వే
టీడీపీ బలోపేత దిశగా చర్యలు
కాంగ్రెస్ కీలక నేతలకు పార్టీలోకి ఆహ్వానం
క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లపై వేటుకు సిద్ధం
డీలా పడుతున్న వైసీపీ నేతలు

నంద్యాల గెలుపుతో..

నంద్యాల ఉప ఎన్నికల్లో జిల్లాకు చెందిన మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణలతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. అధినేత చంద్రబాబు ఎన్నికల మేనేజ్‌మెంట్ అనుసరించి నేతలు వ్యవహరిస్తూ నంద్యాల గెలుపునకు కృషి చేశారు. గెలిస్తే చాలన్న రీతిలో సాగిన నంద్యాల ఉప ఎన్నికలు 27వేల ఓట్ల మెజారిటీ రావడంతో తెలుగు తమ్ముళ్లలో మరింత జోష్ కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో గెలుపునకు నెల రోజులపాటు ఎంతో కష్టపడిన సోమిరెడ్డికి గురువారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు అభినందన సభ ఏర్పాటు చేశారు. నంద్యాలే కాదు.. కాకినాడలో కూడా గెలుపు తమదేనన్న ధీమా ఫలితాలకు ముందే కనిపిస్తోంది. ఈ రెండు ఉప ఎన్నికల ఫలితాలు జిల్లాలో పార్టీకి మరింత బలం చేకూరుస్తున్నాయి. మొదటి నుంచి జిల్లాలో వైసీపీకి గట్టిపట్టు ఉండడం ఈసారి కూడా గత ఫలితాలే పునరావృతమవుతాయని వైసీపీ నేతలు భావిస్తూ వచ్చారు. ఇటీవల జిల్లాను కుదిపేస్తోన్న క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారం వైసీపీ నేతలే సూత్ర, పాత్రధారులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలకు పోలీసులు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. వైసీపీ నేతల్లో ఐక్యతా రాగం అంతంత మాత్రమే ఉండగా, ప్రస్తుతం జరుగుతున్న నియోజకవర్గ నవరత్నాల సభలు గ్రూపులకు వేదికగా మారింది. కావలిలో జరిగిన ఈ సభకు మాజీ ఎమ్మెల్యేలు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిలు గైర్హాజరయ్యారు. అదే విధంగా ఉన్న ఆరుగురు ఎమ్మెల్యేల మధ్య కూడా విభేదాలు తార స్థాయిలోనే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మూలిగే నక్కపై...అన్నట్లు నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు వైసీపీ నేతల్లో తీవ్ర నిరుత్సాహం తీసుకువచ్చింది. ఈ ఉప ఎన్నికల్లో జిల్లాకు చెందిన వైసీపీ నేతలంతా వెళ్లి ఎంతో శ్రమించినా ఫలితాలు ఆశాజనకంగా రాకపోవడం డీలా పడ్డారు. ఇక కాంగ్రెస్ పార్టీ గట్టెక్కే పరిస్థితి లేకపోవడంతో ఆ పార్టీలో ఉన్న సీనియర్ నేతలు, ప్రజాదరణ ఉన్న ముఖ్య నేతలను టీడీపీలోకి ఆహ్వానించే విధంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏ చిన్న అవకాశం వచ్చినా టీడీపీ తమకు అనుకూలంగా మలుచుకునే విధంగా మంత్రుల బృందం సమన్వయంతో పని చేయాలని పార్టీ నేతలకు సంకేతాలు ఇస్తున్నాయి. నంద్యాల ఉప ఎన్నికల్లో పొంగూరు, సోమిరెడ్డిలు కలిసి, మెలసి పని చేసి మంచి ఫలితాలు సాధించినట్లే జిల్లాలో కూడా ఆ ఇద్దరి మంత్రులతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమరనాథ్‌రెడ్డి సహకారంతో మరింతగా పార్టీని బలోపేతం చేసే విధంగా ప్రయత్నాలు సాగనున్నాయి. సూళ్లూరుపేట, వెంకటగిరి, నెల్లూరు, సిటీ, రూరల్, కోవూరు, ఉదయగిరి, ఆత్మకూరు తదితర నియోజకవర్గాల్లో నేతల మధ్య ఉన్న విభేదాలు పక్కన పెట్టి అంతా సమన్వయంతో నడిచే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. సూళ్లూరుపేటలో త్రిసభ్య కమిటీ వేసే విధంగా ఇప్పటికే అధిష్ఠానం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయమన్న విధంగా టీడీపీ ఇప్పటి నుంచే అడుగులు వేస్తోంది. కొత్త నియోజకవర్గాలు వచ్చే పరిస్థితి లేకపోడంతో ఉన్న పది అసెంబ్లీ స్థానాల్లోనే పోటీ చేసి గెలవాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని నియోజక వర్గాలకు అభ్యర్థులెవరన్నది సంకేతాలు ఇచ్చి వారినే నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా పని చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. వైసీపీకి బలమున్న నియోజకవర్గాలను గుర్తించి గెలిచే వారికే టికెట్లు ఇవ్వాలన్నది ఆలోచన టీడీపీలో సాగుతోంది.

● 10 నుంచి ఇంటింటికి టీడీపీ

మూడేళ్ల చంద్రబాబు పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు సెప్టెంబరు 10 నుంచి ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ నెలకు ఒక సారి నియోజకవర్గ సదస్సు జరపాల్సి ఉంది. ఇందులో భాగంగా తొలిగా నియోజకవర్గ సదస్సును గురువారం వెంకటగిరిలో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు మంత్రులు సోమిరెడ్డి, నారాయణ, ఇన్‌చార్జి మంత్రి అమరనాథ్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరవుతారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మేమున్నామనే భరోసా కల్పించనున్నారు. సరికొత్త వ్యూహంతో నడుస్తూ మిత్రపక్షమైన బీజేపీతో అదే స్నేహహస్తం అందిస్తూ టీడీపీ నేతలు సాగనున్నారు.

- క్రికెట్ బుకీల ఆర్థిక లావాదేవీలపై ఆరా
- పోలీస్ కస్టడీ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు
- కోర్టు ఆవరణలో రిమాండ్ బుకీలకు బిర్యానీ

లాకర్ల బరువెంత.. బ్యాంకుల్లో బ్యాలెన్స్ ఎంత!?

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : క్రికెట్ బుకీల ఆర్థిక లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నెల్లూరు సహా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో వారికి ఉన్న బ్యాంకు ఖాతాలు, లాకర్ల వివరాలను సేకరించనున్నారు. ఈ నెల 3న అరెస్టు చేసిన ప్రధాన బుకీ కృష్ణసింగ్‌తోపాటు మరో ఎనిమిది మందిని మరోమారు విచారించేందుకు పోలీసులు 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరందరిపై గ్యామింగ్ యాక్టు, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం (ఎన్‌డీపీఎస్)తోపాటు పలు సెక్షన్ల కింద పోలీసులు అరెస్టు చేయడంతో బెయిల్‌కు అవకాశం లేకుండా ఉంది. ఇటీవల వీరిని విచారించేందుకు పోలీసులు కోర్టుకు విన్నవించగా, నెల్లూరు పోలీసులకు మూడు రోజులు, కావలి పోలీసులకు ఒక రోజే అవకాశం కలిగింది. ఈ సమయంలో పోలీసులు కొంత సమాచారం సేకరించారు. వీరి నుంచి మరింత సమాచారం సేకరించాలన్న ఉద్దేశంతో నెల్లూరు పోలీసులు కృష్ణసింగ్‌ను, కావలి పోలీసులు మన్నెం శ్యాంప్రసాద్‌లతోపాటు ప్రధాన బుకీలను తమ కస్టడీకి తీసుకునేందుకు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కావలి పోలీసుల పిటిషన్‌పై గురువారం కోర్టు విచారించనున్నది. ఇక నెల్లూరు పోలీసులు కృష్ణసింగ్‌తోపాటు మరో నలుగురిని పోలీసు కస్టడీకి తీసుకునేందుకు వేసిన పిటిషన్‌ను వచ్చే నెల 4న కోర్టు విచారించి అనుమతి ఇవ్వనుంది. ఇలా ప్రధాన బుకీలను 15 రోజులపాటు తమ కస్టడీకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించేందుకు పోలీసుల ప్రయత్నాలు సాగుతున్నాయి.


కోర్టు ఆవరణలో వాటర్ బాటిళ్లు

● బ్యాంక్ లాకర్లపై గురి

క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ఫోన్ల ద్వారా సమాచారం తీసుకుని నగదు చెల్లింపులు, జమలన్నీ బ్యాంకుల ద్వారానే సాగించారన్నది సమాచారం. జాతీయ క్రికెట్ బుకీ కృష్ణసింగ్ నెల్లూరుతోపాటు హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తదితర నగరాల్లో మకాం వేసి అక్కడ ఉన్న ప్రధాన బుకీలతో బెట్టింగ్‌లు నడిపినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇలా జిల్లాకు చెందిన ప్రధాన బుకీలంతా ఇదే పంథా అనుసరించే వారని వెల్లడైంది. ఈ నేపథ్యంలో ప్రధాన నగరాల్లో బ్యాంకు ఖాతాలు తెరచి లాకర్లను నిర్వహించేవారని సమాచారం. మొదట అదుపులోకి తీసుకుని విచారించిన సమయంలో లభించిన ఆధారాల మేరకు పోలీసులు విచారించారు. ఇందులో రాజకీయ నాయకులు, ఇతర నేతలు ఎవరన్నది గుర్తించారు. అందుకనే సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్, కోటంరెడ్డిలకు నోటీసులు జారీ చేసి విచారించారు. బుకీలు వారి అనుచరుల పేర్లతో ఉన్న బ్యాంకు లాకర్లపై దృష్టి పెట్టిన పోలీసులు వాటిని ఓపెన్ చేసి ఉన్న సమాచారాన్ని సేకరించేందుకే ప్రధాన బుకీలను పోలీసు కస్టడీకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ 9 మంది బుకీలపై ఎన్‌డీపీఎస్ కింద కేసులు నమోదు చేయడంతో ఈ కేసులన్నీ 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిధిలోకి తీసుకువచ్చారు. మరోవైపు జిల్లాలో ఉన్న ప్రధాన బుకీలు, పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లు సుమారు 300 మందిని ఇప్పటివరకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఇక ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రధాన బుకీలతో జిల్లాలోని బుకీలతో సంబంధాలపైనే పోలీసులు దృష్టి పెట్టారు. అందుకే ప్రధాన బుకీలను పోలీసు కస్టడీకి తీసుకుని బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌లకు తీసుకెళ్లి విచారించనున్నట్లు సమాచారం. ఆ తరువాత పూర్తి సమాచారం సేకరించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

● కోర్టు ఆవరణలో హల్‌చల్

ప్రధాన కేసుల్లో రిమాండ్ నిందితులుగా ఉన్న వారిని కోర్టు ఆదేశాల మేరకు 14 రోజులకు ఒకసారి కోర్టులో హాజరుపరచాలి. తదుపరి వాయిదా రోజు మళ్లీ వారిని కోర్టుకు తీసుకురావాలి. నెల్లూరు పోలీసులు అరెస్టు చేసిన కృష్ణసింగ్ మరో నలుగురు ప్రధాన బుకీల వాయిదా బుధవారం ఉండటంతో వారిని కోర్టులో హాజరు పరచాల్సి ఉంది. ఉదయం 11 గంటలకు విచ్చేసిన ఈ ప్రధాన బుకీలను మధ్యాహ్నం ఒకటిన్నర గంట తరువాత కోర్టులో హాజరుపరిచారు. ఏమనుకున్నారో ఏమో.. చేపల మార్కెట్ వద్ద ఉన్న ఎస్ఎస్ఏ హోటల్ నుంచి బిరియాని ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు తెప్పించుకుని కోర్టు వెనుక ఉన్న ఓ చెట్టు కింద ప్రధాన బుకీలతోపాటు పోలీసులు ఆరగించారు. 2.30 గంటలకు ప్రత్యేక వాహనంలో వారిని సెంట్రల్ జైలుకు పోలీసులు తీసుకెళ్లారు. ప్రధాన కేసుల్లో రిమాండ్ నిందితులుగా ఉన్న వారు బయట నుంచి తెచ్చిన ఆహారం తినకూడదు. ఎందుకంటే తెచ్చిన ఆహారంలో విష ప్రయోగం జరిగే అవకాశాలు ఉన్నాయని ఎన్నో జాగ్రత్తలు పాటిస్తారు. కనీసం మంచినీళ్లు కూడా తాగాలంటే ఎన్నో నిబంధనలు ఉన్నాయి. ఇవన్నీ విస్మరించి పోలీసులతోపాటు రిమాండ్ నిందితులుగా ఉన్న ప్రధాన బుకీలు ఏకంగా బిరియాని ప్యాకెట్లు తెచ్చి తినడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ సమయంలో బిరియాని ఎలా వచ్చిందన్న దానిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


కోర్టు ఆవరణలోనే బిరియానీ పొట్లాలు

హౌసింగ్ డేటా తప్పని తేలితే చర్యలు

నెల్లూరు(కలెక్టరేట్): హౌసింగ్ ఇంజనీర్లు తయారు చేసిన డేటా తప్పని తేలితే సంబంధిత ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముత్యాలరాజు హెచ్చరించారు. కలెక్టర్ బంగ్లాలో హౌసింగ్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. హౌసింగ్ డీఈలు, ఏఈలు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజాసాధికార సర్వేను పరిశీలించాలన్నారు. ఒకసారి డేటాను స్థిరీకరిస్తే దానిని మార్చటం కష్టమని, డేటాను సంపూర్ణంగా పరిశీలించి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని ఆదేశించారు. గృహనిర్మాణశాఖ ఇంజనీర్లు ఏమైనా సమస్యలు ఉంటే ఆ శాఖ పీడీతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. ఒకసారి డేటాను క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు పరిశీలించిన తరువాత ఆ డేటాను ఇతర శాఖల అధికారులు మరలా పరిశీలించటం జరుగుతుందని చెప్పారు. ఆ సందర్భంగా తప్పులు కనబడినట్లయితే సంబంధిత ఇంజనీర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో గృహనిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ కాలనీల్లో తాగునీరు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుదీకరణ త్వరితగతిన పూర్తి చేయించడానికి అనుమతులు వెంటనే తీసుకోవా లన్నారు. గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములు ఉన్న చోట పేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. వికలాంగులకు గృహనిర్మాణ పథకాలలో తగిన కోటా తప్పనిసరిగా ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్, పీఎంఏవై ఇళ్ల నిర్మాణాల గురించి మండలాల వారీగా వివరాలు రాబట్టారు. హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంజనీర్లు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఈఈ సాయిరాం నాయుడు, డీఈఈ ఆదినారాయణ, శర్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు



ఇస్రో ప్రయోగాలు విజ్ఞాన దిక్సూచీలు

ఇస్రో చేపడుతున్న ప్రయోగాలు అంతరిక్ష విజ్ఞానాన్ని దిక్సూచీలుగా నిలుస్తున్నాయని మండలంలోని నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు పండిట్ కొండూరు వెంకటేశ్వర్లురాజు అన్నారు. పీఎస్ఎల్వీ సీ-39 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని అకాంక్షిస్తూ బుధవారం పెవిస్టిక్ బార్, ఖాళీ పెన్నాలను వినియోగించి రాకెట్ నమూనా సృజనచిత్రాన్ని రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇస్రో అంతరిక్ష పరిశోధనా ప్రయోగాల విజయపరంపర కొనసాగాలని అకాంక్షించారు. అందుకు గాను శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

- గూడూరు(రూరల్)

ఏం మునిగిపోదులే..



సమావేశంలో చైర్ పర్సన్‌ను అడ్డుకుంటున్న కౌన్సిలర్లు

సూళ్లూరుపేట : ఊపిరుంటే... ఉప్పమ్ముకొని బతుకుతాంగాని సూళ్లూరుపేట ప్రాంతానికి వరద ముంపు కలిగించే తారకేశ్వర టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణాలకు అనుమతులు మాత్రం ఇచ్చే ప్రసక్తేలేదు... ఉపాధి కంటే ఊపిరిముఖ్యం... 31-7-2017న సూళ్లూరుపేట మున్సిపల్‌మీట్‌లో వైస్ చైర్ పర్సన్ గరిక ఈశ్వరమ్మ మాటలకు పార్టీలకు అతీతంగా కౌన్సిల్ మొత్తం వత్తాసు..

సరిగ్గా నెల తిరిగే సరికి... ఏం మునిగిపోదులే... తారకేశ్వరాతో ఉద్యోగాలొస్తాయి... ఉపాధి కలుగుతుంది... అభివృద్ధి జరగనుంది... 30-8-2017న మున్సిపల్ మీట్‌లో ఆ టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నట్లు అజెండాలో నమోదు చేసేసిన మున్సిపల్ చైర్ పర్సన్ నూలేటి విజయలక్ష్మి.

మేం అభ్యంతరం చెబుతున్నాం... అనుమతి ఇవ్వద్దంటున్నా వినరేం... ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే ఆ ఫ్యాక్టరీ వద్దే వద్దు అంటూ వైసీపీ ఫ్లోర్ లీడర్ ముత్తుకూరు లక్ష్మమ్మ... కౌన్సిలర్ దశయ్య, మరి కొందరు అడ్డుపడ్డా భేఖాతార్.

అదేంటీ... కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతుంటే ఆమోదించారంటూ అజెండాలో రాస్తున్నారేం... అధికారపార్టీకి చెందిన వైస్ చైర్ పర్సన్ గరిక ఈశ్వరమ్మ అడ్డు...

అయినా చైర్ పర్సన్ ఎవరినీ పట్టించుకోలేదు... మీరెంత అడ్డుపడ్డా... అనుమతి ఇచ్చేదే అంటూ ఆ నిర్మాణాలకు కౌన్సిల్ ఆమోదించిందని అజెండాలో నమోదు చేసేశారు.

ఏదైనా ఫ్యాక్టరీ వస్తే సంతోషించాలిగానీ.. అడ్డుకోకూడదు.. కమిషనర్ రాజగోపాల్‌రావు ఉచిత సలహా... ఏదైన ప్రమాదం జరిగితే కలెక్టర్ చూసుకుంటారంటూ చేతులు కాలిన తదుపరి ఆకులు పట్టుకోవచ్చన్నరీతిలో ఆయన భరోసా కూడా ఇచ్చేశారు.

చిన్న వర్షానికి కూడా ఉధృతంగా ప్రవహిస్తూ సమీప ప్రాంతాలని ముంచెత్తే పాములకాలువ గట్టున తారకేశ్వరా టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్న విషయం విదితమే. దీంతో ఈ టెక్స్‌టైల్స్ పార్కువల్ల సూళ్లూరుపేట ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి

> **'తారకేశ్వర'కు మునిసిపల్ అనుమతి**
>
> **పేటకు ప్రమాదమే లేదంటూ వ్యాఖ్యానం**
>
> **ఏదైన జరిగితే కలెక్టర్ చూసుకుంటారంటూ కమిషనర్ సైతం కితాబు**

ఉందంటూ గత నెలలో ఆంధ్రజ్యోతి తారకేశ్వరా ముంచేస్తావా... అన్న కథనాన్ని ప్రచురించింది. అదే సమయంలో ఈ టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే అధికారాన్ని ఆంధ్రప్రదేశ్ ఇండ్రస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు ఇవ్వాలని సూళ్లూరుపేట మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో ఈ అంశాన్ని పొందుపరిచారు. అయితే ఆంధ్రజ్యోతి కథనంతో ప్రజల్లో తారకేశ్వరా నిర్మాణంపై వ్యతిరేకత వెల్లువెత్తడంతో కౌన్సిలర్లు అందరూ ఆ సమావేశంలో ఆ నిర్మాణానికి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని నిరాకరించారు. అయితే నెల కూడా గడవకముందే మళ్లీ కౌన్సిల్ సమావేశంలో అనుమతి కోసం అజెండాలో అంశాన్ని పొందుపరిచారు. బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు అంతా తారకేశ్వరా నిర్మాణాలకు అనుమతి వద్దంటూ నిరాకరించారు. కానీ అధికారపార్టీ కౌన్సిలర్లు మాత్రం కళ్లుమూసుకొని పిల్లిపాలు తాగినట్లు వ్యవహరించారు. అయితే అధికారపార్టీకి చెందిన వైస్ చైర్ పర్సన్ గరిక ఈశ్వరమ్మ మాత్రం కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతుంటే అంగీకరించారని అజెండాలో రాయడం ఏమిటంటూ చైర్ పర్సన్‌ను నిలదీశారు. ఎవరు అడ్డువచ్చినా... పట్టించుకోని చైర్‌పర్సన్ అజెండాలో ఆ అంశాన్ని కౌన్సిల్ ఆమోదించినట్లు నమోదు చేసేశారు. భవిష్యత్తులో వరదలొచ్చి పేట ప్రాంతానికి ప్రమాదం జరిగితే బాధ్యత మున్సిపల్ చైర్ పర్సన్, అధికార పార్టీ సభ్యులదేనంటూ వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించారు.

ఆ ప్రాంతాన్ని పరిశీలించకుండానే :

తారకేశ్వర టెక్స్‌టైల్స్ పార్కువల్ల సూళ్లూరుపేటకు ముంపు ప్రమాదం పొంచి ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతుండగా అధికారపక్షం కౌన్సిలర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణంలో ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. కనీసం ఆ ప్రాంతాన్ని సందర్శించి వాస్తవాలను గమనించకుండానే పేటకు ప్రమాదం లేదంటూ వ్యాఖ్యానించడం, గుడ్డిగా నిర్మాణాలను అనుమతులు ఇచ్చేయడాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు.



సంతాపసభలో పాల్గొన్న నాయకులు

నిరాడంబరుడు..వెంకటసుబ్బయ్య

● మాజీమంత్రి పరసారత్నం

సూళ్లూరుపేట : ప్రజా జీవితంలో ఉంటూ నిరాడంబర జీవితాన్ని గడిపిన పిట్ల వెంకటసుబ్బయ్య అందరికీ ఆదర్శమని మాజీమంత్రి డాక్టర్ పరసారత్నం అన్నారు. మాజీ ఎమ్మెల్యే పిట్ల వెంకటసుబ్బయ్య సంతాపసభ స్థానిక చెంగాళమ్మ కల్యాణ మండపంలో బుధ వారం సాయంత్రం జరిగింది. ఈ సభలో పాల్గొన్న మాజీమంత్రి పరసారత్నం మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజాసేవ చేసిన వ్యక్తి వెంకటసుబ్బయ్య అని అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జీవీ ఆర్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ 16 ఏళ్ల ఎమ్మెల్యేగా పనిచేసినా ప్రజలకు అందుబాటులో ఉండేవాడని కొనియా డారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కాంగ్రెస్ సీనియర్ నేత బద్దెపూడి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా మూడు గుర్తులతో గెలిచిన వ్యక్తి పిట్ల వెం కటసుబ్బయ్య అని అప్పట్లో అంత ప్రజాదరణ కలిగిన నేత అని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, చెంగాళమ్మ ట్రస్టు బోరు చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ నాయకులు వేనాటి పరంధామరెడ్డి, శిర సనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, గూడూరు రఘునాథరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ నూలేటి విజయలక్ష్మి, చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కాళంగి ప్రభాకర్, తడ దొరవారిసత్రం జడ్పీటీసీలు బొమ్మన శ్రీధర్, ముప్పాళ్ల విజేత, చెంగాళమ్మ ఆలయ పాలకవర్గ సభ్యులు ఆకుతోట రమేష్, శ్రీనివాసులురెడ్డి, అలవల సూరి బాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో రాష్ట్ర సమావేశంలో జిల్లా నేతలు

నెల్లూరు(కలెక్టరేట్): విజయవాడలో గురువారం జరిగిన ఏపీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జిల్లా నుంచి ముఖ్య నేతలు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 11వ పీఆర్సీ కమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని, పదో పీఆర్సీ బకాయిల సమస్యలు పరిష్కరించాలని సమావేశంలో తీర్మానించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు తెలంగాణలోని ఏపీ ఎన్జీవో భవన్ తాళాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్సీ శేఖర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు ఎన్ ఆంజనేయ వర్మ, కార్యదర్శి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పొదుపు సంఘాల బకాయిలు రూ.40 కోట్లు

● డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి



మాట్లాడుతున్న పీడీ లావణ్యవేణి

చిల్లకూరు: జిల్లాలో పొదుపు సంఘాలు బకాయిలు రూ.40 కోట్లు ఉన్నాయని, ఆ సంఘాలు ముందుకు సాగాలంటే తీసుకున్న బకాయిలు సకాలంలో చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన పతాధికారులు, వీవోఏల గ్రూపు సభ్యులకు గ్రూపు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.40 కోట్లు బకాయిలు త్వరితగతిన చెల్లిస్తేనే పొదుపు మహిళలు తిరిగి రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా గ్రూపు సభ్యులు సమావేశాలు సక్రమంగా నిర్వహించి సభ్యులు వంద శాతం హాజరయితే బకాయిలు తీరే అవకాశం ఉంటుందన్నారు. వడ్డీలు కట్టలేని వారికి వన్‌టైం సెటిల్‌మెంటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిర్మల, శ్రీకాంత్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 96 లక్షలతో స్వర్ణాల ఘాట్ విస్తరణ

నెల్లూరు (సిటీ) : రొట్టెల పండుగను దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం నెల్లూరులోని స్వర్ణాల చెరువు ఘాట్‌ను వెడల్పు చే స్తున్నామని మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఆ నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.96లక్షలతో చెరువులోకి 60 అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల లోతు నీరు నిలిచేలా కాంక్రీట్ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఏడాది పొడవునా స్వచ్ఛమైన నీటిని ఘాట్ వద్ద నిలి పి ఉంచవచ్చన్నారు. ఘాట్ చుట్టూ రక్షణ గోడ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. అక్టోబర్ మొదటి వారంలో జరిగే రొట్టెల పం డుగలోపు పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. చిన్నపిల్లల కోసం చెరువులో రూ.3కోట్లతో ప్రత్యేక వాటర్ గేమ్ పార్కు నిర్మించే ఆలోచన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఢిల్లీరావు, కార్పొరేటర్లు రాజా నాయుడు, ప్రశాంత్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

‘మిస్ ట్రాన్స్‌క్వీన్-2017’ విజేత ఎవరు?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. **‘ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017’కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)

2. **చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)

3. **పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)

4. **ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)

5. **ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా

6. **భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్

7. **ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన ‘నంగ్‌తాంగ్ తంపక్’ గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్

8. **తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజౌరి

9. **అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్

10. **రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**
ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా



11. **జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30

12. **ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ

13. **101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనంద సేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత

14. **ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్

15. **ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్

16. **దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై

17. **ఇన్ఫోసిస్ నూతన చైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి

18. **‘గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు’గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్, ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్.బి.లోకూర్, ఎన్.వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

19. **ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి

20. **దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ ‘విస్తారా’తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కొర్సికా(ఫ్రాన్స్)

21. **రైల్వే బోర్డు నూతన చైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్థుతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహని

22. **ఒడిశా ప్రభుత్వం అందించే ‘బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్’ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్‌రావు

23. **తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి

24. **కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ‘స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్’ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)

25. **ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి) సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)

26. **ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ

27. **ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

28. **జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్

29. **లింగ సమానత్వం కోసం ‘జండర్’ ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా

30. **భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి ‘విదేశీభవన్’ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు

31. **ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా

32. **స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన ‘మిస్ ట్రాన్స్‌క్వీన్-2017’ విజేత?**
ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియ



33. **ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నేరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు

34. **2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ

35. **నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మోచి నది బి) తమూర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది

36. **షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) ఫోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)

37. **2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్

38. **బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్

39. **‘జార్’లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

40. **2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

1) సి	7) డి	13) బి	20) ఎ	27) బి	34) బి
2) డి	8) డి	14) సి	21) డి	28) ఎ	35) ఎ
3) బి	9) ఎ	15) బి	22) బి	29) డి	36) డి
4) ఎ	10) బి	16) బి	23) బి	30) ఎ	37) సి
5) ఎ	11) బి	17) సి	24) ఎ	31) డి	38) బి
6) బి	12) డి	18) సి	25) బి	32) ఎ	39) డి
		19) ఎ	26) డి	33) డి	40) బి

JOBS ఉద్యోగాలు

ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్‌స్క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14
సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29
దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్‌కు ప్రాధాన్యం ఉంటుంది.
గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి
ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్
అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
ఇమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్- **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 5
పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్‌టి 1, ఆర్థోపెడిక్స్ 1)
కాంట్రాక్ట్ వ్యవధి: ఆరు నెలలు
అర్హత - వేతనం: సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
ఇంటర్వ్యూ: సెప్టెంబరు 13న
వేదిక: Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.
ఇ-మెయిల్: adhocrstps@ntpc.co.in

నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?

ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం
2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్
3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంభన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్
4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం
5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్
6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్
7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ
8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపౌడర్ డి) ఏదీకాదు
9. ఇంజక్షన్‌ను స్టెరిలైజేషన్ చేయడానికి ఉపయోగించే పద్ధతి?
ఎ) ఆల్కహాల్‌లో కొద్దిసేపు నిల్వ ఉంచాలి
బి) నీటిలో వేడి చేయాలి
సి) ప్రెషర్ కుక్కర్‌లో వేడి చేయాలి డి) ఏదీకాదు
10. కింది వాటిలో నీటి శుద్ధ స్థితి ఏది?
ఎ) వర్షం నీరు బి) బావి నీరు
సి) కుళాయి నీరు డి) స్వేదన జలం
11. నీటిలోని ఆక్సిజన్ ఎన్ని Mg/liter కన్నా తక్కువ ఉండరాదు?
ఎ) 4 బి) 2 సి) 5 డి) 2
12. నూనె కలిపిన కాస్టిక్ సోడా ద్రావణాన్ని వేడి చేయగా వచ్చే పదార్థాన్ని దేని తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) ఇంధనం బి) ఎరువులు
సి) సబ్బులు డి) ప్లాస్టిక్
13. ప్రభుత్వం సరఫరా చేసే నీటిని సాధారణంగా శుద్ధి చేసే పద్ధతి?
ఎ) క్లోరినేషన్ బి) అంశిక స్వేదనం
సి) వడపోత డి) డికాంటేషన్
14. చక్కెర కిణ్వన ప్రక్రియలో ఏర్పడే ప్రధాన ద్రవం?
ఎ) మిథైల్ ఆల్కహాల్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథేన్ డి) బ్యూటేన్
15. రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) లెడ్ ఫెరాక్సైడ్ బి) మెగ్నీషియం ఆక్సైడ్
సి) అమ్మోనియం పర్‌క్లోరేట్
డి) పొటాషియం క్లోరేట్
16. మంచు ముక్కలు గాలిలో కన్నా నీటిలో త్వరగా కరగడానికి కారణం?
ఎ) నీరు గాలి కన్నా ఎక్కువ బరువైనది
బి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో తక్కువ
సి) నీరు, మంచు సంఘటనం సమానం
డి) ఉష్ణశక్తి గాలిలో కన్నా నీటిలో ఎక్కువ
17. ఆర్ధ్రతను కొలిచే పరికరం?
ఎ) థర్మామీటర్ బి) హైడ్రోమీటర్
సి) హైగ్రోమీటర్ డి) బారోమీటర్
18. చల్లని నీటిలో పూర్తిగా రూపాంతరం చెందనిది?
ఎ) బెంజోయికామ్లం బి) చక్కెర
సి) వంటసోడా డి) కాస్టిక్‌సోడా
19. పెట్రోల్ వల్ల కలిగే మంటలను ఆర్పేందుకు నీటిని ఉపయోగించరు ఎందుకు?
ఎ) నీటి చల్లదనం కన్నా మంటలు అధికంగా ఉంటాయి
బి) నీరు, పెట్రోల్ రసాయనికంగా చర్య జరుగుతుంది
సి) నీరు, పెట్రోల్ ఒకదానితో ఒకటి కలిసిపోయి పై పొరలోని పెట్రోల్ మండుతుంది
డి) ఏదీకాదు
20. నీరు మరిగే స్థానం?
ఎ) ఎల్లప్పుడూ 100°C
బి) వాతావరణ పీడనంపై ఆధారపడి ఉంటుంది
సి) సాపేక్ష ఆర్ద్రతపై ఆధారపడుతుంది
డి) సాంద్రతపై ఆధారపడుతుంది
21. వాతావరణం కలిగి ఉండే నీటిఆవిరి పరిమాణం కింది వాటిలో దేనిపై ఆధారపడుతుంది?
ఎ) ఉష్ణోగ్రత పెరిగితే నీటి పరిమాణం పెరుగుతూ ఉంటుంది
బి) ఉష్ణోగ్రత తగ్గితే ఆవిరి పరిమాణం తగ్గుతుంది
సి) ఉష్ణోగ్రతపై ఆధారపడదు డి) ఏదీకాదు



వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

22. శరీరంపై మరుగుతున్న నీరు పడినప్పుడు కంటే వేడి నీటి ఆవిరి వల్ల ఎక్కువ బొబ్బలు ఎందుకు వస్తాయి?
ఎ) నీటి ఆవిరి శరీరంలోకి తొందరగా చొచ్చుకొని పోతుంది
బి) నీటి ఆవిరి అధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉంటుంది
సి) నీటి ఆవిరికి వేడి నీటి కంటే శక్తి అధికం
డి) నీటి ఆవిరి అధిక పీడనాన్ని కలిగి ఉంటుంది
23. అరచేతిలో 'ఈథర్' ద్రావణం పోసినప్పుడు చల్లగా ఉండటానికి కారణం?
ఎ) ఈథర్ చల్లని ద్రావణం కనుక
బి) భాష్పీభవనం చెందుతుంది
సి) స్వేద రంధ్రాలను చేరుతుంది
డి) అరచేతిలో కందెనగా మారడం వల్ల
24. ఒక వ్యక్తి సముద్రపు నీటిలోకి ప్రవేశించగానే చల్లదనం పొందిన భావనకు గురవుతాడు. ఎందుకు?
ఎ) ఉష్ణ సంవహన ప్రవాహాలు
బి) శరీరంలో ఉష్ణ లవణాలు పేరుకుపోవడం
సి) దేహంపై నీరు భాష్పీభవనం వల్ల
డి) భూమికి, సముద్ర నీటికి మధ్య ఉష్ణోగ్రతల భేదం
25. థర్మో ప్లాస్క్‌లో చల్లని లేదా వేడి ద్రవాలు చాలాసేపటి వరకు అలాగే ఉండటానికి కారణం?
ఎ) థర్మో ప్లాస్క్‌లో రెండుగోడల నిర్మాణాలు అధమ ఉష్ణ వాహకంగా పనిచేస్తాయి
బి) ఈ రెండు గోడల నిర్మాణాలకు లోపలి భాగం సిల్వర్ పూత ఉంటుంది
సి) రెండు గోడల నిర్మాణాల మధ్య శూన్య ప్రదేశం ఉంటుంది డి) బి, సి
26. ఒక నదిలో ప్రయాణిస్తున్న నౌక సముద్రానికి చేరిన వెంటనే...
ఎ) కొద్దిగా పైకి లేస్తుంది
బి) కొద్దిగా మునుగుతుంది
సి) అదేవిధంగా కొనసాగుతుంది డి) ఏదీకాదు
27. సముద్రపు సాంద్రత దేనిలో పెరుగుతుంది?
ఎ) సముద్రపు లోతు, లవణీయత తగ్గుతూ ఉంటే
బి) సముద్రపు లోతు, లవణీయత పెరుగుతూ ఉంటే
సి) సముద్రపు లోతు పెరిగి లవణీయత తగ్గుతూ ఉంటే
డి) లవణీయత, సముద్రపు లోతు పెరుగుతూ ఉంటే
28. కింది ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహకం ఏది?
ఎ) నీరు బి) పాదరసం సి) ఈథర్ డి) ఆల్కహాల్
29. ఘనీభవించిన సరస్సులో చేపలు జీవించి ఉండటానికి కారణం?
ఎ) చేపల రక్తం వేడిగా ఉంటుంది
బి) మంచు కింద భాగంలోని నీరు ఘనీభవనం చెందదు
సి) మంచు ఒక మంచి ఉష్ణవాహకం
డి) ఏదీకాదు
30. రెండు పాదరస బిందువులను కలపగా ఒక పెద్ద బిందువుగా మారడానికి కారణం?
ఎ) కనిష్ఠ ఘనపరిమాణం
బి) గరిష్ఠ తలతన్యత
సి) కనిష్ఠ తలతన్యత వైశాల్యం
డి) గరిష్ఠ ఘనపరిమాణం
31. ఘనీభవించిన సరస్సు పైభాగంలో -15°C ఉష్ణోగ్రత ఉంటే కింది పొరల్లో ఉండే ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 0°C బి) 4°C సి) -15°C డి) -7.5°C
32. శీతల ప్రదేశాల్లో ఉపయోగించే థర్మామీటర్‌లో పాదరసం కన్నా ఆల్కహాల్ ద్రావణాన్ని తీసుకోవడానికి కారణం?
ఎ) ఆల్కహాల్ ఉత్తమ ఉష్ణవాహనం
బి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం తక్కువ
సి) ఆల్కహాల్ ఘనీభవన స్థానం ఎక్కువ
డి) ఏదీకాదు
33. 97% సముద్రపు నీరు, 3% శుద్ధమైన నీరు ఉండే లవణం?
ఎ) జలావరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) శిలావరణం డి) వాతావరణం
34. నీరు అనేది ఒక?
ఎ) ఒక మూలకం బి) ఒక ద్రవం
సి) ఒక మిశ్రమం డి) ఒక సంయోగ పదార్థం
35. నీటిలో ఆక్సిజన్ ఎంత శాతం ఉంటుంది?
ఎ) 86% బి) 96% సి) 21% డి) 100%
36. చెమట ఎక్కువగా పట్టేస్థితి?
ఎ) వేడి అధికంగా ఉండి, గాలిలో తేమ ఉండటం
బి) వేడి అధికంగా ఉండి గాలి పొడిగా ఉండటం
సి) వేడి తక్కువగా ఉండి గాలిలో తేమ ఉండటం
డి) వేడి తక్కువగా ఉండి గాలి పొడిగా ఉండటం
37. వార్షిక గ్లోబల్ ఇన్నోవేషన్ బారోమీటర్‌లో ఇండియా స్థానం?
ఎ) 3 బి) 4 సి) 5 డి) 6
38. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం?
ఎ) ఏప్రిల్ 7 బి) మే 7
సి) ఆగస్టు 7 డి) సెప్టెంబరు 6
39. ఇండియాలో చమురు శుద్ధి కర్మాగారాల సంఖ్య?
ఎ) 19 బి) 18 సి) 17 డి) 16
40. వాటర్ గ్యాస్ అంటే?
ఎ) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్
బి) కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్
సి) అల్యూమినియం హైడ్రేట్ డి) ఏదీకాదు
41. అనిమోమీటర్ ద్వారా దేన్ని లెక్కించవచ్చు?
ఎ) సముద్ర స్థాయిపైన ఎత్తుని బి) గాలి తేమను
సి) సముద్రపు లోతు డి) గాలి వేగాన్ని
42. వెంచురీ మీటర్ ద్వారా దేన్ని లెక్కిస్తారు?
ఎ) ప్రవాహిరేటు బి) గాలివేగం
సి) సాంద్రత డి) ఆర్ద్రత
43. మేఘాలు ఏర్పడటానికి కింది వాటిలో ఏది అవసరం లేదు?
ఎ) వాతావరణంలోని దుమ్ము కణాలు
బి) నీరు ఆవిరి కావడం సి) నీరు గడ్డకట్టడం
డి) గాలి
44. ద్రవ నైట్రోజన్‌లో దీర్ఘ అపరిశుద్ధమైనది?
ఎ) ద్రవ హీలియం బి) ద్రవ ఆక్సిజన్
సి) ఘన కార్బన్ డై ఆక్సైడ్ డి) ద్రవ హైడ్రోజన్
45. వేసవి ద్రవంగా పిలిచే పదార్థం?
ఎ) పాదరసం బి) నీరు సి) గాలియం డి) రేడియం

సమాధానాలు

1) బి	8) బి	15) సి	23) బి	31) ఎ	39) ఎ
2) బి	9) ఎ	16) డి	24) సి	32) సి	40) ఎ
3) సి	10) ఎ	17) సి	25) డి	33) ఎ	41) డి
4) ఎ	11) ఎ	18) ఎ	26) ఎ	34) డి	42) ఎ
5) డి	12) సి	19) సి	27) డి	35) ఎ	43) సి
6) సి	13) ఎ	20) బి	28) బి	36) ఎ	44) డి
7) సి	14) బి	21) ఎ	29) బి	37) డి	45) సి
		22) సి	30) సి	38) ఎ	

స్కాలర్‌షిప్

నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి), హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్(హెచ్‌బిసిఎస్‌ఇ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌కు ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

విభాగాలు: ఆస్ట్రానమీ, బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్
అర్హత: నవంబరు 30 నాటికి ఇంటర్ లోపు చదువుతున్న విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు
వయసు: 1998 జూలై 1 నుంచి 2003 జూన్ 30 మధ్య జన్మించి ఉండాలి
విభాగం: జూనియర్ సైన్స్
అర్హత: నవంబరు 30 నాటికి పదోతరగతి లోపు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: 2003 జనవరి 1 నుంచి 2004 డిసెంబరు 31 లోపు జన్మించి ఉండాలి.

ఈ ప్రోగ్రామ్‌లో అయిదు స్టేజ్‌లు ఉంటాయి. మొదటి స్టేజ్‌ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి) నిర్వహిస్తుంది. మిగిలినవాటిని హోమి బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బిసిఎస్‌ఇ) నిర్వహిస్తుంది.

స్టేజ్ 1 - ఫస్ట్ స్టెప్ టు ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ 2018 ఎగ్జామ్స్: నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఇన్ ఆస్ట్రానమీ (ఎన్‌ఎస్‌ఇఎ), బయాలజీ (ఎన్‌ఎస్‌ఇబి), కెమిస్ట్రీ(ఎన్‌ఎస్‌ఇసి), జూనియర్ సైన్స్ (ఎన్‌ఎస్‌ఇజెఎస్), ఫిజిక్స్(ఎన్‌ఎస్‌ఇపి)
పరీక్ష తేదీలు: ఎన్‌ఎస్‌ఇజెఎస్ ఎగ్జామ్ నవంబరు 19న, మిగతావన్నీ నవంబరు 26న
ఎన్‌రోల్‌మెంట్‌నకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
ప్రతి సబ్జెక్టులో అర్హత పొందిన మొదటి 300 మందిని స్టేజ్ 2కు అనుమతిస్తారు.
స్టేజ్ 2 ఎగ్జామ్స్: ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్స్ ఇన్ ఆస్ట్రోనమీ, బయాలజీ, కెమిస్ట్రీ, జూనియర్ సైన్స్, ఫిజిక్స్(ఐఎన్‌ఎఒ, ఐఎన్‌బిఒ, ఐఎన్‌సిహెచ్‌ఒ, ఐఎన్‌జెఎస్‌ఒ, ఐఎన్‌పిహెచ్‌ఒ)
స్టేజ్ 3: ప్రతి సబ్జెక్టులో ఓరియంటేషన్ కం సెలెక్షన్ క్యాంప్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారిని స్టేజ్ 4 కింద ప్రి డిపార్చ్యూర్ ట్రైనింగ్‌కు పంపుతారు. తదుపరి స్టేజ్ 5 ఉంటుంది.
పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
వెబ్‌సైట్: www.iapt.org.in
olympiads.hbcse.tifr.res.in

అడ్మిషన్స్

ఎన్‌ఐఇఎల్‌ఐటి

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఇఎల్‌ఐటి)- కింద పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **పీజీ డిప్లొమా**

విభాగాలు: క్లవుడ్ కంప్యూటింగ్/ ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ
కాలవ్యవధి: 24 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి
విభాగం: ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టం డిజైన్
కోర్సు వ్యవధి: 24 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 25 నుంచి

జాబ్ ఓరియంటెడ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులు

- **బిగ్ డేటా అనలిటిక్స్**

కోర్సు కాలవ్యవధి: 16 వారాలు
కోర్సు ప్రారంభం: సెప్టెంబరు 18 నుంచి

- **ఇన్ఫర్మేషన్ సిస్టం సెక్యూరిటీ లెవెల్ 1, ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జావా ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్**

కోర్సుల కాల వ్యవధి: 12 వారాలు
కోర్సులు ప్రారంభం: సెప్టెంబరు 11 నుంచి
వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

పోతిరెడ్డి పాళెంలో 'పొలం పిలుస్తోంది'

కోవూరు: పోతిరెడ్డిపాళెం, గంగవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారిణి కల్యాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షానికి పంట నుంచి నేలరాలిన విత్తనాలు మొలకెత్తకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. వర్షానికి నేలరాలుతున్న వరిలో గింజలు మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారి చేయాల్సిందిగా వివరించారు. ఈ సమావేశంలో ఎంపీఈవోలు రామలక్ష్మి, రాజశేఖర్, ఏటీఎం రమణి సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానంతో

నష్టపోతున్న కౌలు రైతులు

కొడవలూరు: ప్రభుత్వం అవినీతిని అడ్డుకునేందుకు బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ బయోమెట్రిక్ విధానం వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ప్రభుత్వం రాయితీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందని ద్రాక్షగా మారింది. కొడవలూరు మండలంలో ఈ ఎడగారుకు 2500 ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వరిసాగులో సగానికిపైగా కౌలు రైతులు ఉన్నారు.కౌలుకు పొలాలు ఇస్తున్న రైతులు తమ అవసరాల నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. కౌలుకు తీసుకొన్న రైతులు గత ఏడాది వరకు యజమానికి చెందిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, శిస్తు రసీదుల కాపీలను వ్యవసాయాధికారికి చూపించి ప్రభుత్వ రాయితీపై అందే పచ్చరొట్ట విత్తనాలను తీసుకువెళ్లేవారు. అయితే ఈ ఏడాది మాత్రం బయోమెట్రిక్ విధానం ప్రభుత్వం ప్రవేశ పెట్టడంతో భూమి కలిగిన రైతు నేరుగా వ్యవసాయాధికారి వద్దకు వచ్చి తన ఆధారు నంబరు చూపి వేలుముద్ర వేస్తే విత్తనాలను ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో భూమి కలిగిన రైతు సుదూర ప్రాంతంలో ఉండడంతో వారు ఇక్కడకు వేలుముద్ర వేసి పచ్చరొట్ట విత్తనాలను తీసుకొనే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కౌలు రైతులు చేసేదేమిలేక అధిక ధరలు వెచ్చించి బహిరంగ మార్కెట్‌లో విత్తనాలను కొనాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొందరు రైతులు తమ భూములను ఆన్‌లైన్‌లో పొందు పరచకపోవడంతో ఆ పొలాలు సాగుచేస్తున్న కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



బయోమెట్రిక్ విధానంతో తీవ్రంగా నష్టపోతున్నామని ప్రభుత్వం రాయితీపై ఇచ్చే పచ్చరొట్ట విత్తనాలు తమకు అందదంలేదని అందువల్ల ఈ ఏడాది పంట దిగుబడి తగ్గనుందనివ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **-రాచగిరి రవి,గుర్రాలదిన్నె**

మార్పులు తీసుకురావాలి



కౌలు రైతులకు అనుకూలంగా ఉండే విధంగా ప్రభుత్వం బయోమెట్రిక్ విధానంలో మార్పులు తీసుకురావాలి.కౌలు రైతులకు రాయితీలపై పచ్చరొట్ట విత్తనాలు అందే విధంగా చూడాలి.
- తలతోటి జేమ్స్‌బాబు

నీరుగారిన 'ఎన్టీఆర్ సుజల'

- **2 నెలలుగా మరమ్మతులు**
- **తీవ్రం కానున్న నీటి సమస్య**



ఎన్టీఆర్ సుజల పథకం ట్యాంకు



ఎన్టీఆర్ సుజల పథక భవనం

కోవూరు: పట్టణంలో మూడేళ్ల కిందట ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఎన్టీఆర్ సుజల పథకం నేడు నీరుగారి నిర్వీర్యమైంది. పట్టణ ప్రజలకు ఏకధాటిగా మూడేళ్ల తాగునీరు అందించిన పథకం రెండునెలలుగా పనిచేయడంలేదు. కొద్దిపాటి మరమ్మతులకు గురైన పథకాన్ని ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు పట్టించుకోకపోవడంతో ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే ఎన్టీఆర్ సుజల పథకం యంత్రాలకు మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెబుతున్నారు. నెల్లూరు నగరానికి చెందిన ఓ సంస్థ సుజల పథకాన్ని దత్తత తీసుకొందని మరమ్మతులు చేయాల్సిన బాధ్యత కూడా ఆ సంస్థదేనని అధికారులు చెబుతున్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లోపించడంతో ఎన్టీఆర్ సుజల పథకం ఆగిపోయింది. దీంతో స్థానికులు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. నీటి క్యాన్లను ప్రైవేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసుకొంటున్నారు. సమస్యను పరిష్కరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

వెంటనే మరమ్మతులు చేయాలి



ఎన్టీఆర్ సుజల పథకం అమలుకు యంత్రాలకు మరమ్మతులు వెంటనే చేయాలి. తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాం. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. వెంటనే తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం.
- గాదిరాజు చక్రవర్తి, వార్డు సభ్యుడు, కోవూరు

అధికారులపై ఒత్తిడి పెంచాం



ఎన్టీఆర్ సుజల పథకం సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకోమని అధికారులపై ఒత్తిడి పెంచాం. వెంటనే యంత్రానికి మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలి. ఇలాగే వదలేస్తే ఎన్టీఆర్‌సుజల పథకం నీరుగారిపోతుంది. అధికారులు స్పందించాల్సిందిగా కోరుతున్నాం.
- ఇంతా మల్లారెడ్డి, ఉపసర్పంచు, కోవూరు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని దామరమడుగు జడ్పీ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన 9మంది ఉపాధ్యాయులకు బుధవారం ప్రధానోపాధ్యాయుడు ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈనెల 18వతేదీన బదిలీపై వెళ్లిన కే రమణమ్మ, పీ ప్రసాదరావు, కే వెంకటయ్య, డీ సుబ్బారెడ్డి, పీ. శ్రీనివాసులు, పీ మాధవరావు, వై తిరుపతయ్య, కే నాగరాజారావు, పీ సులోచనలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు అభినందన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దామరమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. నాగేశ్వరరావు, స్థానిక పశువైద్యాధికారి పి. దేవరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

కోవూరు: సెప్టెంబరు 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాల్సిందిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పీజే సుధ కోరారు. మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు, పోలీసులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2012 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటిని పరిష్కరించే విధంగా దృష్టి సారించామన్నారు. అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పెదకాసీమ్ మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసుశాఖ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు యూనిఫారమ్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరావు

కోవూరు: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫారమ్ ధరించాలని ఎస్ఐ వెంకటరావు తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో ఆటో డ్రైవర్లతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్,డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడపకూడదన్నారు. నిర్లక్ష్యంగా వాహనాల్ని నడిపే డ్రైవర్లపై భారీ జరిమానా విధిస్తామన్నారు.

గ్రామాల్లో గేదెలకు టీకాలు

ఓజిలి: ఓజిలి మండలం కొండవల్లిపాడు, ఆరిమేనిపాడు గ్రామాలలో బుధవారం గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. పశువైద్యాధికారి సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రెండు గ్రామాలలో 525 గేదెలు, ఇతర జీవాలకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని వివియమ్స్‌పేటలో తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు పర్యటించారు. బుధవారం ఆయన ఆ కాలనీ ప్రాంతంలోని నివాసాలకు అనుకూలమైన ప్రభుత్వ భూమితోపాటు అక్రమంగా మట్టి తరలిస్తున్న పలు ప్రభుత్వ భూములను పరిశీలించారు. అదే విధంగా ఓ రైతు చెరలో ఉన్న సుమారు 2ఎకరాల ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. కాగా గిరిజనులకు మాత్రం ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇవ్వండంతో కాలనీ వాసుల్లో హర్షం వ్యక్తమైంది. ఈ పరిశీలనలో తహసీల్దార్ వెంట ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వో ఉన్నారు. అనంతరం రామచంద్రాపురంలో పర్యటించిన తహసీల్దార్‌తో స్థానికులు మాట్లాడుతూ తమ గ్రామంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయవద్దంటూ విన్నవించారు.

విధి నిర్వహణలో అప్రమత్తత

కోవూరు: విధి నిర్వహణలో పొదుపు సంఘాల వీవోఏలు అప్రమత్తంగా ఉండాల్సిందిగా డీపీఎం ప్రేమ్‌రాజ్ కోరారు. సంఘమిత్ర కార్యాలయంలో బుధవారం వీవోఏలకు, నూతన కార్యవర్గాలకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా తీసుకొన్న రుణాల్ని సక్రమంగా తిరిగి చెల్లించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ హేర్‌రామ్, డీపీఎం ఐబీ శ్రీధర్, ఏరియా కో ఆర్డినేటర్ సుధాకర్, సీసీలు సైదా, సుకయ్య, మమత, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం ప్రేమ్‌రాజ్

ఘనంగా ఉట్టి మహోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఉట్టి మహోత్సవాలను ఊరేగింపుతో భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. మండలంలోని జొన్నవాడ, కాశయకాగొల్లు, రేబాల తదితర గ్రామాలలో ఉట్టి మహోత్సవాల ఈసందర్భంగా యువత డప్పులు, డ్రమ్స్ చప్పుళ్లతో కోలాహలంగా రంగులు చల్లుకుంటూ ఉట్టిని ఊరేగించారు. మధ్యాహ్నం జొన్నవాడ బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద సుమారు 300మందికి పైగా అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా పలు గ్రామీణ ప్రాంతాల్లోని వినాయకుడి విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మిలీనియం మార్చ్ విజయవంతం చేయండి

వరికుంటపాడు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహించే మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలని మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హుజరత్, కరీముల్లా కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జరగబోయే మిలీనియం మార్చ్‌లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

ఉదయగిరి: పట్టణంలోని బాలాజీనగర్, బెస్తవీధి, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో పూజలు, అన్నదానం నిర్వహించారు. హోలీఏంజెల్స్ పాఠశాల సమీపంలో పాట కచేరీని ఏర్పాటు చేశారు. ఎస్ఐ ఎన్.ప్రభాకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉట్టి కొట్టడం, నిమజ్జనం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి పనుల తనిఖీ



అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న డీఈ భానుప్రసాద్

వరికుంటపాడు: మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ భానుప్రసాద్ పరిశీలించారు. వరికుంటపాడులోని శ్మశానవాటిక, తిమ్మారెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం పనులను పరిశీలించి, నాణ్యతాప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. సంబంధిత రికార్డులు తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ మనోహర్‌బాబు, పీఆర్ ఏఈ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

ఉదయగిరి: మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాల్సిన బాధ్యత క్షేత్ర సహాయకులు, మేట్‌లపై ఉందని ఏపీడీ శ్రీహరి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన క్షేత్ర సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలి గిట్టుబాటయ్యేలా చూడాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, పనులను ప్రతి రోజు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల గ్రామంలో రూ.1.50 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ కె.విజయకుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. దీంతో మండల ప్రజలకు లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. ఆత్మకూరు డీఈ షేక్ ఇస్మాయిల్, ఇతర సిబ్బంది శ్రీనివాసులు, ఏడీ సురేంద్రబాబు, శ్రీనివాసులరెడ్డి, సునీల్, ప్రభాకర్, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరువుపై ప్రజా ఉద్యమం

● సీపీఎం నేత మిరియం వెంకటేశ్వర్లు

ఉదయగిరి: ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఉదయగిరి సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఉదయగిరి డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లోని అన్ని మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉదయగిరి పసుపు కొనుగోలు కేంద్రంలో రూ.14 కోట్ల అవినీతికి కారణమైన నాయకులపై క్రిమినల్ కేసులు నమోదై నెల రోజులు దాటినా, వారిని అరెస్టు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. దీన్నిబట్టి కేసు నీరుగారేందుకు అధికారులు సహకరిస్తున్నారని తేటతెల్లమవుతోందన్నారు. తాగు, సాగునీరు లేక, గిట్టుబాటు ధరల్లేకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారన్నారు. కరువు మండలాలుగా ప్రకటించినా నేటి వరకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. అనంతపురం జిల్లా కన్నా, ఉదయగిరి ప్రాంతంలో కరువు తీవ్రత అధికంగా ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఉద్యమం చేస్తాన్నారు. నిజమైన పసుపు రైతులకు వెంటనే డబ్బు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శ్రీరాములు, సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య, లక్ష్మీనరసయ్య, మల్లికార్జున, స్వరాజ్‌బాబు, నాగూర్‌సాహెబ్, అమీర్, కామాక్షమ్మ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

వేసవి వెళ్లినా.. దాహం తీరదా?

ఉదయగిరి: వేసవి వెళ్లిపోయినా వెంకట్రావుపల్లిలో తాగునీటి కష్టాలు తీరడం లేదు. వంద కుటుంబాలు కలిగిన గ్రామంలో 250 మంది నివసిస్తున్నారు. గ్రామంలో రూ. 10 లక్షలతో రెండు మంచినీటి పథకాలను ఏర్పాటు చేశారు. ఒక పథకం ప్రారంభం నుంచీ పనిచేయకపోగా, మరో పథకం పది కుటుంబాలకు మాత్రమే ఉపయోగపడుతోంది. దీంతో మిగిలిన కుటుంబాలు గ్రామంలోని బోర్లు, చేదుడు బావులను ఆశ్రయించాల్సి వస్తోంది. బోరు నీరు సరిగా లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు



నిరుపయోగంగా సింథటిక్ ట్యాంకు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

వింజమూరు: వింజమూరు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మంటలను ఎలా అదుపు చేయాలో చేసి చూపించారు. అగ్నిమాపక అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ గ్యాస్ వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని ఇంట్లో ఉంచుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులున్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

సీతారామపురం: నీరు-చెట్టు కింద నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనుల్లో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ ఈఈ వరలక్ష్మి పేర్కొన్నారు. ఆమె బుధవారం మండలంలోని బసినేనిపల్లి, బాలాయపల్లి, సీతారామపురం పంచాయతీల్లో నిర్మించిన చెక్‌డ్యాం పనులను పరిశీలించారు. భూమి లోపల కటాఫ్‌వాల్ తేడాను సైతం పరిశీలించి రివిట్‌మెంట్‌లో చిన్న చిన్న రాళ్లను గుర్తించారు. వాటి స్థానంలో పెద్ద రాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కాంక్రీట్‌లో వచ్చిన జాయింట్లను సైతం సరి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ శ్రీధర్, ఏఈ ప్రసాద్, ఉదయగిరి డీఈ సుజిత్, ఏఈ ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి రూరల్: ఓనమాలు దిద్దించి జీవితాల్లో జ్ఞాన దివ్వెలను వెలగించిన ఉపాధ్యాయుల సేవలు జీవితాంతం మరువలేమని గండిపాళెం ఎంపీటీసీ సభ్యుడు జే.రమేష్ పేర్కొన్నారు. బుధవారం వెంగళరావునగర్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్ళిన ఏడుగురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టి, విద్యార్థుల భవితకు బంగారుబాటలు వేసిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు షేక్ ఎండీ ఖాజా, ప్రసన్నాంజనేయులు, అరితుల్ ఖదీర్, మాధవి, సువర్ణకుమారి, కరీముల్లా, ఉదయభాస్కర్‌లను శాలువాలు, పూలమాలతో సత్కరించి మెమొంటోలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సదానందరావు, సర్పంచ్ షంషాద్ బేగం, గ్రామపెద్దలు మహమ్మద్‌ఖాజా, సుబ్బరామయ్య, ఎస్ఎంసీ చైర్మన్ అమీర్‌బాషా, ఉపాధ్యాయులు ముంజీర్, అంజాద్, మాలకొండయ్య, శ్రీధర్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలోనే భోజనం చేయాలి

సీతారామపురం: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేయాలని ఉదయగిరి సీడీపీవో ఈశ్వర్‌రాణి పేర్కొన్నారు. ఆమె బుధవారం మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి, సీతారామపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించి రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. చిన్నారులను ఆకర్షించేలా కేంద్రాలను తీర్చిదిద్ది, కార్యకర్తల పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. కిశోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

ఉపాధి రికార్డులు సిద్ధం చేసుకోవాలి: ఏపీడీ

సీతారామపురం: వచ్చేనెల 5 నుంచి ఆడిట్ బృందం ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహిస్తున్నందున మండలంలోని ఉపాధి హామీ పథకం రికార్డులన్నీ సిద్ధం చేసుకోవాలని ఉదయగిరి ఏపీడీ శ్రీహరి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. 20 అంశాలకు సంబంధించిన కాగితాలు, ఫొటోలు ఓ ప్రణాళిక ప్రకారం ఫైల్ చేసుకుని ఉండాలన్నారు. 2015 ఏప్రిల్ నుంచి కొత్త సిస్టం ప్రకారం రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు. వాటిలో లోపాలకు సంబంధిత సిబ్బంది బాధ్యత వహించక తప్పదన్నారు. అనంతరం రికార్డుల నిర్వహణ తీరుపై సూచనలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాగరాజు, ఈసీ సురేస్, టీఏలు విష్ణు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఏపీడీ శ్రీహరి

చెత్తతో సంపద తయారీపై ముగిసిన శిక్షణ

వింజమూరు: వింజమూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ శిబిరంలో 84 పంచాయతీల అధికారులు, ప్రజాప్రతినిధులకు చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ జీరోవేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. దీనివల్ల గ్రామాల్లో శుభ్రతతోపాటు, పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. జీరోవేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్సుపర్సన్ సత్యనారాయణ, ఉపసర్పంచ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తదితరులున్నారు.

పారిశుధ్యం పనులు

వింజమూరు: కాటేపల్లి బీసీ కాలనీలో బుధవారం పంచాయతీ కార్యదర్శి విజయమ్మ పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. కొద్దిరోజులుగా కురుస్తున్న జల్లులకు వీధులన్నీ బురదమయ్యాయి. వీధులను శుభ్రం చేసి మురికి నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకున్నారు. మురుగు గుంతల్లో కిరోసిన్ బాల్స్ వేశారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 4

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అశాంతికి గురవుతారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

ధనురాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

రేపు సీసీఎస్ ఉద్యోగుల మహాసభ

నెల్లూరు (సాంస్కృతికం) : సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం విజయవాడలో నిర్వహించే శాంతియుత మిలియన్ మార్చ్ - మహాసభలకు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ ధనరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్ రామకిషోర్ ఓ సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ప్రతిభా పురస్కారాల కోసం

15లోగా పేర్లు నమోదు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం): ప్రతిభా పురస్కారాల కోసం జిల్లాలోని పద్మశాలి విద్యార్థులు సెప్టెంబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పద్మశాలి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు బీ బాలాజీ, ప్రధాన కార్యదర్శి ఎన్. అశ్వత్థామ, కోశాధికారి రామనాధులు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 7 గ్రేడ్‌పాయింట్లు దాటిన వారు, ప్రైవేటు పాఠశాలల్లో 8.5 పాయింట్లు దాటినవారు తమ మార్కుల జాబితా జెరాక్స్ కాపీని సేవాసెంటర్, నవయుగ ఫుట్‌వేర్, నెల్లూరులోగల కార్యాలయంలో అందచేయాలని కోరారు. పూర్తి వివరాలకు 77021 13558 నెంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

నేడు మంత్రి సోమిరెడ్డి పర్యటన

నెల్లూరు(కలెక్టరేట్): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని డీపీఆర్‌వో ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30లకు నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశంలో పాల్గొంటారని, 10 గంటలకు వెంకటగిరికి వెళ్లి టీడీపీ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం నెల్లూరు పురమందిరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

వెంకటగిరికి మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి గురువారం ఉదయం 10.30 గంటలకు వెంకటగిరికి చేరుకుంటారు. అనంతరం అక్కడే జరిగే టీడీపీ సమావేశంలో ఆయన పాల్గొంటారని డీపీఆర్‌వో తెలిపారు.

11 నుంచి ఎస్‌ఏ పరీక్షలు

19 నుంచి దసరా సెలవులు

నెల్లూరు (క్యాంపస్): ఈ విద్యా సంవత్సరం సమగ్ర మూల్యాంకనం -1 పరీక్షలను సెప్టెంబరు 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో మువ్వా రామలింగం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు సెప్టెంబరు 14 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు ప్రశ్నపత్రాలను సంబంధిత కేంద్రాలలో గంట ముందు, 15 కిలోమీటర్ల పైన దూరమున్న పాఠశాలలో ఒకటిన్నర గంట ముందు తీసుకోవాలన్నారు. ప్రశ్నపత్రాలున్న సీల్డ్ కవర్లు 15నిమిషాల ముందు ఇద్దరు టీచర్ల సమక్షంలో ఓపెన్ చేయాలన్నారు. టైం టేబుల్ పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం స్కూళ్లకు దసరా సెలవులను సెప్టెంబరు 19వ తేదీ నుంచి 30 తేదీ వరకు ప్రకటించిందన్నారు.

పరీక్షలు జరిగే తేదీల వివరాలు

తేదీ	ఉదయం 6,8,9,10తరగతులు	మధ్యాహ్నం 7,8,9,10 తరగతులు
సెప్టెంబరు 11	ఓరియంటల్ లాంగ్వేజ్	సంస్కృతం
సెప్టెంబరు 12	తెలుగు	తెలుగు-2
సెప్టెంబరు 13	హిందీ	హిందీ
సెప్టెంబరు 14	ఇంగ్లిష్	ఇంగ్లిష్-2
సెప్టెంబరు 15	మాథ్స్	మాథ్స్-2
సెప్టెంబరు 16	ఫిజికల్‌సైన్స్	బయాలజికల్‌సైన్స్
సెప్టెంబరు 18	సోషల్	సోషల్-2

మర్రిపాడులో 10.2 మి.మీ వర్షం

నెల్లూరు (కలెక్టరేట్) : జిల్లాలో బుధవారం సగటు వర్షపాతం 0.8 మి.మీగా నమోదైంది. మర్రిపాడులో 10.2 మి.మీ, వరికుంటపాడులో 8.2, వింజమూరులో 7.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మున్సిపల్ జూనియర్ కళాశాలకు గుర్తింపు ఏది..?

నెల్లూరు (క్యాంపస్) : నెల్లూరులోని వీఆర్ కళాశాల ఆవరణంలో ప్రారంభించిన మున్సిపల్ జూనియర్ కళాశాలకు ఇప్పటి వరకు గుర్తింపు లేకపోవడం ఎంతవరకు సబబని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.నందకిరణ్ బుధవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు.ఈ కళాశాలను మంత్రి నారాయణ, కలెక్టర్, ఇతర అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారని, అయితే ఇప్పటి వరకు కళాశాలకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. గుర్తింపు లేకపోతే విద్యార్థులు అన్యాయమైపోతారని ఆయన పేర్కొన్నారు. వెంటనే ఈ కళాశాలకు గుర్తింపునివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అవార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం, నెల్లూరు శాఖలు సంయుక్తంగా 2016-2017 సంవత్సరానికి ఉత్తమ యువజన సంఘాలకు అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన సమన్వయకర్త ఎస్ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుకు రిజిస్టర్ కాబడిన యువజన సంఘాలు, యువతీ, మహిళా మండళ్లు, అర్హులని పేర్కొన్నారు. 2016 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31 వరకు ఆ సంఘాలు విద్య, వైద్య, ఆరోగ్య, క్రీడా, పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రమదానం, స్వచ్ఛభారత్, వృత్తి శిక్షణ కార్యక్రమాల్లో, యువజనాభివృద్ధికి సేవలు అందించిన కార్యక్రమాలు, ఫొటోలు, పత్రికా ప్రచురణలను నిర్ణీత దరఖాస్తులో పొందుపరచి నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్రానికి పంపాలని కోరారు. ఎన్నికైన ఉత్తమ సంఘానికి 25వేల నగదు, ప్రశంసా పత్రం అందచేస్తామని తెలిపారు. కస్తూర్బా కళాక్షేత్రం, దర్గామిట్ట నెల్లూరు -524004 నుంచి దరఖాస్తులు పొంది, పూర్తిచేసిన వాటిని సెప్టెంబరు 20లోగా అందచేయాలని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 0861-2328680 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

యువజన సంఘాలకు పిలుపు

బీసీ సొసైటీ రుణాల్లో మార్పులు

వ్యక్తిగతంగా, గ్రూపుగానూ తీసుకునే వెసులుబాటు
బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి

నెల్లూరు (వేదాయపాళెం) : బీసీ సొసైటీ రుణాల మంజూరులో ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తూ జీవో 18 విడుదల చేసిందని బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో 11 బీసీ సొసైటీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిష్ఠంగా 15 మంది ఉండే బీసీ సొసైటీలలో గరిష్ఠంగా రూ.7.50లక్షల ఆర్థిక సాయం ఉండేదన్నారు. ఇందులో రూ. 3.75 లక్షలు సబ్సిడీగా ఉండేదన్నారు. దీన్ని ప్రభుత్వం ఒక్కో సభ్యుడికి గరిష్ఠంగా లక్ష రూపాయల సబ్సిడీతో రూ.2లక్షల ఆర్థిక సాయం మొత్తం మీద గ్రూపునకు రూ.30లక్షలు చేయూత అందించనున్నారు. ఈ లబ్ధిని గతంలో 15 మంది సభ్యులు గల గ్రూపునకు బ్యాంకులు రుణంగా ఇచ్చేవన్నారు. ఇకపై గ్రూపులో ఉన్న ఒక వ్యక్తి లేదా ఐదుగురు లేదా 15 మంది రుణం తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. కాని ఇందుకు ముందుగా గ్రూపు తీర్మానం తయారు చేసుకుని ఎంపీడీవో, బ్యాంకరుకు ఇవ్వాల్సి ఉంటుందని ఆయన వివరించారు. దీంతో ఒక వ్యక్తి లక్ష రూపాయల సబ్సిడీతో రూ.2లక్షల ఆర్థిక సాయం పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సొసైటీల నేతలంతా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 11 సొసైటీల నేతలు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్ల బంగారం

గ్రాము ధర	-	2,830
సవర (8 గ్రాములు)	-	22,640
వెండి కిలో ధర	-	42,700
వెండి గ్రాము ధర	-	42.70

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	96
లేయర్	82
స్కిన్ చికెన్	155
స్కిన్‌లెస్ చికెన్	183
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	172
స్కిన్‌లెస్	202
లేయర్	140

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

గూడూరు నిమ్మ మార్కెట్‌కు బుధవారం సెలవు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	11.270 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	6230 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో :	50 క్యూసెక్కులు
ఆవిరి :	43 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం	: 3 అడుగులు
కనిగిరికాలువ :	------------
ఎడమ కాలువ :	250 క్యూసెక్కులు
కనుపూరు కాలువ:	------------
బీపీఆర్ కాలువ :	------------
నెల్లూరుచెరువుకాలువ :	50 క్యూసెక్కులు



మీకు తెలుసా?

వేడి నీటికన్నా చల్లటి నీరు బరువుగా ఉంటుంది.



ఔనా!

మనుషుల్లో లాగానే..పిల్లులు, శునకాల్లోనూ ఎడమ చేతివాటం, కుడి చేతివాటం ఉంటాయి.

సూక్తి

అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించినట్లే. పోరాడి ఓడినవాడు తిరిగి గెలుస్తాడు.

ప్రపంచం నిదురోయింది ఇలా..

తుంపరలు తుంపరలుగా వర్షం పడుతున్న వేళ.. మెత్తని పరుపుపై... నులివెచ్చని దుప్పటి కప్పుకుని పడుకుంటే... ఆ సుఖమే వేరు కదూ! చరిత్రలోకి తొంగి చూస్తే.. మంచాలు ఉండవు, పరుపులు కానరావు. 'గచ్చు' కూడా కనిపించదు. కటిక నేలపైనే కంటి నిండా నిద్రపోయేవారు. ఆనాటి ఆదిమ మానవుడి నుంచి.. ఈనాటి ఆధునిక మానవుడి వరకు ఎలా నిద్రించారో ఓ సారి చూద్దామా!

ప్రారంభం

క్రీ.పూ. 10000



ఈ కాలంలో ఎక్కువ శాతం గుహల్లో నివసించేవాళ్లు. నేలపైన జంతువుల చర్మం వేసుకుని నిద్రించేవారు

క్రీ.పూ. 3600



ఈజిప్షియన్లు కర్రతో చేసిన మంచాలపై పడుకునేవారు.

క్రీ.పూ. 3400



పర్షియన్లు 'వాటర్ బెడ్స్'ను ఉపయోగించేవారు. వీటిని గొర్రె చర్మంతో తయారు చేసేవారు.

క్రీ.పూ. 27



ఈ కాలంలో ఉన్ని లేదా పక్షుల ఈకలతో రూపొందించిన విలాసవంతమైన బెడ్స్ వచ్చాయి. రోమన్లు వీటిపైనే నిద్రించేవారు.

క్రీ.శ. 1300

మొదటిసారిగా 'మాట్రస్' అనే పదం ఈ కాలంలోనే వాడారు. 'మాత్రహ్' అనే అరబిక్ పదం నుంచి 'మాట్రస్' వచ్చింది.

యూరోపియన్లు గడ్డితో తయారుచేసిన 'ఫ్యాబ్రిక్ పరుపు'లపై కునుకు తీసేవారు.

1500
(పునరుజ్జీవన కాలం)



18వ శతాబ్దం



ఇదే కాలంలో కాటన్ పరుపులు వచ్చాయి. ప్రజలు వాటిని ఉపయోగించడం అలవాటు చేసుకున్నారు. అమెరికాలో కాటన్ ఉత్పత్తి పెరిగింది ఈ సమయంలోనే.

1865



'కాయిల్ స్ప్రింగ్ మాట్రస్' ప్రజలకు అందుబాటులోకి వచ్చింది ఈ కాలంలోనే. 'సామ్యూల్ పీ కిటిల్' ఈమాట్రస్‌పై పేటెంట్ హక్కులు పొందాడు.

1879

థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి 'బల్బు'ను పరిచయం చేసిన సంవత్సరం. ఈ ఆవిష్కరణతో అమెరికా సగటు పౌరుని నిద్ర దాదాపు మూడు గంటలు తగ్గింది.

1950



విలాసవంతమైన పరుపులు వచ్చిన కాలం. కన్స్యూమర్ మార్కెట్‌లోకి ఇవి విరివిగా రావడంతో అందరినీ ఆకట్టుకున్నాయి

1970

స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తొలిసారిగా 'స్లీప్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించింది.

1960



మోడ్రన్ వాటర్ బెడ్స్ వాడటం మొదలైంది.

1990



నాసా 'విస్కో ఎలాస్టిక్ ఫోమ్' పరుపుల స్ఫూర్తితో, 'మెమొరీ ఫోమ్ మాట్రస్'లు రూపొందాయి.

ప్రస్తుతం

2012



ఎక్కువ లేయర్లతో సాఫ్ట్ కుషన్‌తో, ఎంతో సౌకర్యంగా ఉండే విలాసవంతమైన పరుపులు అందుబాటులోకి వచ్చాయి.

పదాలు కనుక్కోండి

L	E	A	F	Y	E	Y	P	N
Y	O	A	Y	E	K	L	E	C
C	R	U	E	K	A	D	N	R
E	A	T	L	R	R	L	W	I
I	N	U	L	U	T	O	O	S
P	G	M	O	T	F	C	R	P
C	E	N	W	R	E	D	B	W
E	L	P	P	A	P	M	A	J
B	C	H	A	N	G	E	Q	K

YELLOW PIE BROWN RAKE ORANGE	COLD CRISP AUTUMN RED	LEAF CHANGE APPLE TURKEY

చెప్పగలరా?

ఉడతలో ఉన్నా కానీ మిడతలో లేను
వాద్యంలో ఉన్నా కానీ వాదంలో లేను
మంచిలో ఉన్నా కానీ కంచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

చెప్పగలరా? : ఉద్యమం
జంతర్‌మంతర్ : 1. ఉమ్మడి 2. శ్రీకారం 3. సారూప్యం 4. మెరుపు

టంగ్ ట్విస్టర్స్

1. Excited executioner exercising his excising powers exces-sively.
2. Pail of ale aiding ailing Al's travails.
3. Double bubble gum, bubbles double.
4. Salty broccoli, salty broccoli, salty broccoli

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. మ్మఉడి ▸ ....
2. శ్రీరంకా ▸ ....
3. రూసాప్యం ▸ ....
4. రుపుమె ▸ ....

రంగుల ప్రపంచం



పోలేరమ్మ జాతర నిర్వహణకు రాజాల అనుమతి

● ప్రశాంతంగా నిర్వహించాలని సర్వజ్ఞ కుమార యాచేంద్ర సూచన

వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో సెప్టెంబర్ 13, 14వ తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్న గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణకు బుధవారం రాజాల అనుమతి పొందారు. జాతరలో అమ్మవారి ఆచారాలు నిర్వహించే పనిబాటలవారు, ఎండోమెంట్ అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద, జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తాండవ చంద్రారెడ్డి, కమిటీ



వెంకటగిరి పెద్దరాజా వీవీవీఆర్‌కే యాచేంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్వజ్ఞ కుమార యాచేంద్ర

సభ్యులు, దేవస్థానం మాజీ చైర్మన్ పులి కృష్ణారెడ్డి, పుర పెద్దలతో కలసి నగరిలోని బొడ్డుసైగల్ మండపానికి చేరుకున్నారు. అక్కడ రాజకుటుంబీకులు కుమారరాజా సర్వజ్ఞకుమార యాచేంద్ర పనిబాటల వారైన కుమ్మరి, చాకలి, ఎట్టివారికి పూలమాలలు వేసి ఆకు, తాంబూలం అందించి జాతరలో అమ్మవారి ఆచారాలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ప్రశాంతంగా నిర్వహించాలంటూ అనుమతించారు. ఆయన మాట్లాడుతూ దేశవిదేశాల నుంచి, ఇతర రాష్ట్రల నుంచి అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ యంత్రాంగంతో సహా ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతూ జాతర నిర్వహణకు మున్సిపల్‌శాఖ చేపట్టాల్సిన పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతామన్నారు. అంతకు ముందు రాజానగరి నుంచి ప్రదర్శనగా బయలుదేరి వెళ్లి కైవల్యా నది వంతెన వద్ద ఉన్న వెంకటగిరి పెద్దరాజా వీవీవీఆర్‌కే యాచేంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతు బాల, మంకు ఆనంద్, బీరం రాజేశ్వరరావు, కావేరి పాకం రమేష్, కోటి నాయుడు, వాసు, మల్లికార్జున్, నరసింహులు, నాగరాజు, జొన్నాదుల శ్రీను పాల్గొన్నారు.



పనిబాటల వారికి తాంబూలం అందించి జాతర నిర్వహణకు అనుమతిస్తున్న రాజ కుటుంబీకుడు కుమార్‌రాజా సర్వజ్ఞ కుమార యాచేంద్ర

● జాతర తెలియ చెప్పేదే చాటు...

బుధవారం అర్ధరాత్రి జాతర పనిబాటల వారు కాంపాళెం వద్ద ఉన్న కామాక్షమ్మ దేవస్థానం వద్ద టెంకాయ కొట్టి చేత బట్టిన తప్పెట్లపై మూడు దెబ్బలు వేసి రేపొచ్చే బుధవారం కాక పై వచ్చే బుధవారం గ్రామశక్తి పోలేరమ్మ జాతరహో.. అంటూ అరుస్తూ గ్రామ నలువైపులా తిరుగుతూ గ్రామ ప్రజలకు తెలియ చెప్పారు.

● తొలిచాటుపై ప్రజల నమ్మకం

గ్రామంలో తొలిచాటు వేసే సమయానికి గ్రామంలో నిద్ర చేసిన ప్రతి ఒక్కరు తప్పని సరిగా అమ్మవారిని దర్శించుకొని తీరాల్సిందే. లేకుంటే అరిష్టం జరుగుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. అమ్మవారిని దర్శించుకొనే వీలు లేదన్నవారు తొలి చాటుకు గ్రామంలో నిద్ర చేయకుండా పక్క ప్రాంతాలకు వెళ్లి పోవడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ.

● జాతరలో ప్రాధాన్యత కలిగిన ఘట్టాలివే..

బుధవారం రాజాల తాబూలంతో తొలిచాటు. 6న రెండవ చాటు. 10న అమ్మవారి రాకను తెలియచెప్పే ఘటోత్సవం. 13న 3వ చాటుతో కొలువు తీరనున్న అమ్మవారు రాత్రి జాతర. అదే రోజు మడి బిక్షాలు, అంబలి చలివేంద్రాలు, కోళ్ల బలి, వేయికళ్ల దుత్తల్లో పిండి దీపాలు వెలిగించి అమ్మవారిని చల్లని చూపుల అనుగ్రహం వంటి మొక్కులు చెల్లించుకొంటారు. 14న దున్నపోతు బలి, ఇళ్ల ముంగిట పోట్టేళ్ల బలి, మడి చీరలపై నడవడం, నవ ధాన్యాల మొలకలు అమ్మవారికి సమర్పించి అనుగ్రహం, ఊరి పొలిమేరల్లో పోలి చల్లడం. అమ్మవారి విరూపోత్సవం కార్యక్రమాలు జరుగుతాయి.

దేశానికే ఆదర్శం.. పినాకిని ఆశ్రమం

● అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కలెక్టర్

ఇందుకూరుపేట : పల్లెపాడులోని పినాకిని ఆశ్రమం దేశానికే ఆదర్శమని జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు అన్నారు. ఈ ఆశ్రమాన్ని మరింత అభివృద్ధి చేసి యువతకు అందించే పనులను చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకూరుపేట మండలం పల్లెపాడులోని గాంధీ ఆశ్రమాన్ని బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న రూ.1.18 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆశ్రమాన్ని ప్రజలకు చేరువ చేయాలని అప్పుడే ఆశ్రమ ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ప్రతి రోజు ఇక్కడ వచ్చిపోయే దానికి పర్యాటకులను ఆకర్షించేందుకు స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆ దిశగా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. పచ్చటి వాతావరణం మధ్య 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆశ్రమాన్ని దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గాంధీ ఫిలాసఫీ కోర్సుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. కమ్యూనిటీ హాలు, గోశాల, కుట్టు పనుల శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేవలం కుట్టు మిషన్ పరిసర ఐదు గ్రామాలకే కాకుండా జిల్లాలోని మహిళలందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసి స్వయం పథకాల కింద పలు కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అనంతరం అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో, మహిళలతో కొద్దిసేపు ముచ్చటించారు. కలెక్టర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విజయకుమార్, ఆశ్రమ నిర్వాహకుడు నేదురుమల్లి సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.



ఆశ్రమ వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ముత్యాలరాజు

గోప్యంగా వీఎస్‌యూ ఈసీ సమావేశం

● ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

● దూర విద్య, ఇన్నోవేటివ్ సెంటర్ల ఏర్పాటు

● పలు అభివృద్ధి కార్యక్రమాలకు పచ్చజెండా

● క్రీడలకు ప్రాధాన్యం

నెల్లూరు (క్యాంపస్) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఏది జరిగినా గోప్యమే. చివరికి కార్యనిర్వాహక సంఘం(ఈసీ) సభ్యుల సమావేశం జరిగినా అధికారులు దానినీ గోప్యంగానే ఉంచారు. మంగళవారం వర్సిటీ పరిపాలనా భవనంలో ఈసీ మెంబర్ల సమావేశం జరిగింది. కాకుటూరులోని నూతన భవనాలలోకి వర్సిటీని తరలించిన తర్వాత ఇది మొట్టమొదటి ఈసీ సమావేశం. ఇందులో పలు అంశాలపై చర్చించి కొన్నింటికి పచ్చజెండా ఊపారు.

ఈ సమావేశంలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు. కలెక్టర్‌కు ఈ వారంలో రోస్టర్ జాబితా పంపి ఆయన ఆమోదం పొందిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. యూనివర్సిటీలో దూరవిద్య కేంద్రం, ఇన్నోవేటివ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. ఇక ఎప్పటి నుంచో వివాదాల మధ్య ఉన్న ఏఆర్ పోస్టును దీప్తికి కాకుండా నూతన నోటిఫికేషన్ విడుదల చేసి ఎస్సీ కేటగిరి మహిళతో భర్తీ చేయాలని నిర్ణయించారు. జైన్ మందిరం ఎదురుగా వర్సిటీ స్వాగత తోరణం, ఆ రోడ్డుకు రివిట్మెంట్, డివైడర్, సెంట్రల్ లైటింగ్, బాలుర, బాలికల వసతి గృహాల పెంపు, లైబ్రరీ భవనంలో మరమ్మతులు చేసేందుకు ఈసీ మెంబర్లు అంగీకరించారు.

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఈనెల 29వ తేదీ క్రీడా దినోత్సవం రోజున ఆంధ్రజ్యోతిలో క్రీడలపై చిన్నచూపు అన్న కథనం ప్రచురితమైంది. అందులో వసూళ్లకే పరిమితమైన వీఎస్‌యూ, ప్రోత్సాహం శూన్యమంటూ యూనివర్సిటీలో క్రీడల పరిస్థితిని వివరించగా దీనిపై ఈసీ మెంబర్లు చర్చించారు. వెంటనే వర్సిటీ కళాశాల ప్రాంగణంలో ఫుట్‌బాల్ కోర్టు, క్రికెట్ పిచ్, విద్యార్థులు ఆడుకునేందుకు అనువైన మైదానం ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల కోసం వాకింగ్ ట్రాక్ నిర్మించాలని నిర్ణయించారు. క్రీడా మైదానాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు. మొత్తంగా వాదోపవాదాలు, రచ్చ లేకుండా వర్సిటీ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. అయితే కొందరు సభ్యులు మాత్రం సమావేశం సమాచారం ఒక్కరోజు ముందు మాత్రమే చెప్పారని, దీంతో కొందరు సభ్యులు హాజరు కాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం

డే బోర్డర్ సెంటర్‌కు రేపటి నుంచి క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (క్యాంపస్) : రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా విధానంలో భాగంగా జిల్లాను డే బోర్డర్ సెంటర్‌గా ఎంపిక చేసిందని, ఆ కేంద్రంలో శిక్షణ పొందేందుకు క్రీడాకారుల ఎంపిక సెప్టెంబర్ 1, 2 తేదీలలో జరుగుతుందని డీఎస్‌డీవో పీవీ రమణయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13 నుంచి 25 ఏళ్ల వయస్సు గల క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అథ్లెటిక్స్, ఖోఖో, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడలందు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 1వ తేదీ ఉదయం 9 గంటల నుంచి అథ్లెటిక్స్, ఖోఖో, బాస్కెట్‌బాల్ అంశాల్లో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. 2వ తేదీ ఫుట్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. ఆ జాబితాను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థకు పంపుతామని, వారు ఆమోదించిన క్రీడాకారులకు నిరంతర శిక్షణ ఇస్తూ ప్రభుత్వం ద్వారా ఇతర ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. జిల్లాలో 400మీటర్ల రన్నింగ్ ట్రాక్‌తోపాటు అథ్లెటిక్స్ ఈవెంట్లు నిర్వహించడానికి అనుకూలమైన మైదానాలు, టీమ్ గేమ్‌కు సంబంధించిన క్రీడా మైదానాలు కలిగి ఉన్న జూనియర్, డిగ్రీ కళాశాల యాజమాన్యాలు కూడా డే బోర్డర్ సెంటర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

చేజర్ల: రోడ్డు ప్రమాదాలపై చేజర్ల ఎస్ఐ బాచిరెడ్డి బుధవారం చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 ఏళ్ల దాటిన వారు ఎక్కువగా వాహనాలు నడుపుతున్నారని, వారికి అవగాహన లేక పోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇకపై వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్సు పొంది ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా కుటుంబసభ్యులు జాగ్రత్తపడాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం


మొక్కలు నాటుతున్న మాదాసు గంగాధరం

కలువాయి: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం అన్నారు. కుల్లూరు-పెంచలకోన రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వం చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. అటవీ శాఖ అధికారులతో కలసి రోడ్డు పక్కన మొక్కలు నాటారు. పెంచల కోన రోడ్డుకు వెంకటరెడ్డిపల్లి నుంచి వెంకటరామరాజుపేట వరకు ప్రభుత్వం అవెన్యూ ప్లాంటేషన్ పనులు చేపట్టింది. రోడ్డుకు ఇరువైపులా 2000 మొక్కలు నాటి వాటి సంరక్షణకు నిధులు మంజూరు చేసింది. కుల్లూరు గ్రామాన్ని దత్తత తీసుకున్న మదాసు గంగాధరం సతీమణి వినతి మేరకు ప్రభుత్వం ఈ పనులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా మాదాసు మాట్లాడుతూ నాటిన మొక్కలను కాపాడి పెంచలకోన రోడ్డును ఆదర్శంగా తయారు చేసేందుకు సహకారమందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రదర్శనాక్షేత్రాలు సద్వినియోగం చేసుకోవాలి

కలువాయి: ఆత్మ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రైతు ప్రదర్శనాక్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు, విజ్ఞానయాత్రలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ పీడీ ఆనందకుమారి కోరారు. మండలంలోని పర్లకొండ గ్రామంలో బుధవారం ఆత్మ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డీపీడీ పద్మలత, పొదలకూరు ఏడీఏ నాగేశ్వరావు, మండల వ్యవసాయాధికారి ఏ.వాసు, ఆత్మ బీటీఎం సత్యకుమార్, ఏఈవో డీ.సుబ్బారావు, ఏటీఎం ఎం.చైతన్య, రైతులు పాల్గొన్నారు.

చింతగుంటలో వైద్యశిబిరం


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న చెంచు నరసింహులు

చింతగుంట(వెంకటగిరి): పట్టణంలోని చింతగుంటలోని రామ మందిరం వద్ద బుధవారం కాలె చెంచు నరసింహులు బ్రదర్స్ ఆధ్వర్యంలో నెల్లూరు నారాయణ హాస్పిటల్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ నేత కాలె చెంచు నరసింహులు ప్రారంభించారు. డాక్టర్లు హిమబిందు, హారికా చౌదరి, సాయికుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి నెల్లూరు నారాయణ ఆసుపత్రికి తీసుకు వెళ్లనున్నట్లు ఆసుపత్రి పీఆర్వో శేషయ్య తెలిపారు.

మోటారు బైక్ దహనం

హనుమాన్‌నగర్(వెంకటగిరి): పట్టణంలోని హనుమాన్ నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రాజశేఖర్‌కు చెందిన మోటారు బైక్‌ను దహనం చేశారు. బాధితుడి కథనం మేరకు.. మోటారు బైక్‌పై మినరల్ వాటర్ వ్యాపారం చేసుకొనే రాజశేఖర్ మంగళవారం రాత్రి ఇంటి సమీపంలో మోటారుబైకును ఉంచాడు. ఉదయం లేచి చూసే సరికి బైక్ తగలబడి ఉండటాన్ని గమనించారు. ఆయనంటే గిట్టని చాటి వ్యాపారులే ఈ పని చేయించి ఉంటారన్న ఆనుమానం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.


దహనమైన మోటార్ బైక్

నాణ్యతకు తిలోదకాలు

● ఇష్టారాజ్యంగా మాంసం దుకాణాల నిర్వహణ
● పొంచి ఉన్న రోగాలు
● అటకెక్కిన అధికారుల తనిఖీలు

ఆత్మకూరు: మాంసం దుకాణాల నిర్వహణలో నిబంధనలు పాటించకపోవడం, కొన్ని దుకాణాల్లో మృతి చెందిన జీవులు మాంసం విక్రస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మాంసం దుకాణాలను తనిఖీ చేయాల్సిన అధికారులు వాటి వైపు కన్నెత్తి కూడా చూస్తున్న దాఖలాలు లేవు.

ఆత్మకూరు పట్టణంతో పాటు నియోజకవర్గంటోని మండల కేంద్రాల్లో ప్రధాన రహదారి వెంబడి మాంసం దుకాణాలున్నాయి. దీంతో వాహనాల రాకపోకల కారణంగా రేగిన దుమ్ము మాంసంలో కలుస్తోంది. కొందరు దుకాణదారులుమిగిలిపోయిన మాంసాన్ని ఫ్రీజర్లలో నిలువచేసి విక్రయించడం పరిపాటిగా మారింది. ఈ మాంసాన్ని తక్కువ ధరకే వస్తుండడంతో హోటళ్ల యజమానులు దీనిని కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో వినియోగదారులు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. వేసవికాలంలో కోళ్లు అధికంగా చనిపోతుంటాయి. అలాంటి వాటిని సైతం కొన్ని ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇలాంటి మాంసాన్ని తింటే క్యాన్సర్, ఊపిరితిత్తు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పట్టణం నుంచి పల్లె వరకు చికెన్‌తో చేసిన వంటకాలు విక్రయించే దుకాణాలు అధికంగానే ఉన్నాయి. వీటిలో అనుమతి పొందిన దుకాణాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు.

● అటకెక్కిన తనిఖీలు

నిబంధనల ప్రకారం మాంసం విక్రేతలు జీవాలను కొనేటప్పుడు సంబంధిత అధికారి జంతువు ఆరోగ్యంగా ఉందా, లేదా అని పరిశీలించి ముద్ర వేయాలి. మున్సిపాలిటీలో పశు వైద్యులు, పల్లెల్లో పంచాయతీ సిబ్బంది తనిఖీ చేయాలి.కానీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తనిఖీలు అటకెక్కాయి. ఆహార భద్రత, నియంత్రణ అధికారులు కొన్ని ముఖ్యపట్టణాలకే పరిమితమవుతుండడంతో కనీస తనిఖీలు కూడా చేయలేని దుస్థితి నెలకొంది.

ఇకనైనా సంబంధిత అధికారులతో పాటు స్థానిక అధికారులు మాంసం విక్రయాలు, దుకాణాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.


ఆత్మకూరులో రోడ్డు పక్కనే మాంసం దుకాణాలు

విద్యార్థులకు చేయూత హర్షణీయం


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య

ఆత్మకూరు: విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు దాతలు చేయూతనివ్వడం హర్షణీయమని ఆత్మకూరు వెస్ట్‌స్కూల్ ప్రధానోపాధ్యాయులు తోడేటి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో దాత చల్లా వెంకమ్మ తన సొంత నిధులతో 160 మంది విద్యార్థులకు విరాళంగా అందచేసిన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఎంతోమంది దాతలు తమవంతు చేయూతనందించారని పేర్కొన్నారు. అదేక్రమంలో చల్లా వెంకమ్మ ఈ ఏడాది విద్యార్థులకు అవసరమైన నోటుపుస్తకాలు, పెన్నులు, పలకలు విరాళంగా అందచేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో విరాళదాత చల్లా వెంకమ్మ, ఉపాధ్యాయులు పి.సి.వి.రాఘవరెడ్డి, సీహెచ్ శివయ్య, రఘునారాయణ, రాఘవరెడ్డి, మంజులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



సీసీ రోడ్లు మంజూరు

సుబ్బారెడ్డి, పీఆర్ ఏఈ

?. మండలంలోని గ్రామాలకు సీసీరోడ్లు మంజూరయ్యాయా

!. మండలంలోని 11 పంచాయతీలకు సీసీ రోడ్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

?. గతంలో మంజూరైన సీసీ రోడ్ల పూర్తయ్యాయా?

!. ఇర్లపాడు, నందవరం పంచాయతీల్లో సీసీ రోడ్ల పనులు జరగలేదు. మిగతా పంచాయతీల్లో పనులు పూర్తయ్యాయి.

?. ఎంపీ దత్తత గ్రామంలో సీసీరోడ్డు పనుల పరిస్థితి ఎలా ఉంది?

!. ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి దత్తత గ్రామమైన కంపసముద్రంలో సీసీ రోడ్ల పనులన్నీ పూర్తయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్లకు చివరి బిల్లులు రావాల్సి ఉంది.

\- మర్రిపాడు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఆత్మకూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని రెమెడీ జిల్లా కో-కన్వీనర్ జె.జయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం అంబేద్కర్ నగర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు, నీటిని వేడి చేసుకుని తాగడం శ్రేయస్కరమన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలను వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం దొరసానమ్మ, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రెమెడీ కోకన్వీనర్ జయలక్ష్మి

యూటీఎఫ్ నాయకుల ప్రచారం


ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చేజర్ల: మండలంలోని మాముడూరు, తూర్పుపల్లి, వావిలేరు, ఆదురుపల్లి గ్రామాల్లో యూటీఎఫ్ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇటీవల నూతన ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో యూటీఎఫ్‌లో సభ్యులుగా చేరాలని సమావేశాలు నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.రవిబాబు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ వచ్చే నెల 1న విజయవాడలో తలపెట్టే మిలీనియం మార్చ్‌కు ఉపాధ్యాయులందరు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎ.సుబ్రమణ్యం, ఎన్.రమణయ్య, బుజ్జిబాబు, ఆర్.వెంకటకృష్ణారెడ్డి, నరహరి, వెంకటేశ్వర్లు, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపదపై ముగిసిన శిక్షణ

వింజమూరు: వింజమూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ శిబిరంలో 84 పంచాయతీల అధికారులు, ప్రజాప్రతినిధులకు చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ జీరోవేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. దీనివల్ల గ్రామాల్లో శుభ్రతతోపాటు, పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు.

వైసీపీకే ప్రజాదరణ

ఆత్మకూరు: నంద్యాల ఉప ఎన్నికలో ప్రజలను ప్రలోభాలకు గురి చేసి, విజయం సాధించడం గొప్పకాదని, ప్రజాదరణ వైసీపీకే ఉందని వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, ముస్లిం మైనార్టీ నాయకుడు సయ్యద్ జమీర్‌బాష పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీ 150 కి పైగా స్థానాల్లో గెలుపొంది జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొండా స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు

అందరికీ అదే దారి

అయినా నిర్లక్ష్యమే!



దెబ్బతిన్న వంతెనపై వెళుతున్న విద్యార్థులు

- కూలిన వంతెన
- నెల రోజులుగా ఆగిన బస్సు సర్వీసు
- అవస్థల్లో ప్రజలు, విద్యార్థులు

ఏఎస్‌పేట: ప్రభుత్వ కార్యాలయాల న్నింటికీ ప్రధాన రహదారి. మండలస్థాయి అధికారులు ప్రతి రోజు ఈ దారిలోనే వెళుతుంటారు. . ఈ మార్గంలోని వంతెన చాలాభాగం కూలిపోయినా, మిగిలిన నాలుగు అడుగుల రోడ్డు మీదే వెళుతు న్నారు తప్ప, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏఎస్‌పేట బస్టాండ్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, గండువారిపల్లి, పందిపాడు గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న వంతెన మధ్యలోని కొంత భాగం నెల రోజుల క్రితం కూలిపోగా, నాలుగు అడుగుల వెడల్పుతో రోడ్డు మిగిలింది. దీంతో నెల రోజులుగా ఆ మార్గంలో నడిచే బస్సు సర్వీసు నిలిచిపోయింది. మిగిలిన రోడ్డులో ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉండడంతో గండువారిపల్లి, పందిపాడు గ్రామాలకు వెళ్లేందుకు ప్రస్తుతం అవే దిక్కయ్యాయి. కాగా, మిగిలిన రోడ్డు కూడా ఎప్పుడు ఆ రోడ్డు కూడా ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యార్థులకు తప్పని తిప్పలు

కూలిన వంతెన కారణంగా గండువారిపల్లి మోడ్రన్‌స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాఠశాల వరకూ వెళ్లే బస్సును బస్టాండ్ సెంటర్‌లోనే ఆపే స్తుండడంతో, సుమారు ఒకటిన్నర కిలో మీటరు దూరం పుస్తకాల సంచీ మోసు కుంటూ పాఠశాలకు చేరుకోవాల్సి వస్తోంది.

ప్రమాదం జరిగితే అంతే ..

ఇటీవల గండువారిపల్లిలో గుడిసెకు మం టలు అంటుకోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమా చారం అందించారు. వారు సకాలంలో స్పందించినా వంతెన మీదుగా వెళ్లే అవ కాశం లేకపోవడంతో అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. దీంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. గండువారిపల్లి, పందిపాడు గ్రామాల్లో అత్యవసర వైద్య సేవలు అవసరమైతే 108 వాహనం కూడా వెళ్లే పరిస్థితి లేదు.

రైతులకూ సమస్యే..

మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం నుంచి విత్తనాలు, ఎరువులు తెచ్చుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల క్రితం వంతెన ప్రమాదకరంగా మారినా, చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆలస్యమవుతోంది

వంతెన దెబ్బతినడంతో నెల రోజులుగా బస్సులు రావడం లేదు. బస్టాండ్‌లో బస్సు దిగి సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వచ్చేలోగా ప్రార్థన అయిపోయి తరగతులు ప్రారంభమవుతున్నాయి.

- వంశీ, విద్యార్థి

బ్యాగు మోయడం కష్టంగా ఉంది



బ్యాగు మోసుకుని పాఠశాలకు నడిచి వెళ్లాలంటే కష్టంగా ఉంది. పాఠశాలకు వెళ్లేలోగా ఆలస్యమవుతుంది. వంతెనకు మరమ్మతులు చేసి, బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

- బాల్జీ, విద్యార్థి



మరమ్మతులు చేయాలి

నెల రోజులుగా వంతెన అధ్వానంగా మారినా, అధికారులు, పాలకులు ప్రతిరోజూ దాని మీదే వెళుతున్నారు తప్ప మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా వారు స్పందించాలి.

- ఖాజారంతుల్లా, గండువారిపల్లి

త్వరలో పనులు చేపడతాం

వంతెన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. డైవర్షన్ రోడ్డుకు రూ.1.30 లక్షలు మంజూరు చేశాం. వెంటనే పనులు ప్రారం భిస్తాం.

- రమణయ్య, ఎంపీడీవో, ఏఎస్‌పేట

ఉత్తరకాలువ పనులు జరగనివ్వం

- అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

ఏఎస్‌పేట: మండలంలోని హసనాపురం గ్రామంలో ఉత్తర కాలువ పనులను బుధవారం పలువురు రైతులు అడ్డుకున్నారు. ప్లాన్ ప్రకారం కాకుండా అక్రమంగా తమ పొలాల్లో కాలువ పనులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుడైన బషీర్ అనే రైతు ఉత్తర కాలువకు 29 సెంట్లు, మాబు అనే రైతు 16 సెంట్లు ఇచ్చి ప్రతిఫలం పొందారు. అయితే, బషీర్ పొలంలో 45 సెంట్లలో, మాబు పొలంలో 30 సెంట్లలో, అసలు ప్లాన్‌లోనే లేని చిన్నహజరత్‌రెడ్డి పొలంలోని 35 సెంట్లలో కాలువ పనులు చేపట్టారు. దీంతో వారు పనులు అడ్డుకున్నారు. అధికారులు భూస్వాముల కొమ్ముకాస్తూ కాలువ పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాన్ ప్రకారం పనులు చేపట్టకపోతే ఉత్తరకాలువ పనులు జరగనివ్వబోమని హెచ్చరించారు.

ఎర్ర చందనం పరిరక్షణ అందరి బాధ్యత

అనంతసాగరం: ఎర్రచందనం విలువైన సంపద, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. మండలంలోని చిలకలమర్రి గ్రామస్థులకు బుధవారం ఎర్రచందనంపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు, వాహన యజమానులను ప్రలోభపెట్టి , స్మగ్లర్లు ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రోత్సహిస్తున్నారన్నారు. వారి ప్రలోభాలకు లొంగరాదని సూచించారు. ఎర్రచందనం చెట్లు నరికినా, రవాణా చేసినా, సహకరించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమం డీఆర్‌వో రామకృష్ణ పర్యవేక్షణలో జరిగింది. ఎర్రచందనం మీకు వందనం అనే లఘుచిత్రం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ అమీనయ్య, సిబ్బంది సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, పాపారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎర్రచందనంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెటర్నరీ ఉద్యోగుల సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లురెడ్డి

ఏఎస్‌పేట: పశుసంవర్థకశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏఎస్‌పేట పశు వైద్యాధికారి వెంకటేశ్వర్లు రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నెల్లూరులో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు నూతనంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడుగా వసంతరావు, ఉపాధ్యక్షుడుగా శ్రావణ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా మహమ్మదాలీ, ట్రెజరరీగా సుబ్బానాయుడు ఎంపికయ్యారు.

బొగ్గేరులో నీటి ప్రవాహం

మర్రిపాడు: నన్నువారిపల్లి వద్ద ఉన్న బొగ్గేరులో నీరు ప్రవహి స్తోంది. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఉప్పు వాగు ద్వారా నీరు చేరింది. నాగినేనిగుంట, కంప సముద్రం, పెగళ్ళ పాడు, తదితర చెరువుల్లో కొద్దిగా నీరు చేరింది.

వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు

మర్రిపాడు: మర్రిపాడు బాలుర, బాలికల వసతి గృహాలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళ వారం దోమల నివారణకు కీటక జనిత వ్యాధుల కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. 25 శాతం మలాథియాన్ స్ప్రే చేశారు. ఫాగింగ్ చేపట్టారు. దోమతెరలను కచ్చితంగా వాడాల న్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమాధికారులు అంకయ్య, సూపర్‌వైజర్లు ఖాజామొహిద్దీన్, సైదా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

ఏఎస్‌పేట: చిరమన గ్రామంలోని కంచర్ల శేషయ్యనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తూ, ఇటీవల బదిలీ అయిన పులి శ్రీనివాసులు, జె.అంకులయ్య, పొనుగోటి వెంకటేశ్వర్లు, చిట్టుకూరు మోహన్‌రెడ్డి, డేగా పెంచలప్రసాద్ బుధవారం హెచ్‌ఎం పణీంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ హాస్పిటల్ ట్రస్ట్ తరపున అంకయ్యనాయుడు, కంచర్ల సురేంద్ర, శ్రీహరినాయుడు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలుకు జోరుగా ఇసుక రవాణా

అనంతసాగరం: పడమటికంభంపాడు ఇసుకరీచ్ నుంచి అధికలోడుతో కడప జిల్లా బద్వేల్‌కు ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. సోమశిల ఎస్‌ఐ సెలవులో ఉండడంతో, ఇదే అదనుగా ఇసుక రవాణాదారులు జోరు పెంచారు. బద్వేలులో ఇసుకకు డిమాండ్ అధికంగా ఉండడం అక్రమ రవాణాకు కారణమవుతోంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఆత్మకూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మధుసూదన్‌రావు, నెల్లూరు బ్లడ్‌బ్యాంక్ జిల్లా కో-ఆర్డినేటర్ మోపూరు భాస్కర్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరు బ్లడ్‌బ్యాంక్ బృందావనం నేతృత్వంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 132 యూనిట్లను విద్యార్థులు దానం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ ఆత్మకూరులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అనూహ్యస్పందన లభించిందన్నారు. గూడూరు, కావలి, తదితర ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రక్తదానానికి ముందుకొచ్చిన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, సహకరించిన కరస్పాండెంట్ వసంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ మారంరెడ్డి వెంకటేశ్వర్లు, ఏవో శిరీష, షేక్ రషీద్, పెద్దింటి మహేష్, కోనంకి యానాదినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రావు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని పలు పాఠశాలల సమీపంలో పారిశుధ్య పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు కె.నాగవినీత్ కోరారు. బుధవారం ఆయన పలు పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. జ్యోతినగర్ పాఠశాల పక్కన ఉన్న మురుగు కాలువ చెత్తతో నిండి దుర్వాసన వెదజల్లుతుండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. బడి చుట్టుపక్కల పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు.వెంటనే తగిన చర్యలు తీసుకుని విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. ౨ చిన్నబాబు, మహీద్, జీవన్ పాల్గొన్నారు.

ఆపస్ సభ్యత్వ నమోదు

సంగం: మండల పరిధిలోని కొరిమెర్ల, తలుపూరుపాడు గ్రామాల్లో బుధవారం ఆపస్ నేతలు సభ్యత్వ నమోదు కార్య క్రమాన్ని చేపట్టారు. ఆపస్ నిరంతరం ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దశరథరామయ్య తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యా యులకు సభ్యత్వం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సంగం: మండలంలోని మర్రిపాడు, జంగాలకండ్రిగ పాఠశాలల్లో స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి అబ్దుల్‌హమీద్ మాట్లాడుతూ స్ఫూర్తి సేవా సంస్థ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించడం హర్ష ణీయమన్నారు. మరిన్ని సేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సంస్థ నిర్వాహకుడు ప్రసాద్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ రికార్డుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్

గూడూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం భూ రికార్డుల నిర్వహణపై రాష్ట్ర సచివాలయం నుంచి సీసీఎల్‌ఏ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలతోపాటు రికార్డుల నిర్వహణ, వెబ్‌ల్యాండ్ తదితర అంశాలపై సూచనలు అందజేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో అరుణ్‌బాబు, తహసీల్దారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి బుధవారం ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు అందిస్తుంటారన్నారు. రికార్డుల సవరణను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టామన్నారు.

డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం


డాక్టర్ రేవతీదేవిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గూడూరు(రూరల్): స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేవతీదేవిని సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సీఆర్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆర్డీవో అరుణ్‌బాబు చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నారన్నారు. దీంతో తమ కళాశాల సిబ్బందితో కలిసి ఆమెను సన్మానించామన్నారు. ప్రిన్సిపాల్ పనితీరుకు ఈ అవార్డు నిదర్శనమన్నారు. అదేవిధంగా తెలుగు అధ్యాపకురాలు ఈశ్వరమ్మను సావిత్రీ బాయిపూలే స్వచ్ఛంద సంస్థ జిల్లా స్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలిగా అవార్డు ఇవ్వడంతో ఆమెను సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో జానకిరామిరెడ్డి, ఆదిశేషారెడ్డి, భారతీలక్ష్మి, భవాని, విజయకళ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గూడూరు(రూరల్): స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేని విద్యాసంస్థలను రద్దు చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 10 కళాశాలలు అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అనుమతులు లేని కళాశాలలో చదవడం వలన విద్యార్థులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అధికారులు స్పందించి అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, పవన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయించాలని వినతి

గూడూరు: గౌడ కులస్థులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయించాలని బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద మండల పరిధిలోని చెన్నూరు గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ తమకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయిస్తే ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వీలుంటుందన్నారు. దీంతో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బీసీ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి అర్హులైన అందరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దేగపూడి కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గౌడ కులస్థులు

కోలాహలంగా వినాయకుడి గ్రామోత్సవం

గూడూరు: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలను బుధవారం యువత కేరింతల నడుమ సందడి వాతావరణంలో నిమజ్జనానికి తరలించారు. ఈ నెల 25న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని వివిధ కూడళ్లలో ప్రత్యేక మండపాలను రూపొందించి భారీ గణనాథులను కొలువు తీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ప్రత్యేక వాహనాలలో వినాయక విగ్రహాన్ని ఉంచి తప్పెట్లు తాళాలు నడుమ తీన్‌మార్ బ్యాండ్, నవరంగ్ బ్యాండుల నడుమ యువత చిందులు వేస్తూ రంగులు చల్లుకుంటూ గణపతి బప్పా మోరియా అంటూ ఉత్సాహంగా గ్రామోత్సవం నిర్వహించి వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం సముద్రతీరంలో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు తరలించడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో స్థానిక ముత్యాలపేటలో ఉంచి పూజలు చేసిన వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేక పూల ఆర్చి అలంకారంలో ఉంచి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


గ్రామోత్సవంలో వినాయకుడు


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

గూడూరు: అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జీఎస్ఆర్ మున్సిపల్ పాఠశాలలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు ఫల సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ నిర్వాహకుడు తాజుద్దీన్ పట్టణంలోని పలువురు దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అదేవిధంగా బక్రీద్ పండుగను పేద ముస్లింలు ఆనందంగా జరుపుకునేలా వారికి ఫల సరకులను అందించారన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో సేవ చేయడం ద్వారా పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ ఇజ్రాయిల్‌కుమార్, శ్రీనివాసులు, ట్రస్ట్ నిర్వాహకుడు తాజుద్దీన్, అరవ పార్వతయ్య, రహీం, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.


ఫలసరకులు అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

రైల్లో నుంచి పడి ప్రయాణికుడికి తీవ్రగాయాలు

గూడూరు(టౌన్): గూడూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని ఓ ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. హౌరా నుంచి యశ్వంత్‌పూర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తూ గూడూరు స్టేషన్‌లో రైల్లో నుంచి కిందపడి గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రయాణికుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు.

హుండీ లెక్కింపు

చిల్లకూరు: మండలంలోని కలువకొండ తిప్పపై వెలిసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం ఆలయ ఈవో కోపూరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరు నెలలకు సంబంధించి రూ.1.10 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడుతా శ్రీనివాసులు, ఆనందరావు, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు


మాట్లాడుతున్న ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు


వాస్తు పూజ చేస్తున్న పండితులు

గూడూరు(టౌన్): స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి శనివారం వరకు వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక దేవస్థానంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారికి పవిత్రోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం అంకురార్పణ కార్యక్రమంతో మొదలయ్యాయన్నారు. వాస్తుపూజ నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం గరుడసేవ, గ్రామోత్సవం, శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. భక్తులు ఈ వేడుకలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బాలయ్య, బైనా కృష్ణవేణమ్మ, సుధాకర్, ప్రధాన అర్చకులు వాచస్పతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

చిల్లకూరు: చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, విమలమ్మ, బాబురావు, రాజశేఖర్, రత్నమ్మ, చంద్రయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న సభ్యులు

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	వివేకం
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	వీఐపీ 2
సంగం:	అర్జున్‌రెడ్డి

కోట

ఆర్ఆర్‌టీ :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి


ఎడారిని తలపిస్తున్న స్వర్ణముఖి బ్యారేజీ

వరి సాగు భారం!

- ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- గిట్టుబాటు నామమాత్రం
- వెంటాడుతోన్న ప్రకృతి వైపరీత్యాలు
- రైతులకు తప్పని కష్టాలు

గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో 36 వేల మంది రైతులు భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. 30 వేల హెక్టారులలో వ్యవసాయం చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి, తదితర కారణాలతో నష్టాలపాలవుతున్నారు.

● రుణాలేవి..

రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వారికి రుణాలను సక్రమంగా అందించడంలో చిత్తశుద్ధి ప్రదర్శించలేకపోతోంది. అరకొరగా రుణాలిస్తున్న బ్యాంకర్లు హెక్లార్ల ప్రకారం సర్ చార్జీల పేరుతో నగదు వసూలు చేస్తున్నారు. మరో పక్క రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగక మళ్లీ రుణాలు పొందలేక పోతున్నారు.

● గిట్టుబాటు ధర ఏదీ..

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోంది. దీంతో దళారుల దోపిడీకి రైతులు గురవుతున్నారు. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు రైతులు పండించే ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదు.

● మొక్కుబడిగా విత్తన సరఫరా..

డివిజన్ పరిధిలో 30 వేల హెక్టారులు సాగు భూమి ఉంది. హెక్టారుకు 70 కేజీల చొప్పున, 30 వేల హెక్టారులకు 21,00,000 క్వింటాల విత్తనాలు అవసరమవుతాయి. కానీ ప్రభుత్వం ప్రతి ఏటా 20 శాతం విత్తనాలను మాత్రమే పంపిణీ చేస్తోంది. మిగతా 80 శాతంలో 40 శాతం ప్రైవేటు డీలర్ల వద్ద, మరో 40 శాతం రైతులు దాచుకున్న విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఆ విత్తనాల్లో కూడా నాణ్యత లోపించడంతో ఈ రకంగానూ రైతులు నష్టాలకు గురవుతున్నారు.

● బ్లాక్‌లో ఎరువులు..

పంటల సాగుకు అవసరమైన ఎరువులను డీలర్లు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో రైతులకు పెనుభారంగా మారాయి. ఎరువులు, పురుగు మందులపై పన్నులు పెంచి రైతులపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది తప్ప రైతు ప్రయోజనాలు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

మారుతున్న కాలంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను వెంటాడుతోన్నాయి. అతివృష్టి, అనావృష్టిల కారణంగా వ్యవసాయమంటేనే రైతులు జంకుతున్నారు. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధర, కూలీల పెంపు, సాగునీటి కొరతతో వరి సాగు రైతులకు భారంగా మారింది. అష్టకష్టాలు పడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం వ్యయప్రయాసలకోర్చిన రైతులకు చివరకు ఫలితం దక్కడం లేదు. దళారులు వారి కష్టాన్ని దోచుకుపోతున్నారు. దీంతో వరిసాగుపై ఆశలు వదులుకొంటున్న రైతులు కూలీలుగా మారుతుండటంతో సిరులు పండే భూముల్లో బీటలువారి ముళ్ల కంప చెట్లు దర్శనమిస్తున్నాయి. కాలం మారినా, పాలకులు మారినా అన్నదాతల కష్టాలు మారలేదు. పంటల సాగుకు జీవితాలను పణంగా పెడుతున్నా, జీవిత భద్రత గగనంగా ఉంది. పంట రుణాల నుంచి ప్రతిదానికి రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వ విధానాలు సైతం రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు బలవన్మరణాలకు గురవుతున్నారు.

- వాకాడు

● సాగునీటి కొరత..

తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ వేరే దారిలేక వేసిన పంటను కాపాడేందుకు సాగునీరు కోసం రైతులు పడుతున్న ఇబ్బం దులు వర్ణనాతీతం. సాగునీటికి మంత్రులను ఆశ్రయించిన రైతులకు చుక్కెదురై గత రబీ సీజన్‌లో వందల ఎకరాల్లో వరి పంటను పశువుల మేతగా వదిలేశారు.

● అధునీకరణ పేరుతో అవినీతి..

కాలువల ఆధునికీకరణ, నీరు-చెట్టు పేరుతో అవినీతి రాజ్యమేలుతోంది. కాలువలు, చెరువులు బాగై రైతులకు సాగు నీరు సక్రమంగా అందే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పనులను కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

● కౌలు రైతుకు గుర్తింపు కరువు

డివిజన్ పరిధిలో వ్యవసాయశాఖ ద్వారా గుర్తించే సీవోసీ కౌలు రైతులు 1,223 మంది ఉండగా, రెవెన్యూశాఖ ద్వారా గుర్తించే ఎల్‌డీసీ కౌలు రైతులు 1,130 మందిని ఆయా శాఖ అధికారులు గుర్తించి అర్హత పత్రాలు జారీచేశారు. వాస్తవానికి డివిజన్ పరిధిలో 10 వేలకు పైగా కౌలు రైతులు ఉన్నట్లు ప్రభుత్వం అంచనా. అయితే రెవెన్యూశాఖ, వ్యవసాయశాఖ అధికారులు 2353 మందిని మాత్రమే కౌలు రైతులుగా గుర్తించారు. వ్యవసాయశాఖ ద్వారా కౌలు రైతు పత్రాలు పొందిన 1,223 మందిలో 116 మంది, రెవెన్యూ శాఖ ద్వారా పత్రాలు పొందిన 1,130 మందిలో ఏడుగురుతో కలిపి 127 మందికి మాత్రమే బ్యాంకర్లు కేవలం రూ.85 లక్షల రుణాలు మంజూరు చేశారు. ఇలా అనేక రకాలుగా వ్యవసాయం రైతులకు భారంగా మారుతోంది. దేశానికి వెన్నెముక రైతు అని చెబుతున్న మాటకు ప్రభుత్వం ఆసరా కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

రైతులకు సంక్షేమ పథకాలు ఉన్నాయి

ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశ పెడుతోంది. వాటిని సక్రమంగా అమలు చేస్తుంది. సబ్సిడీ రుణాలు, రాయితీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు సరఫరా చేస్తున్నాం. అవసరమైన రైతులు సకాలంలో వీటిని సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలి.

- నర్సోజీరావు, ఏడీఏ, వ్యవసాయశాఖ

వ్యవసాయం భారమైంది



దుక్కులు దున్నేటప్పటి నుంచి చివరికి ధాన్యం అమ్ముకునే వరకు రైతులకు అన్నీ కష్టాలే. మొలకెత్తని నకిలీ విత్తనాలు, అధిక ధరలతో ఎరువులు, అందని సాగునీరు, దక్కని గిట్టుబాటు ధర ఇలా అన్ని విధాల రైతులు నష్టపోతుండటంతో వ్యవసాయం భారంగా మారింది.

- రాయపు మస్తానయ్య

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వాలు మారుతున్నా, రైతుల తలరాతలు మాత్రం మారడం లేదు. ఆది నుంచి రైతు కష్టాలతోనే జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న రైతు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకారం అందించి ఆదుకోవాలి.

- శీనయ్య రైతు

విద్యార్థులను ఆదుకుంటాం

గూడలి(కోట): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ పాఠవాలు కలిగిన విద్యావిద్యార్థులను ఆదుకుంటామని పలువురు దాతలు అన్నారు. మండల పరిధిలోని గూడలి ప్రాథమికోన్నత పాఠశాలలో వందమంది విద్యార్థులకు బుధవారం దాతల సహకారంతో బస్‌పాసులు పంపిణీ చేశారు. ఇక్కడ ఉన్న విద్యార్థులకు వాకాడు ఆర్టీసీ డిపో సిబ్బంది సహకారంతో దాతలు గౌరబత్తిన సోమశేఖర్, పవన్‌కుమార్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, పరంధామిరెడ్డిల దాతృత్వంతో ఉచితంగా బస్‌పాసులను అందజేశారు. అనంతరం దాతలు మాట్లాడుతూ ప్రతిభా పాఠవాలు కలిగిన విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు తాము ముందుంటామన్నారు. పాఠశాలలో విద్యాప్రమాణాల మెరుగునకు తమవంతు సహకారం అందిస్తామనారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ఎల్లసిరి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శర్వాని, గ్రామస్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బస్‌పాసులు పంపిణీ చేస్తున్న దాతలు

విద్యానగర్‌లో సంకల్ప సిద్ధి పోటీలు

విద్యానగర్(కోట): మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థలలో బుధవారం ప్రధానమంత్రి సంకల్ప సిద్ధి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రోజ్‌మాండ్, ఎంపీడీవో బ్రహ్మయ్య తిలకించారు. ప్రధాన మంత్రి సంకల్ప సిద్ధి కింద జిల్లాలో కోట మండలం ఎంపికైంది. దీనిని పురస్కరించుకుని గురువారం పలువురు స్వాతంత్ర్య సమర యోధులు, పలు రంగాలలో ఉన్న నిష్ణాతులను సన్మానించనున్నారు. అదేవిధంగా మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. అందులో భాగంగానే ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలలో పలు క్రీడలకు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గురువారం ఉదయం పట్టణంలో భారీ ప్రదర్శనతో పాటు జిల్లాకు చెందిన ప్రముఖులు ఈ సంకల్పసిద్ధి కార్యక్రమాన్ని హాజరవుతారని ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు.


పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

42 పక్కాగృహాల మంజూరుకు ప్రతిపాదనలు

కోట: మండలంలోని కేశవరం పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న నక్కలి సామాజిక వర్గం వారికి 42 పక్కా గృహాల మంజూరుకు ప్రదిపాదనలు పంపినట్లు గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. కోటలోని గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. కేశవరం సమీపంలో నివాసం ఉంటున్న నక్కల సామాజిక వర్గం వారు తమకు ఇంటి నివేశన స్థలాలు ఉన్నప్పటికీ పక్కాగృహాలు లేవని కలెక్టర్ ముత్యాలరాజుకు ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారి గృహాలను పరిశీలించి అర్హులైన 42 మందికి పక్కాగృహాలు మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఎన్టీఆర్ పక్కాగృహాలు నిర్మంచుకుంటున్న వారికి తక్షణం బిల్లులు చెల్లించేలీ చర్యలు చేపట్టామన్నారు.

ఆవుల తరలింపుపై కేసు

నాయుడుపేటరూరల్ : ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు జంతు సంరక్షణ సంఘ సభ్యులు నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. మనోబోలు సంత నుంచి చెన్నైకు తరలిస్తూ మార్గ మధ్యలో నాయుడుపేట వద్ద ఆగడంతో ఆమేర గుర్తించిన జంతు సంరక్షణ సంఘ సభ్యులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేర పోలీసులు కేసు నమోదు చేసి ఆవులను అదుపులోకి తీసుకొని తిరుచానూరులోని గో సంరక్షణశాలకు తరలించినట్లు తెలిపారు.

భూసార పరీక్ష కార్డు తప్పనిసరి

- వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్


సమావేశంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

నాయుడుపేటరూరల్ : ప్రతి రైతు భూసార పరీక్ష వివరాల జాబితా కార్డును కలిగి ఉండాలని తద్వారా ఏఏ పంటలు సాగుకు అనుకూలమో స్పష్టంగా తెలుస్తుందని వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ అన్నారు. నాయుడుపేట మండల పరిషత్‌కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వ్యవసాయశాఖ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షల ద్వారా ఆయా ప్రాంతాల భూముల స్వభావం తెలుస్తుందన్నారు. రైతుల వద్ద భూసారపరీక్ష జాబితాలు లేకుంటే క్షేత్రస్థాయిలో పనిచేసే ఎంపీఈవోలు, ఏఈవోలపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం ఏర్పడటంతో ప్రత్యామ్నాయమైన ఆరుతడి పంటలైన వేరుశెనగ, సజ్జలు, పెసలు, మినుము, నువ్వులు, జొన్నలు, రాగులు, కంది వంటి పంటలు సాగుచేపట్టాలన్నారు. ఈ పంటలు కేవలం 70 నుంచి 90 రోజులలోపు పంట ఫలితాలు చేతికి అందుతాయన్నారు. రసాయన ఎరువుల వాడకం ద్వారా పంటసాగుకు అధిక వ్యయం అవుతుందని సాంప్రదాయ సేంద్రీయ ఎరువుల ద్వారా తక్కువ ఖర్చుతో అధిగ దిగుబడులను సంపాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు అనిత, రాజ్‌కుమార్, నర్సోజీరావు, ఏవో వేణుగోపాల్, నందిమండల కవిత, మండల వ్యవసాయాధికారులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న లారీ

- ప్రయాణికుడికి స్వల్పగాయాలు


దెబ్బతిన్న ఆర్టీసీ వెనుక భాగం

తడ : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఓ లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. సూళ్లూరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు తడ మీదుగా తిరుపతికి బయలుదేరింది. మార్గమధ్యలో చేనిగుంట గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన అల్లిముత్తు ఈ బస్సును ఆపి బస్సులోకి ఎక్కాడు. ఈ సమయంలో అదే దారిలో చెన్నై వైపునకు వెళ్తున్న లారీ ఈ బస్సును వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అల్లిముత్తు బస్సులోనే కిందపడిపోవడంతో స్వల్పగాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు వెనుకభాగం చాలా వరకు నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచయ్య

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట పట్టణం ఏటిగట్టుకాలనీలో నివాసం ఉంటున్న ఎ. చెంచయ్య గుళికల మందుతిని బుధవారం ఆత్మహత్యకు పాల్పాడ్డాడు. స్థానికుల కథనం మేరకు కాలనీలో నివాసం ఉంటున్న చెంచయ్య కుటుంబకలహాలతో తన పెద్ద కుమారుడు దగ్గర జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఓ విషయంపై కుటుంబసభ్యులతో తగాదాపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చెంచయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యసేవలకై నెల్లూరుకు తరలించారు.

టీ దుకాణంలో చోరీ

తడ : టీ దుకాణంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బీపీసీ పెట్రోల్ బంకుకు సమీపంలో టి. సుబ్రహ్మణ్యం టీ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి దుకాణం తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. గల్లాపెట్టెలో, పక్కన ఉన్న హుండీలలో 8వేల నగదుతోపాటు ఒక హోం థియేటర్, సిగిరెట్లు, బిస్కెట్లు వంటివి చోరికి గురైనట్లుగా బాధితుడు గుర్తించి ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

తడ : సెల్‌ఫోన్‌లను లాక్కొని పారిపోయే దొంగలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు బుధవారం పూడి జాతీయ రహదారి వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకొంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి ఆ సెల్‌ఫోన్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు లాక్కొని పారిపోయారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు వారిని వెంబడించి చేనిగుంట జాతీయ రహదారి వద్ద వారిని పట్టుకున్నారు. పట్టుబడ్డవారు చెన్నై పెరంబుదూరుకు చెందిన ఎన్. అరుణ్‌కుమార్, డి. శ్రీనివాసులుగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యక్షురాలి మృతి మండలానికి తీరని లోటు

- మండల సమావేశంలో వక్తలు
- సంతాప తీర్మానంతో ముగింపు

ఓజిలి: మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జగన్నాటి లక్ష్మి మృతి ఓజిలి మండలానికి తీరని లోటని ఎంపీడీవో నారాయణ అన్నారు. ఓజిలి మండల సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షుడు పసుపులేటి రమేష్ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు రెండు నిమిషాలు మౌనంపాటించి సమావేశాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంతో చురుకుగా విధులు నిర్వహించే లక్ష్మీ మృతి విచారకరమన్నారు. ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమం అనంతరం ఏకగ్రీవంగా అందరూ సంతాపం ప్రకటిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో తహసీల్దారు సత్యవతి, సీనియర్‌నాయకులు వల్లూరు సూర్యప్రకాశరావు, కుందాం సొసైటీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నల్లమాకుల కమలాకర్ బాబు, తెలుగురైతు సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, పలు శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న కుందాం సొసైటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

చెట్లను చూస్తే ‘ఉక్కు’ గుర్తొస్తారు..

- సంతాప సభలో నేతల కంటకన్నీరు


జనార్ధన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

చిట్టమూరు : చిట్టమూరు నుంచి కొత్తగుంట మార్గంలో ఉండే పచ్చటి చెట్లను చూస్తే దివంగత ఉక్కు జనార్ధన్ కళ్లముందు కదలాడుతున్నట్లుగా ఉంటుందని పలువురు నేతలు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఉక్కు జనార్ధన్ సంతాప సభ జరిగింది. టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో జనార్ధన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సంతాపసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న పలువురు జనార్ధన్ సేవలను గుర్చు చేసుకుంటూ కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జనార్ధన్ సొంత నిధులతో 200 మొక్కలు నాటించగా అవి ఇప్పుడు చెట్లుగా మారాయని అన్నారు. కాగా ఆ చెట్ల కింద బండలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జనార్ధన్ సేవలు, దాతృత్వాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సభలో సంతాపం తెలియజేసే సమయంలో చిట్టమూరు సింగిల్ విండో అధ్యక్షుడు వెదనపర్తి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, ఎల్లూరు సర్పంచ్ శ్రీపతి రత్నమ్మ, ఇతర నాయకులు ఆయన సేవలను గుర్తుచేసుకొంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చిన్నారావు, ఉపాధ్యక్షురాలు మంజులమ్మ, గణపర్తి గోపాల్‌నాయుడు, ఎంపీపీ సోదరుడు ఉక్కు చిన్నబ్బయ్య, సుబ్బరామయ్య, గోపాల్‌నాయుడు, చిరంజీవిరెడ్డి, సర్పంచులు శ్రీనివాస్, రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు సుభాషిణి, వేణురెడ్డి, రాజేష్‌రెడ్డి, గిరినాయుడు, జనార్ధన్‌రెడ్డి, గుంపర్ల శ్రీనివాసులు, బషీర్‌బాబురెడ్డి, సురేష్‌లతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరవపాళెం పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం


ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్టమూరు : మండల పరిధిలోని అరవపాళెం ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుల ఆత్మీయ వీడ్కోలుసభ నిర్వహించారు. ఈ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన 10 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు వేణుగోపాల్, అపర్ణదేవి, ప్రసాద్, చంద్రశేఖర్, శివనాగరాజు, శ్రీనివాసులు, కవిత, సుబ్రహ్మణ్యం, శోభాలను సన్మానించగా పీడీ మహిపతిని ప్రత్యేకంగా సన్మానం చేశారు. శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డి. జనరల్ మేనేజర్ ఏఎస్‌రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అరవపాళెం ఎంపీటీసీ సభ్యురాలు దువ్వూరు శిల్ప, స్థానిక బీజేపీనాయకులు శరత్‌చంద్రారెడ్డి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం ప్రత్యేకంగా సన్మానం చేశారు. విద్యార్థులను ఆటపాటల్లో ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడమేకాక ఇతరదేశాలలో క్రీడల్లో పాల్గొని రజకపతకాలు సాధించిన పీడీ మహిపతిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు పద్మనాభయ్య, పూర్వ ఉపాధ్యాయులు రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట సూళ్లూరులోని నేతాజీ ఎయిడెడ్ స్కూల్ విద్యార్థులకు బుధవారం జూనియర్ చాంబర్ నిర్వాహకులు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కారంశెట్టి శ్రీనివాసులు, అలవల సురేష్‌ల సహకారంతో ఈ పంపిణీ జరిగింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందించడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు కొనియాడారు. జూనియర్ చాంబర్ అధ్యక్ష కార్యదర్శులు దుర్గి సుదర్శన్‌గుప్తా, తన్నిరు మనోజ్, మునగా నాగరాజు, కాకి శ్రీరామమూర్తి, భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

‘పిట్ల’ కుటుంబానికి కొండేపాటి పరామర్శ



సుబ్రహ్మణ్యంను పరామర్శిస్తున్న కొండేపాటి, టీడీపీ నేతలు

సూళ్లూరుపేట : మాజీ ఎమ్మెల్యే పిట్ల వెంకటసుబ్బయ్య కుమారుడు మాజీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ పరామర్శించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే పిట్ల వెంకటసుబ్బయ్య మృతి చెందిన నేపథ్యంలో బుధవారం సాయంత్రం కొండేపాటి ఆయన కుటుంబాన్ని పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు. గంగాప్రసాద్‌తోపాటు సుబ్రహ్మణ్యంను పరామర్శించిన వారిలో పెంచలకోన ట్రస్టుబోర్డు ఛైర్మన్ తానంకి నానాజీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఛైర్‌పర్సన్ నూలేటి విజయలక్ష్మి, టీడీపీ నేతలు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, బొమ్మన పళణి, జడ్పీటీసీ శ్రీధర్, తదితరులు ఉన్నారు.

రూ.26 వేలకు వినాయక లడ్డూ



లడ్డూను దక్కించుకున్న పారిశ్రామికవేత్త పెసల కిషోర్‌బాబు

నాయుడుపేట : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కూడళ్ల వద్ద ప్రతిష్ఠించి గణేష విగ్రహాల వద్ద లడ్డూ వేలం జోరుగా సాగుతున్నాయి. పాత బ్రాహ్మణవీధిలోని వళ్లీదేవసేన సమేత శ్రీ షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం చవితి లడ్డు వేలంపాట నిర్వహించారు. దేవుడుపాట 5వేల రూపాయలతో ప్రారంభంకాగా.. 24వేల రూపాయలకు నాగార్జున్‌రెడ్డి, 25వేల రూపాయలకు షేక్. షిరాజ్ వేలం కొనసాగించారు. 26వేల రూపాయలకు ప్రముఖ పారిశ్రామికవేత్త పెసల కిషోర్‌బాబు వినాయక చవితి లడ్డూ కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ చదలవాడ మోహన్‌కృష్ణశర్మ, ముత్యాల్‌రెడ్డి, సునీల్, తదితరులు ఉన్నారు.

10లోగా దుకాణాలకు దరఖాస్తు చేయాలి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 5 గదులకు సెప్టెంబరు 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 20వేల రూపాయల ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని ఆయన చెప్పారు.

తడలో ద్విచక్రవాహనం చోరీ

తడ : ద్విచక్రవాహనం చోరికి గురైందంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కె. వీరముత్తు స్థానిక సర్వీస్ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి ఇంటి వద్ద తన హీరోహోండా ద్విచక్రవాహనాన్ని నిలిపివేసి నిద్రపోయాడు. ఉదయం లేచేసరికి బైక్ కనపడకపోవడంతో సమీప ప్రాంతాల్లో వెతికాడు. కనపడకపోయే సరికి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ విద్యకు గ్రహణం

- కనుమరుగైన వసతి గృహాలు, పాఠశాలలు
- విద్యాసంవత్సరంలో విద్యార్థుల తిప్పలు
- ఆందోళనలో తలిదండ్రులు



మనవాలిలో మూతపడిన ప్రాథమికోన్నత పాఠశాల

ఓజిలి: ప్రభుత్వ వసతిగృహాలు కనుమరుగవుతున్నాయి... అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ విద్యకు గ్రహణం పట్టినట్లయింది. ప్రభుత్వ పాఠశాలలు క్రమేణా రూపుకోల్పోతున్నాయి. రేషనలైజేషన్ పేరుతో విద్యార్థుల సంఖ్యను ముడిపెట్టి ఏకంగా పాఠశాలలను మూసివేస్తున్నారు. కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అంటూ నేతలు వల్లిస్తున్న మాటలు ప్రసంగాలుగానే నిలిపోతున్నాయి. మరోవైపు ప్రభుత్వ చర్యలు కూడా ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు వరంగా మారుతున్నాయి. వెరసి గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ విద్య అందకుండా పోతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

ఓజిలి మండలంలో రెండు ఎస్సీ వసతిగృహాలు, ఒక ప్రాథమికోన్న పాఠశాలను పూర్తిగా ఎత్తివేయగా మరో ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా కిందికి దించివేశారు. ఆయా పాఠశాలలు, వసతిగృహాలలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని అధికారులు ఈచర్యలు తీసుకున్నారు. ఫలితంగా ఆయా గ్రామాలలోని విద్యార్థుల అవస్థలు అంతా ఇంతాకాదు. ఇప్పటివరకు పాఠశాలలు తమకు సమీపంలోనే ఉండటంతో అన్ని వర్గాల విద్యార్థులు శ్రమలేకుండా పాఠశాలలకు వెళ్లి విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలలు మూతపడటంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో కొంతమంది విద్యార్థినీ విద్యార్థుల విద్యాభ్యాసం సజావుగా సాగని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా వసతిగృహాలు మూసివేయడంతో వసతిగృహాల విద్యార్థులు అవస్థలు కూడా వర్ణనాతీతంగా మారాయి.

మూసివేసిన వసతిగృహాలు

మండలంలోని ఆరిమేనిపాడు, కురుగొండ ఎస్సీ వసతిగృహాలను మూసివేశారు. అదే విధంగా మనవాలి ప్రాథమికోన్నత పాఠశాలను కూడా మూసివేశారు. ఫలితంగా ఆయా ప్రాంతాలలోని విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వేరే పాఠశాలలు, వసతి గృహాలలో చేరే క్రమంలో విద్యార్థుల తికమకపడిపోయారు.

తలిదండ్రుల ఆందోళన

గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా స్థాయిని తగ్గించివేయడంతో ఆయా గ్రామాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థుల తలిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని కుంగిపోతున్నారు. విద్యాభ్యాసం కోసం దూర ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలకు పంపాలంటే ఆయా వర్గాలకు తలకు మించిన భారంగా మారుతోంది.

పాఠశాలల స్థాయి తగ్గింపు

మండలంలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని ఆయా పాఠశాలలలో తరగతులను కుదించివేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలుగా వున్న పలు పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా మారాయి. మండలంలోని వజ్జావారిపాళెం, గుర్రంకొండ, కుందాం, రాచపాళెం, కారూరు, వీర్లగునుపాడు గ్రామాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలు ఈ కోవలోనే ప్రాథమిక పాఠశాలలుగా మారాయి. దీంతో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు ప్రాథమికోన్నత పాఠశాల విద్య సమీపంలో లేకపోవడంతో పలువురు విద్యార్థులు ఇంటివద్దనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక విద్యపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపిస్తే ఇలాంటి పరిస్థితులు ఏర్పడవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చిన్నచూపు తగదు: కంకణాల సత్యవరప్రసాద్‌రావు, ఓజిలి

విద్యార్థి దశలో ప్రాథమిక విద్య అత్యంత ప్రాధాన్యమైంది. ఇక్కడనే విద్యార్థికి మంచి పునాది పడుతుంది. ఇలాంటి విద్యపై చిన్నచూపు తగదు. విద్యాస్థాయిని పెంచడంలో ఎంత శ్రద్ధ తీసుకుంటారో విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు ఆయా ప్రాంతాల ఉపాధ్యాయులు శ్రద్ధతీసుకోవాలి.

గ్రామస్థాయిలో వైసీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ వరప్రసాద్

సూళ్లూరుపేట : గ్రామస్థాయిలో వైసీపీ బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీ వరప్రసాద్ కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక పీవీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో వైసీపీ నవరత్నాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ వరప్రసాద్ 2019 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్ రూపొందించిన నవరత్నాల పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సభలో వైసీపీ నియోజకవర్గ నేతలు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, దువ్వూరు బాలచంద్రారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, మారంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

గ్రామాల్లో గేదెలకు టీకాలు



గేదెలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

ఓజిలి: ఓజిలి మండలం కొండవల్లిపాడు, ఆరిమేనిపాడు గ్రామాలలో బుధవారం గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి సుదర్శన్‌రావు అధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా రెండు గ్రామాలలో 525 గేదెలు, ఇతర జీవాలకు గాలికుంటు వ్యాధి వాక్సినేషన్ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు.

సుస్థిర అభివృద్ధిపై పొదుపు సంఘాలకు శిక్షణ



పొదుపు మహిళలకు శిక్షణ ఇస్తున్న అధికారిణి

దొరవారిసత్రం : దొరవారిసత్రం సంఘమిత్ర కార్యాలయంలో బుధవారం పొదుపు సంఘాల మహిళలకు సుస్థిర అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందటం, తీసుకున్న రుణాల చెల్లింపులు వాటిని సద్వినియోగం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. డీడీఎస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఏపీఎం సుజన, పొదుపు సంఘాల మహిళలతో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ సంస్థ డైరెక్టర్ కొమ్మల శంకర్, ఎస్సీ కార్పోరేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


చిన్న చెరుకూరులో వినాయకుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న యువకులు

వైభవంగా వినాయకుడి గ్రామోత్సవం

తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో మంగళవారం రాత్రి వినాయకుని గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈనెల 25వ తేదీన గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఆరురోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. మంగళవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి విగ్రహం వద్ద లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. రాత్రి 10గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగించారు. బాణ సంచాకాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై పోటీలు


బహుమతి అందజేస్తున్న గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి కిరణ్

పొదలకూరు: పట్టణంలోని నాగార్జున స్కూల్ విద్యార్థులకు బుధవారం సాయంత్రం పొదలకూరు ప్రియదర్శిని ఇండేన్ గ్యాస్ ఏసెన్సీ నిర్వాహకులు ఇంధన పొదుపుపై పలు రకాల పోటీలు నిర్వహించారు. కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖ సూచనల మేరకు పెట్రోలియం కన్సర్‌వేషన్ రీసెర్చి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతిగా ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, తృతీయ బహుమతి నగదు, చతుర్ధ బహుమతిగా సర్టిఫికేట్స్, గిఫ్ట్ వోచర్లు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అడ్వయిజర్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ ఎన్ లక్ష్మీదుర్గ, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు కిరణ్, నాగరాజా, ఉపాధ్యాయులు కిరణ్, శ్రీనివాసులురెడ్డి, సుధామణి పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సహాయం

వెంకటాచలం : మండలంలోని పుంజులూరుపాడు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా బాణాసంచా కారణంగా ఇల్లు కోల్పోయిన పామంజి శైలజకు సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. బుధవారం ఆయన ఆమెను పరామర్శించారు. ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల శ్రేయస్సు కోసం పాటు పడుతున్నారన్నారు. ఇందులో భాగంగానే ఎస్సీ, ఎస్టీలకు నెలకు 55 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నారన్నారు. అధికారులు అర్హులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుంకాల నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు, నాయకలుఉ కుంచి శ్రీనివాసులు, గుమ్మడి రాజాయాదవ్, ఆర్వీఎన్ చౌదరి, వెంకటకృష్ణమనాయుడు, బీ చెన్న కృష్ణయ్య, మురళీధర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

4న కలెక్టరేట్ ఎదుట ధర్నా

పొదలకూరు: పేదలకు పక్కా గహాలు నిర్మించాలని, అర్హులకు భూములు పంచాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 4వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ పెంచల నారాయణ తెలిపారు. బుధవారం ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు. ధర్నాకు ప్రజలు రావాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల వలయంలో బాబానగర్


బురదమయంగా రోడ్డు

తోటపల్లిగూడూరు : పాలకులు మారినా, ఏళ్లు గడుస్తున్నా ఆ ప్రాంత ప్రజల బాధలు అన్నీ ఇన్నీ కావు. డ్రెయినేజీ, రోడ్డు వసతి లేక అగచాట్లు పడుతున్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణం కలగానే ఉందని మండలంలోని వరిగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బాబానగర్ వాసలు వాపోతున్నారు. బాబానగర్ సమస్యల వలయంలో కొట్టు మిట్లాడుతోంది. పలు ఇబ్బందులతో గ్రామస్థులు అల్లాడుతున్నారు. బాబానగర్ వీధిలో దాదాపు 20 ఏళ్లుగా ఎటువంటి మౌలిక వసతులు కల్పించలేదు. ప్రధాన రహదారిసైతం సైడుకాలువలు నిర్మించలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా రో జుల వెం బడి ము రుగునీరు ముందుకు కదలదు. ఆ దారిలోనే ప్రజలు నడవాల్సి వస్తోంది. ఎన్ని రోజులు ఇలా ఇబ్బందులు పడాలని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు జోక్యం చేసుకొని బురదమయంగా ఉన్న రోడ్లు బాగుచేయడంతోపాటు సైడు కాలువలు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు వేడుకుంటున్నారు. ఆ దిశగా పాలకులు, అధికారలు స్పందించాల్సి ఉంది.


అలంకారప్రాయంగా వీధి కొళాయి

ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు



పంచాయతీ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎటువంటి పురోగతి లేదు. చిన్నపాటి వర్షం వచ్చినా రొచ్చులో నడవాల్సిన పరిస్థితి. డ్రెయినేజీ సరిగా లేదు. అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు ఉన్నా మా ఏరియాలో లేవు. పాలకులు, అధికారులు కనికరించాలి.

- మహబాషా, గ్రామస్థుడు

ఎన్నికల ముందే వస్తారు



పాలకులు ఎన్నికల ముందే వస్తారు. ఎన్నో హామీలు ఇస్తారు. గెలిచాక మమ్మల్ని పట్టించుకోరు. తర్వాత మా వైపు కన్నెత్తి చూడరు. వీధులు దరిద్రంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా నడిచే వీలు లేదు. పాలకలుఉ ప్రగల్బాలు చెబుతున్నారే తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. మా గోడు పట్టించుకునే వారే కరువయ్యారు.

-నాగార్జున , గ్రామస్థుడు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్థులు

పొదలకూరు: మండలంలోని బిరదవోలు ప్రాథమికోన్నత పాఠశాల పనిచేస్తూ బది లీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బడుగు హరిబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఏడెనిమిదేళ్లుగా విద్యా బోధన చేస్తూ పలువురు విద్యార్థులను ఉన్నత స్థితికి చేర్చిన నలుగురు ఉపాధ్యాయులు ఒకేసారి బదిలీ కావడం బాధ కలిగిస్తోందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో వచ్చిన వారు కూడా విద్యాభివృద్ధి కృషి చేయాలని కోరారు. సన్మానగ్రహీత, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గ్రామస్థుల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బడుగు వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మనుబోలు : మండలంలోని గొట్లపాళెం ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. ఎనిమిదేళ్లపాటు అత్యుత్తమంగా విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు అజయ్‌బాబు, గీతాకుమారి, సుకన్య, మస్తాన్ బీ శ్రీలత, వడ్లపూడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్. మోహన్‌రావును సర్పంచు ధనెంకుల కృష్ణశ్రీ అభినందించారు. వారితో పాటు గ్రామంలోని విశ్రాంత ఉపాధ్యాయుడు పీవీ రమణయ్యను, ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్ వీ మస్తానమ్మకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్య క్రమంలో ప్రాథ మి కోన్నత పా ఠశాల ప్రధా నోపాధ్యా యుడు ఏ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు దనెంకుల రఘురామనాయుడు, ఉపా ధ్యాయులు పోలయ్య, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.


గ్రామస్థులతో సన్మాన గ్రహీతలు

రూ.2కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం

● టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి


మాట్లాడుతున్న మోపూరు శ్రీనివాసులురెడ్డి

పొదలకూరు: మండలంలో రూ. 2కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మోపూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం కింద నిధులు మంజూరైనట్లు తెలిపారు. పొదలకూరు పంచాయతీకే కోటి రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పొదలకూరు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ మండలానికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు రుణాలు, గీతకార్మికుల కోసం రూ. 5 కోట్లు విడుదల చేయించినట్లు చెప్పారు. సోమిరెడ్డి రాజకీయ చతురతే నంద్యాలలో టీడీపీ విజయానికి కారణమన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కెం బుజ్జిరెడ్డి, ఆ పార్టీ నాయకులు దేరం రఘురామిరెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, వెంపులూరు పుల్లయ్యగౌడ్, షేక్ జమీర్‌బాషా, బొద్దులూరు మల్లికార్జుననాయుడు, కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, రావుల భాస్కర్‌గౌడ్, గంటా మల్లికార్జునయాదవ్, నలగంగు వెంగళ్‌రెడ్డి పాల్గొన్నారు.

'నవరత్నాలు' కరపత్రాల పంపిణీ

ఇందుకూరుపేట : వైసీపీ నాయకులు బుధవారం 'నవరత్నాలు'పై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేస్తోన్న అవినీతి పనులను వివరిస్తూ నవరత్నాలను జగన్ ఎలా అమలు చేస్తారు, పల్లె సీమల అభివృద్ధికి, రైతులకుచేయూత ఎలా అందిస్తారని వివరించారు. మూడేళ్ల గడిచినా రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఆదరించాలని కకోరారు. కార్యక్రమంలో గొల్లపల్లి విజయకుమార్, మావులూరు శ్రీనివాసులురెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

భూసారం ప్రకారమే జింక్, జిప్సమ్ వాడాలి

మనుబోలు : రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగానే జింక్, జిప్సమ్ వాడాలని మండల వ్యవసాయాధికారి శేషగిరిరావు అన్నారు. మండలంలోని ముద్దమూడిలో బుధవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ రైతులకిస్తున్న ఫలితాల కార్డులలో భూసారలోపం 8.5శాతం కంటే ఎక్కువగా ఉంటేనే ఆయా పొలాలకు ఎకరాకు 8 బస్తాల జిప్సమ్ వాడాలన్నారు. జింక్‌లోపం అని తేలితే దానిని పిచికారి చేయాలని సూచించారు. జీలగలు, జింక్, జిప్సమ్ ఈ ధఫా రైతులకు విరివిగా పంపిణీ చేశామని ఏవో తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ముద్దమూడిలో సాగు చేస్తున్న మల్బరీ సాగును పరిశీలించి సబ్సిడీ రూపంలో కావాల్సిన ముడిసరుకును అందజేసే ఏర్పాటు చేస్తామని ఆత్మా బీటీఎం కళారాణి అన్నారు.

చంద్రన్న బీమా నగదు పంపిణీ

సైదాపురం: మండలంలోని గ్రిద్దలూరు పంచాయతీ పరిధిలోని పరసారెడ్డిపల్లి గ్రామం దళితవాడకు చెందిన యాలకల పెంచలయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుని కుటుంబ సభ్యులకు గ్రిద్దలూరు పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ పాములూరి శ్రీనివాసులు నాయుడు చేతుల మీదుగా రూ.5,000 నగదును బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న బీమా పథకం వల్ల పేద ప్రజల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే పేద, బడుగు వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీమా మిత్ర సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ అంటే ఎలా ఉండాలో చూపిస్తా !

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి: బహిరంగ సభ అంటే ఎలా ఉండాలో వైసీపీ నాయకులకు చూపిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. పట్టీ పట్టని గదుల్లో జరిపే దానిని బహిరంగ సభ అనరని వైసీపీ బుధవారం నిర్వహించిన నవరత్నాల సభను పరోక్షంగా విమర్శించారు. దమ్ముంటే బుధవారం తెలుగుదేశం పార్టీ నిర్వహించే సమన్వయ కమిటీ బహిరంగ సభను చూసి తట్టుకోవాలన్నారు. చుట్టపు చూపులా వచ్చి పోయే నాయకులు తెలుగుదేశం పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. పుట్టిన గడ్డను ఉద్ధరించలేని ఆయన వెంకటగిరి ప్రజలను ఎలా ఉద్ధరిస్తారో ప్రజలకు తెలియంది కాదని జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి స్థాయిని మరిచి చంద్రబాబుపై చేసిన విమర్శలే నంద్యాల్లో టీడీపీ గెలుపును ఖరారు చేశాయన్నారు. ఇదే తీర్పు 2019 ఎన్నికల్లో ఇచ్చేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. వైసీపీకి పోగాలం దాపురించే నాయకులు ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో లేని పతకాలను కూడా అమలు చేస్తున్న నాయకుడు చంద్రాబాబేనన్నారు. పేదరికం నిర్మూలనే ధ్యేయంగా పెట్టుకొని పనిచేసే ముఖ్యమంత్రిని విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. గురువారం స్థానిక విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆయన నాయకులతో కలిసి సభ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ గంగోటి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ తాండవ చంద్రారెడ్డి, నాయకులు మంకు ఆనంద్, కేవీకే ప్రసాద్‌నాయుడు, సీసీ నాయుడు, రామచంద్రయ్య, శ్రీరామదాసు గంగాధర్, జొన్నాదుల శ్రీను, తదితరులు ఉన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

● మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి: పట్టణంలో సెప్టెంబరు 13, 14వ తేదీల్లో రెండు రోజుల పాటు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమె విలేఖరులతో మాట్లాడారు. కాలువల్లో సిల్ట్ తొలగింపు కార్యక్రమం నిర్వహించడంతో పాటు, దోమల నివారణకు ఫాగింగ్, మలాథిన స్ప్రే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ పారిశుధ్యం లోపించినా తమ దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతామన్నారు. పారిశుధ్యం మెరుగుకు పుర ప్రజలు సహకరించాలని కోరారు. జ్వరాల బారిన పడిన వారు డెంగ్యూ, మలేరియా టెస్టులు చేయించుకొనేందుకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కిట్లు సిద్ధంగా ఉన్నాయని, టైఫాయిడ్ పరీక్షలు చేయించు కోవాలంటే బంగారుపేట పీహెచ్‌సీలో కిట్లు అదుబాటులో ఉన్నాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు కాచి చల్లార్జిన నీరు తాగడం సురక్షితమని సూచించారు.



మాట్లాడుతున్న దొంతు శారద

సబ్సిడీ రుణాల ఎంపికలో రజకులకు అన్యాయం



నిరసన తెలుపుతున్న రజకులు

సైదాపురం: సబ్సిడీ రుణాల ఎంపికలో రజకులకు అన్యాయం జరిగిందంటూ రజకులు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వెంకటగిరి నియోజకవర్గం రజక సంఘం ఇన్‌చార్జి డక్కిలి కృష్ణమోహన్ మాట్లాడుతూ రజకులకు సబ్సిడీ రుణాల ఎంపికలో ఒక్కరికి కూడా రుణం మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రుణాల ఎంపికలో రజకులకు న్యాయం జరిగేల ఎంపీడీవో విజయ్‌కుమార్‌కు విన్నవించుకున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

వెంకటగిరి: పట్టణంలోని 4, 5 వార్డుల్లో ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్‌కు సామాజిక హక్కులు వేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనతా హాస్పిటల్ డాక్టర్ మారం సుధాకర్, నాయకులు శివకుమార్, చెన్నకేశవులు, రాజేశ్వరి, లక్ష్మి, సుబ్రహ్మణ్యం రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ బహిరంగసభను జయప్రదం చేయండి

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సారథ్యంలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపూరు శ్రీనివాసులు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, సుధా, రవీంద్ర, అడివయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే జైలుకే

డక్కిలి: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఇకపై జైలుకేనని ఎస్ఐ మరిదినాయుడు హెచ్చరించారు. బుధవారం డక్కిలిలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కొండ కింద గ్రామాల ప్రజల సహకారంతో ఈ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికడతామన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

వైసీపీ బలోపేతానికి కష్టపడి పని చేయండి

● తిరుపతి ఎంపీ వరప్రసాద్



మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ వరప్రసాద్

వెంకటగిరి(టౌన్): వైసీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని తిరుపతి ఎంపీ వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక త్రిపురసుందరి కల్యాణ మండపంలో వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన 'నవరత్నాల' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పథకాలు వినూత్నంగా ఉన్నాయన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను భయభ్రాతుల్ని చేస్తున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ దిగజారిందని ఎద్దేవా ఏశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మంటగాల్చారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను తుంగలో తొక్కారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. జడ్పీచైర్మన్, వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ బూత్‌లెవల్ కమిటీల ఆధ్వర్యంలో సంయుక్తంగా పనిచేయాలన్నారు. మా కుటుంబానికి యాభైఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని, ఎవరినీ ఇప్పటి వరకు బెదిరించో, లాక్కునేటటువంటివి ఇప్పటికి చేయలేదని స్పష్టం చేశారు. నా గురించి విమర్శిస్తే వారికి ఎలా బుద్ధి చెప్పాలో అలాగే బుద్ధి చెప్పే గుణమన్నారు. ప్రజా సమస్యల కోసం నిత్యం కృషి చేసే వాడినన్నారు. అనంతరం వైసీపీ నాయకురాలు ధనియాల రాధ మలేషియాలో అథ్లెటిక్స్‌లో పాల్గొని పతకాలు తెచ్చినందుకు, బోగా రాము, పట్నం మునిరాజా, పట్నం మునీంద్రబాబు, పట్నం చీరాలరెడ్డి రాష్ట్రపతి చేతులు మీదుగా అవార్డు తీసుకున్నందుకు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ గుమ్మళ్లపు డిల్లీబాబు, వైసీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, చిట్టేటి హరిక్రిష్ణ, తోట గిరిరెడ్డి, నెమ్మళ్లపూడి సురేష్ రెడ్డి, మేరువ సురేంద్ర, అర్జునగారి మురళి, ముప్పాళ్ల సుబ్రహ్మణ్యం, ధనియాల రాధ, కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, పట్టాభి రామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, శిరీష పాల్గొన్నారు.

పారవోలులో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

పారవోలు(వెంకటగిరి): మండలంలోని పారవోలు గ్రామంలో బుధవారం ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల ట్రెజరర్ టీ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి విద్యార్థి బాధ్యతగా గుర్తించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ మాట్లాడుతూ గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, రవిశంకర్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఎంఈవో ఏకపక్షం

డక్కిలి: ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఎంఈవో వెంకటేశ్వర్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బుధవారం స్థానిక ఏంఈవో కార్యాలయం ఎదుట పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు విలేఖర్లతో మాట్లాడుతూ 2017-18 విద్యా సంవత్సరంకు సంబంధించి సెప్టెంబరు 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులకు ఆ రోజు అవార్డులు ప్రదానం చేస్తారని చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రతి మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక చేయాల్సి ఉందన్నారు. అయితే మండలంలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఎంఈవో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని విమర్శించారు. గతంలో ఎంపిక చేసిన వారిలో కొంత మందిని ఈ దఫా కూడా ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించారు. అదేమని ప్రశ్నిస్తే తానే రాజు.. తానే మంత్రిని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏంఈవో వెంకటేశ్వర్లు తొలి నుంచి వివాదాస్పద నిర్ణయాలు తీసుకొంటూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు తాము జిల్లా విద్యాశాఖ అధికారికి, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళుతామని తెలిపారు. విలేఖర్ల సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరు శ్రీనివాసులు, ఎస్టీయు మండల ప్రచార కార్యదర్శి ఆవుల రామారావు, బీ కోటేశ్వరావు, పీఆర్‌టీయూ నాయకులు రామ్మోహన్ రావు, ఎస్‌కే అబ్దుల్ గఫూర్, డీ సిద్ధయ్య, బీటీఏ నాయకురాలు ఉప్పలూరు సరళకుమారి పాల్గొన్నారు.



విలేఖర్లతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బకాయిలు చెల్లించకుంటే సరఫరా నిలిపివేత

వెంకటగిరి: సబ్‌డివిజన్‌లోని వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో సర్పంచులు చెల్లించ వలసిన వీధి దీపాలు, నీటి మోటర్ల కరెంటు బిల్లులను రెండు రోజుల్లో చెల్లించాలని ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసరావు కోరారు. లేని పక్షంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఆయన హెచ్చరించారు.

సినిమా గైడ్

వెంకటగిరి

త్రిభువని: లై
జ్యోతిమహల్: నేనే రాజు నేనే మంత్రి
భ్రమరాంభ : జయ జానకి నాయక

రాపూరు

శ్రీనివాసమహల్: లై
వేంకటేశ్వరమహల్: జయ జానకి నాయక